www.prajasakti.com
PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 39 Vol సంచిక : 07 No | విజయవాడ, సోమవారం 07 జనవరి 2019 | 12+12 పేజీలు వెల : 4.00 Rs



ఫాలో ఆన్‌లో ఆసీస్

12

రుజువు చేస్తారా.. రాజీనామా చేస్తారా..?

హెచ్‌ఎఎల్ ఆర్డర్లపై రక్షణమంత్రికి రాహుల్ సవాల్



న్యూఢిల్లీ : పార్లమెంట్ శీతాకాల సమావేశాల సందర్భంగా ఇటీవల లోక్‌సభలో రాఫెల్ యుద్ధ విమానాలపై వాడివేడిగా చర్చ సాగింది. హిందూస్థాన్ ఏరోనాటికల్స్ లిమిటెడ్‌కు లక్ష కోట్ల రూపాయల కొనుగోలు ఆర్డర్లను ఇచ్చినట్లు శుక్రవారం లోక్‌సభలో రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ధ్వజమెత్తారు. ప్రభుత్వం ఇచ్చామని చెప్పుకుంటున్న కొనుగోలు ఉత్తర్వులను రక్షణ శాఖ మంత్రి పార్లమెంట్‌లో బహిర్గతం చేయాలని లేని పక్షంలో రాజీనామా చేయాలని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. 'ఒక అబద్ధం చెబితే, దాన్ని కప్పిపుచ్చడానికి మరిన్ని అబద్ధాలు చెప్పాల్సి ఉంటుంది. రాఫెల్ కుంభకోణం నుండి మోడీని రక్షించడానికి, రక్షణ శాఖ మంత్రి పార్లమెంట్‌లో అవాస్తవాలను వల్లేవేశారు. హాల్‌కు ఇచ్చిన లక్ష కోట్ల రూపాయల కొనుగోలు ఉత్తర్వులకు సోమవారం పార్లమెంట్‌లో రుజువులు చూపాలి, లేదా ఆ పదవికి రాజీనామా చేయాలి' అని నిర్మలా సీతారామన్‌ను ఉద్దేశించి రాహుల్ గాంధీ ట్వీట్ చేశారు. హాల్‌ను నిర్వీర్యం చేసి..అనిల్ అంబానీకి కంపెనీకి మేలు కలిగే విధంగా బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని కాంగ్రెస్ మండిపడుతోంది. ఆమె శుక్రవారం పార్లమెంట్‌లో చేసిన వ్యాఖ్యలపై ఆ పార్టీ నేత సూర్జేవాలా మిగతా 9లో



నుజ్జునుజ్జయిన వ్యాను, ప్రమాదానికి కారణమైన లారీ



డ్రైవర్ మృతదేహం



ఘటన స్థలంలో చనిపోయిన భక్తులు



క్షతగాత్రులను ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

తమిళనాడులో ఘోరం

వ్యాను, లారీ ఢీకొని పది మంది మృతి

- మృతులంతా మెదక్ జిల్లా వాసులే
- తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ దిగ్భ్రాంతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

శబరిమల యాత్ర ముగించుకుని తిరుగు ప్రయాణమైన అయ్యప్పస్వామి భక్తులను మృత్యువు మింగేసింది. రోడ్డు ప్రమాదం రూపంలో మాటువేసి కాపుగాసిన కంటైనర్.. పది మందిని పొట్టనబెట్టుకుంది. 'మా స్వాములు మరికొన్ని గంటల్లో తిరిగొస్తారు' అని ఆత్రంగా ఎదురుచూసిన బంధువులు గుండెలు బాదుకుంటున్నారు. తమిళనాడు రాష్ట్రం పుదుకొట్టై సమీపంలో ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో మెదక్ జిల్లాకు చెందిన పది మంది భక్తులు మృతిచెందారు. మరో ఐదుగురు తీవ్ర గాయపడ్డారు. ప్రధాన రహదారిపై ఆగి ఉన్న కంటైనర్‌ను ట్రావెల్ వ్యాన్ ఢీకొట్టడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకున్నది. మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం ఖాజిపేట, మంతూర్, రెడ్డిపల్లి, చిన్నచింతకుంట గ్రామాలకు చెందిన నాగరాజు, మహేష్, కుమార్, శ్యాంగౌడ్, కృష్ణ, సాయి, ఆంజనేయులు, సురేష్, ప్రవీన్‌గౌడ్, రాజు, వెంకటేష్, నరేష్‌గౌడ్, భూమాగౌడ్, శ్రీశైలం, డ్రైవర్‌తో కలిపి మొత్తం మిగతా 9లో



స్పిల్వేలోనూ కాంక్రీట్ తరలింపు

గిన్నిస్‌లోకి పోలవరం

రికార్డు స్థాయిలో స్పిల్ ఛానల్ కాంక్రీటు పనులకు శ్రీకారం

24 గంటల్లో 32 వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్

నేడు ముఖ్యమంత్రికి రికార్డుల పత్రాల అందజేత

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో సోమవారం చారిత్రక ఘట్టం ఆవిష్కృతం కానుంది. ప్రపంచంలోనే అత్యధిక పరిమాణంలో కాంక్రీటు నింపిన నిర్మాణంగా గిన్నిస్ బుక్‌లో స్థానం పొందనుంది. న్యూఢిల్లీ నుంచి వచ్చిన గిన్నిస్ బుక్ రికార్డుల పరిశీలకుల సమక్షంలో పోలవరం ప్రాజెక్టు మిగతా 9లో

రాష్ట్రంలో వేర్వేరు ప్రమాదాల్లో 9 మంది మృతి

కర్నూలు, విశాఖపట్నం, విజయనగరం, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఘటనలు

2

ఎయు విసి వ్యాఖ్యలపై సైన్సు సొసైటీ ఆగ్రహం

జలంధర్ : పురాణాలను, సైన్సును కలిపి చూడటం తప్పని బ్రేక్ త్రూ సైన్స్ సొసైటీ తెలిపింది. పంజాబ్‌లోని జలంధర్‌లో జరిగిన సైన్స్ కాంగ్రెస్‌లో "కౌరవులు టెస్ట్ ట్యూబ్ బేబీలు" అని చేసిన వ్యాఖ్యలను ఖండించింది. సైన్సును, శాస్త్రీయ దృక్పథాన్ని ప్రచారానికి బ్రేక్ త్రూ సైన్స్ సొసైటీ కృషి చేస్తోంది. ప్రాచీన భారత దేశం గురించి యువతరం ఎదుట అటువంటి అశాస్త్రీయ వ్యాఖ్యలు చేయడం బాధాకరమని పేర్కొంది. ఇటువంటి వ్యాఖ్యలు మహోన్నత వ్యక్తులు అందించిన నిజమైన సేవలకు కళంకం తీసుకురావడమేనని సైన్స్ సొసైటీ ఒక ప్రకటనలో పేర్కొంది. "పురాణాలలోని శ్లోకాలు, గాథలు కవితాత్మకమైనవి. ఆనందాన్నిచ్చేవి. నీతికి సంబంధించిన అంశాలు అందులో ఉంటాయి. ఊహించుకోవడానికి ఎంతో ఉన్నతంగా ఉంటాయి. కాని శాస్త్రీయంగా రూపొందిన విలువైన సిద్ధాంతాలు మాత్రం కాదు. యువతకు ప్రాచీన భారత దేశం గురించి గందరగోళపరిచే అంశాలను తెలియచేయడం తప్పు" అని సైన్స్‌సొసైటీ తెలిపింది. ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌లో ఒక భాగంగా నిర్వహించిన చిల్డ్రన్ సైన్స్ కాంగ్రెస్ సమావేశంలో కౌరవులు టెస్ట్ ట్యూబ్ బేబీలు అని ఆంధ్ర యూనివర్శిటీ విసి నాగేశ్వరరావు వ్యాఖ్యానించడం బాధాకరమని తెలిపింది. ఈ సమావేశానికి హాజరైన వారిలో ఎక్కువ మంది ఉపాధ్యాయులు, విద్యార్థులే ఉన్నారని తెలిపింది. ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌కు గతంలో అధ్యక్షులుగా పనిచేసిన ఆచార్య ప్రఫుల్ల చంద్ర రే మిగతా 9లో



మాటల యుద్ధం

లోకేశ్ కోసమే బాబు ఆరాటం

వీడియో కాన్ఫరెన్స్‌లో మోడీ



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరాటమంతా ప్రజల కోసం కాదని, తన కుమారుడు లోకేష్ కోసమేనని ప్రధాని నరేంద్ర మోడీ ఆదివారం విమర్శించారు. పదవులు ఇచ్చే నాయకుడిలా కుమారుణ్ణి ప్రమోట్ చేసే పనిలో బాబు ఉన్నారని ఆయన ఎద్దేవా చేశారు. రాష్ట్రంలోని పార్లమెంట్ నియోజకవర్గాల బూత్ కమిటీలతో మోడీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తూ, రాష్ట్రాభివృద్ధిని సిఎం పట్టించుకోవడం లేదన్నారు. ఎన్టీఆర్‌కు నిజమైన నివాళి అంటే పేదలకు, బలహీన వర్గాల అభివృద్ధికి కృషి చేయడమేనన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు, కాకినాడలో బిజెపి మహిళా కార్యకర్తపై సిఎం దురుసు ప్రవర్తనను బిజెపి రాష్ట్ర అధ్యక్షులు కన్నా లక్ష్మీనారాయణ ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. టిడిపికి, చంద్రబాబుకు బిజెపి భయం పట్టుకుందన మోడీ వ్యాఖ్యానించారు. టిడిపి ప్రభుత్వాన్ని ప్రజలు విశ్వసించే పరిస్థితి లేదని అన్నారు. రాష్ట్రంలో కుల రాజకీయాలు, అవినీతిని అంతమొందించాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. కేంద్రం నుంచి నిధులు నేరుగా జిల్లాలకే వస్తున్నాయన్నారు. ఎపి ప్రభుత్వ తీరు అర్థం కావడం లేదన్నారు.. వెనుకబిన జిల్లాలకు కేంద్రం నుంచి అధిక నిధులు ఇచ్చామని, ఎప్పుడైనా నిధుల ఎక్కడ వాడారని ప్రశ్నించామా? కొన్ని ఖర్చు చేసిన అనంతరం బిల్లులు పంపినా వాటికి నిధులు చెల్లిస్తున్నామని మోడీ చెప్పారు.

మోడీవి దుష్ట రాజకీయాలు

చంద్రబాబు ధ్వజం



ప్రజాశక్తి - అమరావతిబ్యూరో

ప్రధాని నరేంద్ర మోడీ దుష్ట రాజకీయాలకు పాల్పడుతున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్రంగా ధ్వజమెత్తారు. ప్రశాంతమైన కేరళలో మత విద్వేషాలను రెచ్చగొడుతున్నారు. ఉత్తర ప్రదేశ్‌లో ఎస్‌పి, బిఎస్‌పి పొత్తు కుదుర్చుకున్న మరు క్షణమే ఎస్పీ నేత అఖిలేష్‌పై సిబిఐని ఉసిగొల్పారు. బిజెపి నిష్క్రియాపరత్వాన్ని ఎత్తి చూపినందుకు తనపై కేసులు పెట్టి బెదిరిస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు విమర్శించారు. ఐదు రోజులుగా జరుగుతున్న జన్మభూమి కార్యక్రమంపై ఆయన ఆదివారం జిల్లా కలెక్టర్లు, నోడల్ అధికారులు, ప్రజాప్రతినిధులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి నేతలు పని చేయటం లేదని, పనిచేయాలని అడిగితే కేసులు పెట్టి బెదిరిస్తున్నారని దుయ్యబట్టారు. ఎపికి నిధులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని, అయినా, వీటన్నింటిని అధిగమించి ముందుకెళుతున్నామని ముఖ్యమంత్రి చెప్పారు.

జాతీయ, అంతర్జాతీయ అవార్డులు రాష్ట్ర ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమన్నారు. ఆదివారమైనా ఉద్యోగులు జన్మభూమిలో పాల్గొనటం స్ఫూర్తిదాయకమని, రోజు రోజుకీ జన్మభూమికి ప్రజల నుంచి స్పందన పెరుగుతుండడం సంతోషకరమైన విషయమన్నారు.

ఆరు లక్షల కోట్ల అవినీతి

'అవినీతి చక్రవర్తి' పుస్తకావిష్కరణలో వైఎస్ జగన్



'అవినీతి చక్రవర్తి' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జగన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం, సోంపేట

టిడిపి ప్రభుత్వ పాలనలో గతేడాది నవంబరు 30వ తేదీ వరకూ రాష్ట్రంలో రూ.6,17,585.19 కోట్ల అవినీతి జరిగిందని రాష్ట్ర ప్రతిపక్షనేత, వైసిపి అధినేత వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ఆరోపించారు. నాలుగున్నరేళ్ల పాలనలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోపాటు అధికార పార్టీ నేతల అవినీతిపై ప్రచురించిన 'అవినీతి చక్రవర్తి' (ఎంపరర్ ఆఫ్ కరప్షన్) పుస్తకాన్ని శ్రీకాకుళం జిల్లా మిగతా 9లో

మందులా! బయటే కొనుక్కోండి !!



కర్నూలు సర్వజన ఆసుపత్రిలో తీరిది

ఎన్టీఆర్ వైద్య సేవల రోగులపై భారం

10 శాతానికే రీయింబర్స్

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

పేదలకు అందించాల్సిన వైద్యం పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది. కొన్ని ఆసుపత్రుల్లో సేవలు పరిమితంగా అందిస్తుండగా, మందులు బయట కొనాల్సిన పరిస్థితి వస్తోంది. రాష్ట్రంలో జన్మభూమిలో భాగంగా విద్య వైద్యం, ఆరోగ్యం, పోషకాహారం, తల్లీబిడ్డల సంరక్షణ, మానవ వనరుల వినియోగంపై సోమవారం సభలు జరగనున్న నేపథ్యంలో వైద్య సేవలపై సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ప్రతిష్టాత్మక కర్నూలు వంటి సర్వజన ఆసుపత్రుల్లో సైతం మందులు దొరకక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

కర్నూలు సర్వజన వైద్యశాలలో ప్రజలకు మెరుగైన వైద్యం అందించడం లేదని, వైద్య సేవలపై 80 శాతం ప్రజలు అసంతృప్తిగా ఉన్నారని, నాణ్యమైన వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎస్.సత్యనారాయణ గతనెల వైద్యశాల అభివృద్ధి సొసైటీ సమావేశంలో మిగతా 9లో

మా భూముల్లోకొస్తే ఊరుకోం

కరకట్ట విస్తరణపై రైతులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కరకట్ట విస్తరణ పేరుతో తమ భూముల్లోకి వస్తే ఊరుకోబోమని ఉండవల్లి రైతులు హెచ్చరించారు. తమ భూములు పూలింగుకు ఇవ్వలేదని, కోర్టులో స్టేలు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. కరకట్ట విస్తరణ పేరుతో ప్రజాశక్తిలో వచ్చిన వార్తకు ఉండవల్లి రైతులు స్పందించారు. కరకట్ట పక్కనే తమ పట్టా భూములున్నాయని, వాటిల్లోకి రాకుండా రోడ్డును నిర్మించుకుంటే తమకు అభ్యంతరం లేదని పేర్కొన్నారు. కరకట్ట నాలుగులైన్లు రోడ్డుగా మార్చేంత విస్తీర్ణంలో ఉంటే చేసుకోవచ్చని ఉండవల్లికి చెందిన రైతు దంటు బాలాజీరెడ్డి తెలిపారు. అలాగే పలువురు రైతులు కూడా అభ్యంతరం వ్యక్తం చేశారు. కరకట్టకు అనుకుని రెండువైపులా సర్వే నెంబర్ల ప్రకారం పట్టా భూములున్నాయని, 100 అడుగులు విస్తీరించేంత స్థలం లేదని తెలిపారు. తమ భూముల్లో పంటలున్నాయని, వాటిని పాడుచేసినా ఊరుకోబోమని పేర్కొన్నారు.



విజయవాడ రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న గాంధీహిల్

రిపబ్లిక్‌డే పరేడ్‌లో గాంధీహిల్ శకటం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఢిల్లీలో జరిగే రిపబ్లిక్ డే పరేడ్‌లో ఆంధ్రప్రదేశ్ నుండి గాంధీహిల్ నమూనా శకటాన్ని పంపేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. మహత్మాగాంధీ తొలిసారి అడుగు పెట్టిన ప్రాంతం కావడంతో ఈ సారి దీన్ని పరేడ్‌లో పంపాలని నిర్ణయించారు. గాంధీ మెమోరియల్ లైబ్రరీలో దేశవ్యాప్తంగా ఆరు ఉండగా అందులో గాంధీ కొండపై ఉన్న లైబ్రరీ ఒకటి. గాంధీయిజంపై రీసెర్చి చేసే విద్యార్థులకు ఉపయోగంగా ఉంటుందని దీనిని నెలకొల్పారు. దీనికి 1964లో ప్రధాని లాల్ బహదూర్‌శాస్త్రి శంకుస్థాపన చేశారు. కొండపై నిర్మించిన లైబ్రరీ భవనాన్ని అప్పటి కాంగ్రెస్ సీనియర్ లీడర్ నిజలింగప్ప ప్రారంభించారు. 1967లో అప్పటి ప్రధాని మెరార్జీ దేశాయ్ గాంధీ హిల్ సొసైటీని ప్రారంభించారు. కొండపై ఏర్పాటు చేసిన 52 అడుగు గాంధీ సూక్తులతో కూడిన స్తూపాన్ని 1968లో రాష్ట్రపతి డాక్టర్ జాకీర్ హుస్సేన్ ప్రారంభించారు. ఈ స్థూపాన్ని నందలాల్ బోస్ రూపొందించారు. 1969లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన చిన్న పిల్లల రైలును అప్పటి కేంద్రం రైల్వేశాఖ మంత్రి రామ్ సుభాగ్‌సింగ్ ప్రారంభించారు. కొండపై సౌండ్ అండ్ లైటింగ్ సిస్టమ్ ఏర్పాటుకు 1968లో అప్పటి ఉప రాష్ట్రపతి వి.వి.గిరి శంకుస్థాపన చేశారు. అదే ఏడాది ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్(సరిహద్దు గాంధీ) ప్రారంభించారు. కొండ కిందిభాగంలో ఏర్పాటు చేసిన ప్లానిటోరియంను 1971లో ఉప రాష్ట్రపతి జి.ఎస్.పాఠక్ ప్రారంభించారు. ఇన్ని ప్రత్యేకతలున్న కొండ కావడంతో ఈ సారి దీన్ని పరేడ్‌లో పెట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

తీవ్ర వాయుగుండంగా మారిన 'పాబుక్'

ప్రజాశక్తి-గ్రేటర్ విశాఖ బ్యూరో



అండమాన్ సముద్రంలో ఉన్న 'పాబుక్' తుపాను ఆదివారం సాయంత్రానికి పోర్టుబ్లెయిర్‌కు తూర్పు, ఆగ్నేయంగా 210 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉందని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. గంటకు 6 కిలోమీటర్ల వేగంతో ఇది పశ్చిమ, వాయువ్య దిశలో ముందుకు కదులుతోందని పేర్కొంది. వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా ఆదివారం అర్ధరాత్రికి బలహీనపడి తీవ్ర వాయుగుండంగా మారుతుందని తెలి పింది. మరో 12 గంటల గడిచాక మరింత బలహీనపడి వాయుగుండంగా మారి పశ్చిమ - వాయువ్య దిశగా కదిలి అండమాన్ దీవులను తాకుతుందని పేర్కొంది. ఆ సమయంలో గంటకు 55 నుండి 65 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని తెలిపింది. అక్కడి నుండి ఇది రికర్వ్ దిశలో తిరిగి ఈశాన్య దిశగా ముందుకు కదిలి మయన్మార్ తీరానికి చేరుతుందని, తర్వాత మరింత బలహీనపడుతుందని వివరించింది. దీని ప్రభావం ఆంధ్రప్రదేశ్‌పై ఏ మాత్రం ఉండబోదని వాతావరణ శాఖ నిపుణులు చెబుతున్నారు.

కేంద్ర మాజీ మంత్రి సర్వేపై వేటు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర మాజీ మంత్రి, ఆలిండియా కాంగ్రెస్ కమిటీ సభ్యుడు సర్వే సత్యన్నారాయణపై టి.పిసిసి వేటు వేసింది. పార్టీ నేతలను బహిరంగంగా దూషించడంతో పాటు సహచర నాయకులపై దాడి చేసినందుకు పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు పిసిసి క్రమశిక్షణా సంఘం ఆదివారం ప్రకటించింది. గాంధీభవన్‌లో జరిగిన మల్కాజ్‌గిరి పార్లమెంటరీ సమావేశంలో పిసిసి అధ్యక్షులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఇంచార్జి ఆర్‌సి కుంతియాలపై ఆయన తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. అడ్డుచెప్పిన బొల్లు కిషన్, మహేశ్‌లపై సర్వే ఎదురుదాడికి దిగారు. ఈ వ్యవహారంపై వారు చేసిన ఫిర్యాదు మేరకు పిసిసి క్రమశిక్షణా సంఘం సర్వేను పార్టీ నుంచి సస్పెండ్ చేసింది.

బీమా కంపెనీలకు కాసుల పంట

రెండేళ్లలో 8,718 కోట్ల ఆదాయం • ఫసల్‌బీమాపై తగ్గుతున్న రైతుల ఆసక్తి

న్యూఢిల్లీ : ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన రైతుల కష్టాలన్నీ తీరిపోతాయంటూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చేసుకున్న ప్రచారానికి భిన్నమైన పరిస్థితి నెలకొంది. 2016 ఖరీఫ్ ఈ పథకం ప్రారంభం కాగా, 2017 ఖరీఫ్ నాటికే 8,718 కోట్ల రూపాయల ఆదాయం బీమా కంపెనీలకు లభించింది. మరోవైపు రైతులకు దక్కింది మాత్రం నామమాత్రం. 2016-17 సీజన్‌లో ఖరీఫ్, రబీ రెండింటినీ కలిపి లెక్కవేస్తే సగటున ఒక్కో రైతుకు రూ. 11,805 మాత్రమే నష్ట పరిహారం దక్కినట్లు లెక్కలు చెబుతున్నాయి. సగటు లెక్కల సంగతి ఎలా ఉన్నప్పటికీ, కొన్ని ప్రాంతాల్లో రైతులకు పరిహారం కింద ఒక్క రూపాయి మాత్రమే చెల్లించిన ఉదంతాలు వెలుగులోకి వచ్చాయి. అదే సమయంలో 2016 ఖరీప్‌లో దాదాపుగా 5 వేల కోట్లు, రబీలో 217 కోట్లు, 2017 ఖరీఫ్‌లో 2,612 కోట్ల రూపాయలు బీమా కంపెనీలకు మిగిలాయి. ఫసల్ బీమా వల్ల ప్రయోజనం కనపడకపోవడంతో రైతులు ఈ పథకంపై ఆసక్తి చూపడం లేదు. క్రమేణా వారి సంఖ్య తగ్గుతోంది.



ఈపథకం 2016లో ప్రారంభమైయింది.

పథకం ఇలా...

కరువు కాటకాల ఫలితంగా గాని, తుఫాన్లు, వరదల కారణంగా గాని రైతుల పంటలు నాశనమైతే ఆ నష్టాన్ని ఫసల్ బీమా ద్వారా భర్తీ చేస్తామని ప్రభుత్వం ప్రచారం చేసుకుంది. కాని ఆచరణలో ఈ ఆ బాధ్యతను ఇన్సూరెన్స్ కంపెనీలపైకి నెట్టేసి ప్రభుత్వం తన బాధ్యతను వదిలించుకుంది. ఈ పథకం లో బీమా కంపెనీలకు ప్రీమియం కింద కొంత సొమ్ము చెల్లించాలి. ఆ ప్రీమియంలో 1.5శాతం నుండి 5 శాతం మేరకు రైతులకు చెల్లించి తమ పేర్లు పథకంలో నమోదుచేసుకుంటారు. మిగిలిన ప్రీమియం సొమ్మును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరిసగం భరిస్తాయి. రైతులు ప్రకృతివైపరీత్యాల వలన పంట నష్టపోతే బీమకంపెనీలు పరిహారాన్ని చెల్లిస్తాయి.

నష్టం అంచనా ఇలా ...

ప్రతీ సీజన్‌లోనూ కొన్ని వ్యవసాయ క్షేత్రాలను శాంపిల్స్‌గా ఎంచుకుని అక్కడ పంట కోసి దిగుబడిని లెక్కిస్తారు. ఆ దిగుబడి గత ఏడేళ్ల సగటు దిగుబడితో పోల్చి చూసి ఎంత తగ్గిందో నిర్ధారిస్తారు. ఆ తగ్గుదలకి నష్టపరిహారం చెల్లిస్తారు. ఈ విధమైన శాంపిల్ క్షేత్రాలు దేశం మొత్తం మీద 15 నుంచి 20 లక్షల వరకూ ఉంటాయి. ఈ క్షేత్రాల్లో దిగుబడి అంచనా కట్టే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలదే . బీమా కంపెనీలకు చెల్లించే ప్రీమీయంకు తోడు ఈ ప్రయోగాల ఖర్చు అదనం అవుతుంది. రైతులు, ప్రభుత్వాలు చెల్లించినది. రూ. 42,114 కోట్లు కాగా రైతులు పరిహారం రూపంలో తిరిగి పొందింది రూ. 32,912 కోట్లు మాత్రమే. బీమా కంపెనీలు రూ. 8713 కోట్లు మిగుల్చుకున్నాయి. పై పట్టికలో ప్రభుత్వ వాటా కింద చెల్లించిన మొత్తానికి తోడు అదనంగా సుమారు రూ. 12,000 కోట్లు పథకాన్ని నిర్వహించేందుకు ప్రభుత్వం చెల్లిస్తోంది. బీమా కంపెనీలు ఆ ఖర్చును భరించవు.

తగ్గుతున్న రైతులు

చాలా ఆర్భాటంగా ఈ పథకాన్ని బిజెపి ప్రభుత్వం ప్రారంభించింది. అయితే తొలుత రైతుల్లో కలిగిన ఉత్సాహం ఎక్కువకాలం నిలవలేదు. 2016 ఖరీఫ్ సీజన్లో 4 కోట్ల రెండులక్షల అరవైవేలమంది పథకంలో నమోదు అయితే 2018 సీజన్‌కి కేవలం 3 కోట్ల ముప్పై రెండులక్షల డెబ్బై వేలమంది మాత్రమే మిగిలారు. అంటే రెండేళ్లలో 70 లక్షల మంది రైతులు స్కీము నుండి వైదొలగారన్న మాట. నమోదైన వారిలో సైతం ఐచ్ఛికంగా చేరినవారి కంటే అప్పులిచ్చే బ్యాంకులు నిర్బంధంగా పథకంలో చేర్పిస్తున్నందున తప్పనిసరై చేరిన వారే ఎక్కువ.

మోడీ ప్రభుత్వం రైతుల దుస్థితిని బీమా కంపెనీలు సొమ్ము చేసుకుని లాభాలు పిండుకునేందుకు తోడ్పడుతోంది. ఇదీ ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన బంగారం. బీమా రద్దు చేసి ప్రభుత్వమే నేరుగా నష్టపరిహారాన్ని చెల్లించేందుకు పూనుకోవడమే పరిష్కారమన్న అభిప్రాయం వ్యవసాయ రంగ నిపుణుల్లో వ్యక్తమవుతోంది. అప్పుడే రైతుకు ప్రకృతి వైపరీత్యాలు నుండి రక్షణ లభిస్తుందని వీరు చెబుతున్నారు.

పథకం అమలు ఇలా... రూ. కోట్లలో

సీజన్	చెల్లించిన ప్రీమియం			చెల్లించిన పరిహారం	బీమా కంపెనీలకు మిగులు
	రైతుల వాటా	ప్రభుత్వ వాటా	మొత్తం		
2016 ఖరీఫ్	2,919	13,399	16,318	10,483	5,824
2016-17 రబీ	1,291	4,731	6,028	8,657	217
2017 ఖరీఫ్	3,039	16,729	19,768	16,772	2,672
మొత్తం	7,254	34,859	42,114	32,912	8,718

కానిస్టేబుల్ పరీక్షకు 88 శాతం హాజరు

రేపు కీ, రెండు వారాల్లో ఫలితాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పోలీస్ శాఖలోని పోలీస్ కానిస్టేబుల్(సివిల్), కానిస్టేబుల్(ఎఆర్), కానిస్టేబుల్ (ఎపిఎస్పీ), జైళ్ల శాఖలోని వార్డర్స్, అగ్నిమాపక శాఖలోని ఫైర్‌మెన్ పోస్టుల భర్తీ కోసం ఆదివారం నిర్వహించిన ప్రాథమిక రాత పరీక్షకు 88.16 శాతం మంది అభ్యర్థులు హాజరైనట్లు ఎపి పోలీస్ నియామక మండలి ఛైర్మన్ కుమార్ విశ్వజిత్ తెలిపారు. మొత్తం 3,92,785 మంది దరఖాస్తు చేసుకోగా 3,46,284 మంది హాజరయ్యారని, 46,532 మంది గైర్హాజరయ్యారని వెల్లడించారు. 28 ప్రాంతాల్లోని 704 పరీక్షా కేంద్రాల్లో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకూ పరీక్ష నిర్వహించామని తెలిపారు. పరీక్షకు సంబంధించిన కీ ను 8వ తేదీ సాయంత్రం slprb.ap.gov.in వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తామని పేర్కొన్నారు. రెండు వారాల్లోపు ఒఎమ్‌ఆర్ ప్రతులతో పాటు కూడిన ఫలితాలను విడుదల చేస్తామన్నారు. పరీక్ష కీపై అభ్యంతరాలుంటే ఈ నెల పదో తేదీ సాయంత్రంలోపు apslprb.obj@gmail.comకు మెయిల్ ద్వారా పంపాలని కోరారు. అభ్యర్థుల వేలి ముద్రలను తీసుకునేందుకు 3045 బయోమెట్రిక్ యంత్రాలను వినియోగించామని, 704 ఐటి బృందాలు, 118 మంది బయోమెట్రిక్ ఇన్‌చార్జిలు, 28 మంది నోడల్ ఆఫీసర్లు, 140 మంది ఫింగర్‌ప్రింట్ బ్యూరో అధికారులు పరీక్ష విధుల్లో పాల్గొన్నారని తెలిపారు.

ఆర్టీసి ప్రత్యేక బస్సులు

పోలీస్ కానిస్టేబుల్ ప్రాథమిక రాత పరీక్ష రాసే అభ్యర్థుల కోసం ఆదివారం ఆర్టీసి ప్రత్యేక బస్సులను నడిపినట్లు ఆర్టీసి ఎమ్‌డి ఎన్‌వి సురేంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థుల సౌకర్యం కోసం రాష్ట్ర వ్యాప్తంగా 721 ప్రత్యేక బస్సులను నడిపినట్లు పేర్కొన్నారు. ఎన్‌ఇసి రీజియన్ నుంచి 73 బస్సులు, విశాఖ రీజియన్ నుంచి 109, పశ్చిమ గోదావరి రీజియన్ నుంచి 55, తూర్పు గోదావరి రీజియన్ నుంచి 35, విజయవాడ రీజియన్ నుంచి 105, గుంటూరు రీజియన్ నుంచి 47, ఒంగోలు రీజియన్ నుంచి 59, నెల్లూరు రీజియన్ నుంచి 18, చిత్తూరు రీజియన్ నుంచి 21, కడప రీజియన్ నుంచి 42, కర్నూలు రీజియన్ నుంచి 56, అనంతపురం రీజియన్ నుంచి102 బస్సులను నడిపినట్లు తెలిపారు.

సార్వత్రిక సమ్మెకు మద్దతు : రామకృష్ణ

ప్రజాశక్తి-అమరావతిబ్యూరో

కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ జాతీయ కార్మిక సంఘాలు చేపట్టనున్న రెండురోజుల సార్వత్రిక సమ్మెకు సిపిఐ రాష్ట్రకార్యదర్శి కె.రామకృష్ణ మద్దతు ప్రకటించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రధాని మోడీ అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల, ప్రజావ్యతిరేక విధానాలవల్ల దేశ ఆర్థిక పరిస్థితి క్షీణించిందని పేర్కొన్నారు. కార్పొరేట్లకు అనుకూలంగా నిర్వీర్యం చేసిన 44 కార్మిక చట్టాలతో కార్మికవర్గానికి తీరని అన్యాయం జరిగిందని తెలిపారు. మోడీ అనుసరించిన నిరంకుశ ధోరణితో దేశంలోని రైతాంగానికీ, వ్యవసాయ కూలీలకు తీరని నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. గిట్టుబాటు ధరలు లేక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. పెద్దనోట్లరద్దు, జిఎస్‌టి, ఎఫ్‌ఆర్డీఐ చట్టం, సిపిఎస్ విధానాలతో దేశప్రజానీకానికి పెద్ద ఎత్తున నష్టం వాటిల్లిందని తెలిపారు. గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని ఉద్దేశపూర్వకంగానే నీరుగారుస్తున్నారని పేర్కొన్నారు. ఇటు రాష్ట్ర ప్రభుత్వం కూడా రాష్ట్రంలో పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచకపోవడాన్ని రామకృష్ణ ఖండించారు. భవననిర్మాణ కార్మికుల సంక్షేమ నిధిని పక్కదోవ పట్టించడాన్ని వ్యతిరేకించారు. కార్మికచట్టాల సవరణలను తక్షణమే నిలిపివేయాలనీ, కనీస వేతనాన్ని రూ.18 వేలుగా నిర్ణయించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి, పాతపెన్షన్ విధానాన్ని పునరు ద్ధరించాలని కోరారు. అసంఘటితరంగ కార్మికుల సంక్షేమానికి సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. న్యాయబద్ధమైన డిమాండ్ల సాధనకై జాతీయ కార్మిక సంఘాలు చేపట్టనున్న సమ్మెకు సిపిఐ తరపున ఆయన మద్దతు తెలియ జేస్తూ, ఈ సమ్మెను అన్ని వర్గాల ప్రజలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ప్రతిపక్షపార్టీలను అణగదొక్కేందుకు మోడీ కుట్ర

కెఇ కృష్ణమూర్తి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రధాని మోడీ కేంద్ర దర్యాప్తు సంస్థలను తమ నియంత్రణలో ఉంచు కుని ప్రతిపక్ష పార్టీలను అణగదొక్కేందుకు కుట్ర చేస్తున్నారని డిప్యూటీ సిఎం కెఇ కృష్ణమూర్తి అరోపించారు. మోడీ గుజరాత్‌కే సిఎం అన్నట్లు వ్యవహరిస్తు న్నారని, అన్ని రాష్ట్రాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక పత్రికా ప్రకటన విడదల చేశా రు. కేంద్రం వ్యవహరిస్తున్న కక్ష సాధింపు దోరణికి వ్యతిరేకంగా టిడిపి, బిజెపీయేతర పార్టీల కూటమికి కృషి చేస్తోందని తెలిపారు. మోడీ, జగన్, కేసీఆర్‌లు కలిసి రాష్ట్రాన్ని అతలాకుతలం చేయలని చూస్తున్నారని కెఇ పేర్కొన్నారు. ఆర్థిక నేరస్తుడు జగన్ కేసుల నుంచి బయటపడేందుకు మోడీతో అంటకాగుతున్నారని ఆయన అన్నారు. దేశ ప్రజలు మార్పును కోరుకుంటున్నారని, వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి ఇంటికి వెళ్లడం ఖాయమని కెఇ కృష్ణమూర్తి అభిప్రాయం వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. కేంద్ర ప్రభుత్వం నిధులివ్వకుండా మోకాలొడ్డుతున్నా, ఇప్పటికే 64శాతం పనులు పూర్తి చేశామన్నారు.

కొత్త రక్తంతోనే మార్పు సాధ్యం

- విజయనగరం, అనంత జిల్లాల సమీక్షల్లో జనసేన అధ్యక్షులు పవన్



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రజలు మార్పు కోసం ఎదురు చూస్తున్నారని, కొత్త రక్తం రాజకీయాల్లోకొచ్చినప్పుడే మార్పు సాధ్యమవుతుందని జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ అన్నారు. నిబద్ధత కలిగిన యువత కోసం తాను ఎదురు చూస్తున్నట్లు చెప్పారు. విజయనగరం, అనంతపురం జిల్లా నాయకులతో ఆదివారం ఆయన విడివిడిగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తన మానసిక స్థితి సమాజ సేవకో, రాజకీయాలకో పనికొస్తుంది తప్ప సినిమాలకు కాదన్నారు. యాదృచ్ఛికంగా సినీనటుడినయ్యానని చెప్పారు. తన జీవితంలోని అనుభవాలు, చదివిన పుస్తకాల సారాన్ని మేళవించి జనసేన ఏడు మూల సూత్రాలను రూపొందించిందని చెప్పారు. అనంతపురంలో వర్షాలు లేక వలసలు పోతున్నారని, పచ్చని పంటలతో కళకళలాడే విజయనగరం జిల్లా నుంచి ఎందుకు వలసలు వెళ్తున్నారని ప్రశ్నించారు. జిల్లాలో ఆధిపత్యే రాజకీయాలే ఈ పరిస్థితికి కారణమన్నారు. టిడిపి, వైసిపిలకు విజయంపై నమ్మకం లేదన్నారు. జనసేన విజయం తనకు కనిపిస్తోందన్నారు. ఇద్దరు వ్యక్తులు జిల్లాని తమ గుప్పెట్లో పెట్టుకున్నారని, పార్టీ తరపున మాట్లాడేటప్పుడు పార్టీ నియమావళికి అనుగుణంగా మాట్లాడాలన్నారు. కులాల మధ్య ఘర్షణల వల్ల కొన్ని కుటుంబాలు మాత్రమే బాగుపడతాయన్నారు. ప్రత్యర్థుల్ని బలంగా విమర్శించాలే తప్ప, కులాలకు సంబంధించిన అంశాలను ప్రస్తావించవద్దని పవన్ ఈ సందర్భంగా సూచించారు. నా బలమంతా కోస్తా జిల్లాల్లోనే అని నన్ను ఓ ప్రాంతానికే పరిమితం చేయడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. బ్రిటీష్ హయాంలో అత్యధికంగా పన్నులు కట్టిన ప్రాంతం ఇప్పుడు కరువుకు నెలవయ్యిందన్నారు. అనంతపురంను వెనుకబడిన జిల్లాగా పేర్కొంటున్నారని, తాను మాత్రం రాజకీయంగా వెనుకబడిన జిల్లాగా భావిస్తున్నానని చెప్పారు. దీంతోనే ఈ జిల్లాలో కరువు పరిస్థితిలో ఏళ్లు గడుస్తున్నా ఎటువంటి మార్పు లేదన్నారు. నీరే లేని ఇజ్రాయిల్‌లో పుష్కలంగా పంటలు పండిస్తున్నప్పుడు అనంతలో ఆ ప్రయోగం ఎందుకు చేయలేమన్నారు. పాలకులకి సంకల్పం లేకే దీనిపై దృష్టి పెట్టడం లేదన్నారు. వ్యక్తి ఆధారిత పార్టీలు ఏదో ఒక రోజు దెబ్బతినక మానవని, బలీయమైన భావజాలంతో ఏర్పాటైన పార్టీలు చిరకాలం నిలిచిపోతాయన్నారు. అటువంటి పార్టీనే జనసేన పార్టీ అని చెప్పారు. అనంత ప్రజలు, యువత మార్పుని బలంగా కోరుకుంటున్నారని, మార్పు వచ్చే సమయం ఆసన్నమయ్యిందని చెప్పారు. తాను మాత్రం అవినీతి రహిత రాజకీయాలే చేస్తానన్నారు.

ప్రజ్ఞ

సమాధానాలు 7లో

1. ఇండియన్ పనోరమ ఫిల్మ్ ఫెస్టివల్ ఎక్కడ ప్రారంభమైంది?
2. అమెరికాకు వ్యతిరేకంగా మదర్ ఆఫ్ ఆల్ బాంబ్స్ రూపొందించిన దేశం?
3. ఆధార్ సవరణ బిల్లుకు ఏ సభ ఆమోదం తెలిపింది?
4. 2018 ప్రొ కబడ్డీ లీగ్ విజేత ?
5. నేషనల్ టేబుల్ టెన్నిస్ చాంపియన్ షిప్ ఎక్కడ ప్రారంభమైయింది?

అప్పీల్‌కు వెళ్దామా?

జగన్ కేసు దర్యాప్తుపై ఉన్నతాధికారులతో సిఎం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విశాఖ ఎయిర్‌పోర్టు విఐపి లాంజ్‌లో ప్రతిపక్ష నేత వైయస్ జగన్‌మోహన్‌రెడ్డిపై జరిగిన హత్యాయత్నం కేసును కేంద్రం జాతీయ దర్యాప్తు సంస్థకు ఇవ్వడంపై రాష్ట్ర ప్రభుత్వం అప్పీల్‌కు వెళ్లాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈ విషయంలో సాధ్యాసాధ్యాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదివారం రాష్ట్ర డిజిపి, అడ్వకేట్ జనరల్‌తో గంట పాటు సమీక్ష నిర్వహించారు. అప్పీల్‌కు వెళ్లేందుకు ఏయే అంశాలను పరిగణలోకి తీసుకోవాల్సి ఉంటుంది. జాతీయ దర్యాప్తు సంస్థ విచారణ ప్రారంభిస్తే రాష్ట్ర ప్రభుత్వం ఎలా వ్యవహరించాల్సి ఉంటుంది? గతంలో ఇటువంటి సంఘటనలు ఇతర రాష్ట్రాల్లో ఏమైనా జరిగాయా? ఇటువంటి విషయాలన్నీ సిఎం, న్యాయనిపుణుల మధ్య చర్చల్లో ప్రస్తావనకు వచ్చినట్లు సమాచారం. విశాఖ సిటీ పోలీస్ కమిషనర్‌ను సెలవుపై పంపితే ఎలా ఉంటుందనే విషయం కూడా సిఎం వద్ద ప్రస్తావన వచ్చి నట్లు తెలిసింది. ఇదే విషయంపై శనివారం రాత్రి కొద్ది సేపు అధికారులతో సిఎం చర్చించారు. రాష్ట్రం దర్యాప్తు పూర్తి చేస్తున్న క్రమంలో కేంద్రం ఎన్‌ఐఎకు బదిలీ చేయడాన్ని రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకున్నట్లు తెలుస్తోంది.




రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తాతారావు, దేముడు

రాష్ట్రంలో వేర్వేరు ప్రమాదాల్లో 9మంది మృతి

ప్రజాశక్తి - యంత్రాంగం

రాష్ట్రంలో ఆదివారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో తొమ్మిది మంది మృతిచెందారు. . నలుగురు గాయాల పాలయ్యారు. కర్నూలు, విశాఖపట్నం, విజయనగరం, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఈ ఘటనలు చోటు చేసుకున్నాయి. కర్నూలు ఓమేగా ఆసుపత్రిలో పనిచేస్తున్న సుమన్ (22), కుమారి(22), శిరీష(20) ఆదివారం సాయంత్రం బనగానపల్లెకు సమీపంలోని యాగంటి క్షేత్రం చూసి తిరిగి వస్తుండగా బస్సు ఢీకొని మృతిచెందారు. బస్సు తెలంగాణా జిల్లా సిద్దిపేట జిల్లా గజ్వేల్ డిపోకు చెందిందిగా గుర్తించారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం రూరల్ మండలం పెదగరువులో విద్యుత్ స్తంభాన్ని కారు ఢీకొన్న ఘటనలో పేరుపాలెం బీచ్‌కు వెళ్లివస్తున్న భీమవరానికి చెందిన కందుల హరిబాబు (52), భీమవరానికి చెందిన ఉప్పల చిరంజీవి (45) అక్కడికక్కడే మృతి చెందారు. మరో నలుగురు గాయాలపాలయ్యారు. నరసాపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విశాఖ ఏజెన్సీ పాడేరు ఘాట్‌రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో రావికమతం మండలం కొత్తకోటకు చెందిన గండేపల్లి తాతారావు(47), చిత్రాడ దేముడు (46) అనే అపరాల వ్యాపారులు మృత్యువాత పడ్డారు. అపరాల కొనుగోలు నిమిత్తం తాతారావు, దేముడుతో పాటు మరో నలుగురు ఏజెన్సీ ప్రాంతానికి ద్విచక్ర వాహనాలపై వెళ్లారు. తిరిగి వస్తుండగా పాడేరు మండలం అయినాడ పంచాయతీ వాలాబు వద్ద తాతారావు, దేముడ ప్రయాణిస్తున్న బైక్ అదుపు తప్పి ప్రమాదవశాత్తు లోయలోకి జారినప్పుడు తాతారావు, దేముడు మృతిచెందారు. విజయనగరం జిల్లా సాలూరు మండలం తోణాం పంచాయతీ ముంగివానివలసకు చెందిన కోన సన్యాసి (62), గొర్లి త్రినాధరావు (52) కలిసి ద్విచక్ర వాహనంపై నిత్యావసర సరుకుల కొనుగోలుకు బయలుదేరారు. తోణాం సమీపంలో మెట్టవలస కూడలి వద్ద ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు వీరి వాహనాన్ని ఢీకొనడంతో వారు అక్కడికక్కడే మృతి చెందారు.

ప్రత్యేకం

ఇదేనా మానవ వనరుల అభివృద్ధి

ఫీచర్స్ అండ్ పాలిటిక్స్

ముఖ్యమంత్రి విడుదల చేసిన శ్వేతపత్రం-6పై ఈ రోజు జన్మభూమిలో చర్చిస్తారు. శ్వేతపత్రంలో పేర్కొనని కింది విషయాలపై సభలలోనైనా స్పందిస్తారా?.

శ్వేతపత్రంపై కొన్ని ప్రశ్నలు



1. పాఠశాల విద్యాశాఖలో డ్రాపవుట్ల శాతాన్ని తగ్గించామని ప్రభుత్వం చెబుతోంది. ఐదేళ్ల నుంచి బడికి వెళ్లే పిల్లల సంఖ్య తగ్గిపోయింది. 2013-14 విద్యాసంవత్సరంలో రాష్ట్రంలో 73,37,267 మంది విద్యార్థులు బడికి వెళ్లారు. 2018-19 విద్యాసంవత్సరంలో 70,39,991 మంది విద్యార్థులు మాత్రమే బడికి వెళ్తున్నారు. విద్యార్థుల సంఖ్య సుమారు 3లక్షలు తగ్గితే అది మానవ వనరుల అభివృద్ధి అవుతుందా?.
2. డిఎస్‌సి-2014 ద్వారా 9862 మంది ఉపాధ్యాయుల్ని భర్తీ చేశామని ప్రకటించారు. ఆ నాటి ఖాళీలను బట్టి ఈ పోస్టుల్ని నింపారు. టిడిపి పాలనా కాలంలో 15వేల మంది ఉపాధ్యాయులు పదవీ విరమణ పొందారు. 2019 జూన్ నాటికి మరో 10,326 మంది ఉపాధ్యాయులు పదవీ విరమణ పొందనున్నారు. ప్రస్తుత డిఎస్‌సిలో విద్యాశాఖలో భర్తీ అయ్యేది 7వేల పోస్టులు మాత్రమే. పదవీ విరమణ పొందిన పోస్టుల్ని కూడా పూర్తిగా భర్తీ చేయకపోతే మానవ వనరుల అభివృద్ధి ఎక్కడుంది?.
3. రాష్ట్రంలో కార్పొరేట్ జూనియర్ కళాశాలల్లో 2012 నుంచి 2017 వరకు 37 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. ఆత్మహత్యలకు కారణాలేమిటో ప్రభుత్వ ప్రకటించిందా? బాధ్యులెవరు? ఏం చర్యలు తీసుకున్నారు? వీటిని శ్వేతపత్రంలో ఎందుకు ప్రస్తావించలేదు?.
4. రాష్ట్రంలో 50శాతం కార్పొరేట్ కళాశాలల్లో ల్యాబొరెటరీలు లేవు. అర్హత వున్న లెక్చరర్లూ లేరు. ఇలాంటి కార్పొరేట్ సంస్థలపై ఏం చర్యలు తీసుకున్నారో శ్వేతపత్రంలో ఎందుకు ప్రస్తావించలేదు?.
5. 1385 యూనివర్సిటీ అధ్యాపక పోస్టుల్ని భర్తీ చేసినట్లు శ్వేతపత్రంలో పేర్కొన్నారు. రాష్ట్రంలో 14 యూనివర్సిటీల్లో 1100 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ఎపిపిఎస్‌సి పరీక్షలు నిర్వహించి ఏడాది కావొస్తోంది. కానీ ఇప్పటి వరకూ ఒక్క పోస్టు కూడా భర్తీ చేయలేదు. ఈ వాస్తవాన్ని ఎందుకు మరుగునపరిచారు?.
6. రాష్ట్రవిభజన తరువాత రాష్ట్ర కేంద్ర గ్రంథాలయాన్ని నాలుగేళ్లల్లో ఇప్పటి వరకు ఏర్పాటు చేయలేదు. దీని గురించి శ్వేతపత్రంలో ప్రస్తావించలేదు?.
7. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ ప్రైవేట్ సంస్థలకు అప్పగించిన చోట విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ఆరోగ్య సమస్యలు ప్రభుత్వం దృష్టిలో ఉన్నాయా?. శ్వేతపత్రంలో దీనిపై ఎందుకు స్పందించలేదు?.
8. రాష్ట్రంలో అన్ని క్రీడా సౌకర్యాలు ఉన్న కొత్త స్టేడియాన్ని ఒక్కటైనా ఈ ప్రభుత్వం నిర్మించిందా?.
9. జిల్లాల్లో వివిధ క్రీడలకు కోచ్‌లను నియమించే విషయంపై శ్వేతపత్రంలో ప్రస్తావన ఎందుకు లేదు?

సార్వత్రిక సమ్మెకు యుటిఎఫ్, ఎపిటిఎఫ్ మద్దతు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 8,9 తేదీల్లో చేపట్టే సార్వత్రిక సమ్మెకు యుటిఎఫ్, ఎపిటిఎఫ్ మద్దతు ప్రకటించాయి. ఈ మేరకు ఆయా సంఘాల నేతలు ఆదివారం వేరువేరు ప్రకటనలు విడుదల చేశారు. దేశవ్యాప్తంగా నూతన పెన్షన్ విధానం రద్దు చేయాలని, విద్యారంగంలో కార్పొరేటీకరణ వ్యతిరేకిస్తూ ఈనెల 8న మండల కేంద్రాల్లో, 9న జిల్లా కేంద్రాల్లో జరిగే సమ్మెలో కార్యకర్తలు, ఉపాధ్యాయులు అందరూ పాల్గొనాలని యుటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ సాబ్జీ, పి బాబురెడ్డి విజ్ఞప్తి చేశారు. సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని, ఉద్యోగ నియామకాల్లో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, అవర్ బేసిస్, విద్యావాలంటర్లనే శాశ్వత పద్ధతిలో నియమించాలని జాతీయ స్థాయిలో ట్రేడ్ యూనియన్లు నిర్వహిస్తున్న సమ్మెకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ఎపిటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె వెంకటేశ్వరరావు, జి హృదయరాజు తెలిపారు.

గొర్రెలు, మేకలు పెంపకందార్ల సంఘం మద్దతు

గొర్రెలు, మేకలు పెంపకందార్ల సంఘం కూడా సమ్మెకు మద్దతు తెలిపింది. ఈమేరకు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.రామకృష్ణ ఆదివారం ప్రకటన విడుదల చేశారు. బిజెపి ప్రభుత్వం చేతి వృత్తిదారులకు, గొర్రెల పెంపకందారులకు, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని విమర్శించారు. బిజెపి పాలనలో వృత్తిదారుల జీవనం దెబ్బతిందని పేర్కొన్నారు.

8న సిఎం ఢిల్లీ టూర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ నెల 8న ఢిల్లీ వెళ్లనున్నారు. అదే రోజు టిడిపి ఎంపీలతో సమావేశం కానున్నారు. కేంద్రంతో పోరాటం ఎలా చేయాలనే అంశంపై వారికి దిశా నిర్దేశం చేయనున్నారు. ప్రధాని మోడీ ఏపీపై చేసిన వ్యాఖ్యలు, పోలవరం, వెనుకబడిన ప్రాంతాల జిల్లాల నిధులపై చంద్రబాబు వారితో చర్చించే అవకాశాలున్నట్లు సమాచారం.

విద్యుత్ షాక్ తగిలి గిరిజనుడు మృతి

మరొకరికి గాయాలు

ప్రజాశక్తి - మారేడుమిల్లి (తూర్పుగోదావరి)

అడవి పందుల వేటకు ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు తగిలి షాక్‌తో గిరిజనుడు మృతి చెందగా, మరొకరు గాయపడిన సంఘటన తూర్పుగోదావరి జిల్లా మారేడుమిల్లి ఉండుగండిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... మారేడుమిల్లి మండలం బొడ్లంకకు చెందిన వేమ సన్యాసిరెడ్డి (45), సాదల రాఘవరెడ్డి, ఉప్పరి గోతులకు చెందిన కోడా పొదలం ముగ్గురూ కలిసి ఉడుంగండి సమీపంలో అడవి మార్గంలో వెళ్తు న్నారు. ఈ నేపథ్యంలో అడవి పందుల వేటకు ఏర్పాటు చేసిన విద్యుత్ తీగ ఉచ్చు సన్యాసిరెడ్డి కాలికి తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. కోడా పొదలం గాయపడ్డాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ తులసీరామ్ ఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాన్ని రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సభ
స్వర్ణభారత్ ట్రస్ట్ మూడో వార్షికోత్సవ సభలో మాట్లాడుతున్న ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు



విమర్శలు సహేతుకంగా ఉండాలి

ఉపరాష్ట్రపతి హితవు

ప్రజాశక్తి - ఉంగుటూరు

రాజకీయ నాయకులు నోరు జారి సమాజంలో దిగజారొద్దని భారత ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. కృష్ణాజిల్లా విజయవాడ చాప్టర్ ఉంగుటూరు మండలం ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్ట్ మూడో వార్షికోత్సవ కార్యక్రమం ఆదివారం ట్రస్ట్ మీటింగు హాలులో జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో విమర్శలు, పొగడ్తలు ఎక్కువయ్యాయని, విమర్శలు సహేతుకంగా ఉండాలని, రాజకీయ నాయకులు హుందాగా వ్యవహరించాలని హితవు పలికారు. స్వర్ణభారత్ ట్రస్ట్ విజయవాడ చాప్టర్ ప్రజాబాహుళ్యంలో చేసిన సేవా కార్యక్రమాలతో మంచి పేరు సంపాదించుకోవడం అభినందనీయం అన్నారు. సేవా భావం గల ఎవరితోనైనా స్వర్ణభారత్ కలసి పనిచేస్తుందని పేర్కొన్నారు. ఈ మూడేళ్ళల్లో విద్య, వైద్యం, యువతకు, మహిళలకు, రైతులకు అనేక అంశాల్లో శిక్షణ ఇచ్చి సమాజాభివృద్ధికి కార్యక్రమాలు చేయడం హర్షణీయం అన్నారు. బాలల హక్కుల ఉద్యమనేత, నోబెల్ శాంతి పురస్కార గ్రహీత కైలాష్ సత్యార్థి మాట్లాడుతూ భారతదేశంలో అనేక సమస్యలు ఉన్నా అంతకు మించి వాటిని పరిష్కరించుకోగల శక్తి ప్రజల వద్ద ఉందన్నారు. కాలం వేగవంతమైన ఈ రోజుల్లో అందరూ శాస్త్ర సాంకేతికను అందిపుచ్చుకుని ఫేస్‌బుక్, ట్విట్టర్, ఈమెయిల్ ద్వారా సమాచారం ఇతరులతో పంచుకున్నా వాటిల్లో మానవత్వం లేదన్నారు. ఎదుటి వారిపట్ల మానవత్వం, కరుణ చూపితేనే దేశం బంగారు భారత దేశంగా మారుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఓ చైర్మన్ జి.సతీష్‌రెడ్డి, మాజీ మంత్రి కామినేని శ్రీనివాసరావు, విశాఖ ఎంపి కె.హరిబాబు, స్వర్ణభారత్ ట్రస్ట్ కార్యదర్శి సిహెచ్ రామకృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

నిలిచిన ఎన్‌టిఆర్ వైద్య సేవలు

- బకాయిలు చెల్లింపు, టారిఫ్ పెంపు అమల్లోకి రాకపోతే
- అత్యవసర సేవలూ నిలిపివేస్తామంటున్న ఆషా
- రూ.230 కోట్లు విడుదల చేశాం : సిఇఓ
- నేడు ప్రభుత్వంతో చర్చలు



ప్రజాశక్తి-గ్రేటర్ విశాఖ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడంతో ఎన్‌టిఆర్ వైద్య సేవలు, తల్లి సురక్ష, రాష్ట్ర ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, జర్నలిస్టులకు అందాల్సిన వైద్య సేవలు నిలిచిపోయాయి. నెట్‌వర్క్ ఆసుపత్రులకు చెల్లించాల్సిన రూ.500 కోట్లు చెల్లించకపోవడంతో పాటు టారిఫ్ ధరలను పెంచకపోవడాన్ని నిరసిస్తూ వారం రోజులుగా ఎన్టీఆర్ వైద్య సేవలను బంద్ చేశారు. రాష్ట్రంలోని 435 నెట్‌వర్క్ ఆసుపత్రులకు గాను 350 ఆసుపత్రుల్లో ఈ నెల 1 నుంచి సేవలు నిలిపివేయబడ్డాయి. దీంతో వీటి పరిధిలోకి వచ్చే పలువురు రోగులు ఇబ్బందులు పడుతున్నారు. నెట్ వర్క్ ఆసుపత్రులు అందించిన 90 వేలకు పై చిలుకు క్లెయిమ్స్ ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ ఇంకా సెటిల్ చేయలేదని ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ హాస్పిటల్ అసోసియేషన్(ఆషా) తెలిపింది. డిసెంబరులోనే ప్రభుత్వానికి ఆషా అల్టిమేటమ్ ఇచ్చింది. అప్పట్లో వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి వారం రోజుల్లో 70 శాతం నిధులను విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. ఒప్పందం జరిగి రెండు వారాలు గడిచినా నేటికీ ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని ఆషా ప్రతినిధులు చెబుతున్నారు. అయినా అత్యవసర సేవలు కొనసాగిస్తున్నామంటున్నారు. సోమవారం మళ్లీ రాష్ట్ర ప్రభుత్వంతో చర్చలకు వెళుతున్నట్లు అసోసియేషన్ చెబుతోంది. హాస్పిటల్స్‌లో అధిక నాణ్యత గల టారిఫ్ సేవలతో పోలిస్తే ప్రభుత్వం ఇస్తున్న క్లెయిమ్ టారిఫ్ ఏ మాత్రం సరిపోవడం లేదని ఆషా ప్రతినిధుల వాదన. ఐదేళ్లలో ప్రభుత్వం 2.6 శాతం మాత్రమే టారిఫ్‌ను పెంచడంపై అసంతృప్తి వ్యక్తం చేసింది. ఎంప్లాయి హెల్త్ స్కీమ్ (ఈహెచ్‌ఎస్)ద్వారా రావాల్సిన రూ.200 కోట్లు పైగా నిధులను వెంటనే విడుదల చేయాలని కోరుతోంది. సరిపడా సిబ్బంది లేమి కారణంగా బకాయి పడ్డ రూ.300 కోట్లలో కనీసం 70 శాతం ముందుగా అడ్వాన్స్ రూపంలో విడుదల చేసేలా ప్రభుత్వ ఉత్తర్వులు విడుదల చేయాలని కోరారు.

ఆషా డిమాండ్లు

10 శాతం టారిఫ్ పెంపు, ఈహెచ్‌ఎస్ టారిఫ్ ధరలనే ఆరోగ్య రక్ష పథకానికి అన్వయింపు, వైద్య, క్రిటికల్ ఇల్నెస్స్ ట్రీట్‌మెంట్ ఆషా, ట్రస్టు కలిసి అంగీకరించిన కొత్త ధరలలో వైద్య సేవలను అందించడం, ఆసుపత్రుల క్లెయిమ్ డిమాండ్లకు అనుగుణంగా ట్రస్ట్ పరిమాణాన్ని పెంచడం, ముఖ్య నిర్ణయాలకు సంబంధించి ట్రస్ట్ కార్యాలయంలో నిరంతర సమన్వయ సమావేశాలు ఏర్పాటు చేయడం, ట్రస్ట్ ప్రారంభించబోయే నూతన పథకాలకు సంబంధించి ఆసుపత్రుల యాజమాన్యాలతో సంప్రదించాలని కోరుతోంది.

ఎమర్జెన్సీ సేవలూ నిలిపేస్తాం



సోమవారం జరిగే ఎన్టీఆర్ వైద్య సేవ సమన్వయ కమిటీ సమావేశంలో సానుకూలమైన నిర్ణయం రాకుంటే నిరసన ఉధృతం చేస్తాం. మంగళవారం ఆషా ప్రతినిధులు సమావేశమై కార్యాచరణ ప్రకటిస్తాం. మానవతా దృక్పథంతో కొనసాగిస్తున్న ఎమర్జెన్సీ, డయాలసిస్, ట్రామా తదితర అత్యవసర సేవలనూ కూడా నిలిపివేస్తాం. తక్షణం ప్రభుత్వం గతంలో మాతో చర్చించి అంగీకరించిన వాటిని అమలు చేయాలి.

డాక్టర్ ఉన్నా మురళీకృష్ణ,
ఆషా రాష్ట్ర అధ్యక్షులు

హామీ ఇచ్చినా అంతరాయం సరికాదు

ఒక్క డిసెంబర్ నెలలోనే ఎన్టీఆర్ వైద్యసేవలకు రూ.138.39 కోట్లు, ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఇహెచ్‌ఎస్) కింద రూ. 92.12 కోట్లు కలిపి మొత్తం రూ. 230.51 కోట్లు విడుదల చేశామని సిఇఒ డాక్టర్ ఎన్. సుబ్బారావు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 48 ఆస్పత్రుల్లోనే వైద్యసేవలు కొనసాగడంలేదని స్పష్టంచేశారు. ఆస్పత్రుల యాజమాన్యాల డిమాండ్లు పరిశీలిస్తామని హామీ ఇచ్చినా వారు సేవలకు అంతరాయం కలిగించడం సబబు కాదని అభిప్రాయపడ్డారు.

సిఇఒ డాక్టర్ ఎన్. సుబ్బారావు

కార్పొరేట్లకు భూములిచ్చినా.. ప్రారంభమేదీ?

400 కోట్ల విలువైన స్థలాలు అప్పగింత • అప్పుడే 120 మందిని తొలగించిన సెల్‌కాన్

తిరుపతి ఎలక్ట్రానిక్ క్లస్టర్‌లో కార్బన్, సోజో, మవేరిక్ తదితర కంపెనీల తీరిది

ప్రజాశక్తి- తిరుపతి సిటీ ప్రతినిధి

'సెల్ కంపెనీలతో పాటు సెటాప్‌బాక్సులు, ఎల్ఇడి, బ్యాటరీలు, చార్జర్లు, ఇయర్‌ఫోన్లు, కెమెరా, మైక్, స్పీకర్లను తయారుచేసే సంస్థలనూ తీసుకొస్తున్నాం. కార్బన్, సెవెన్‌హిల్స్ డిజిటల్ పార్కుకూ భూములు ఇస్తున్నాం. తిరుపతిని ఎలక్ట్రానిక్స్ హబ్‌గా మారుస్తాం. ప్రారంభంలోనే 2,500 ఉద్యోగాలు. 40 వేల ఉద్యోగాల కల్పనే తమ లక్ష్యం. ఆయా కంపెనీలకు అవసరమైన అనుమతులు, రాయితీలను కల్పించడమే కాదు ఎపిఐఐసి ద్వారా సౌకర్యాలనూ కల్పిస్తాం. '

- 2017 జూన్ 22న సెల్‌కాన్ ప్రారంభోత్సవంలో రాష్ట్ర పరిశ్రమల శాఖామంత్రి అమరనాథరెడ్డి

-'నోయిడా తర్వాత సెల్‌ఫోన్ ఉత్పత్తుల్లో తిరుపతితే అగ్రస్థానంలో నిలవనుంది. ప్రారంభంలోనే 2,500 మందికి, 2020 నాటికి 10 వేల ఉద్యోగాలు, ప్రత్యక్షంగా, పరోక్షంగా మొత్తంగా 40 వేల ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా పనిచేస్తున్నాం. 20 ఎకరాల భూమి, నీరు, విద్యుత్ సౌకర్యాలు, రాయితీలూ ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు లోకేష్, అమరనాథరెడ్డికి ధన్యవాదాలు. '

- అదే రోజు ఆ సంస్థ ఛైర్మన్ గురునాయుడు

రేణిగుంట విమానాశ్రయానికి అతి చేరువలోని ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్ లో ప్రభుత్వం దాదాపు 400 కోట్లు విలువచేసే 80 ఎకరాల భూమిని ప్రయివేట్ కంపెనీలకు కారుచౌకగా కట్టబెట్టింది. స్థానికులకు లక్షలాది ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన కంపెనీలు భూములు తీసుకున్నాక ముఖం చాటేస్తుండటం గమనార్హం. సెల్‌కాన్ కంపెనీకి దాదాపు 100 కోట్లు విలువచేసే 20 ఎకరాల భూమిని కేవలం ఎకరా రూ 20 లక్షల చొప్పున 4 కోట్లకే అప్పగించిది. దీనికితోడు ఎపిఐఐసి ద్వారా ఏర్పాటుచేసిన షెడ్లుతో పాటు విద్యుత్, నీరు, పన్నుల్లోనూ రాయితీలను కల్పించింది. ప్రతిసెకనుకు ఒక సెల్‌ఫోన్ ఉత్పత్తి చేయగల దిగ్గజ సంస్థ తమదని, తమ సెల్‌ఫోన్లకు దేశవిదేశాల్లో పెద్దఎత్తున డిమాండ్ ఉందంటూ స్థానికులకు ప్రత్యక్షంగా 20 వేలు, పరోక్షంగా మరో 20 వేల ఉద్యోగాలు ఇస్తామని మభ్యపెట్టిన సెల్‌కాన్ ఈ ఏడాదిన్నర కాలంలో కేవలం 380 ఉద్యోగాలు మాత్రమే ఇచ్చింది. ఏడాది తిరగకుండానే 120 మందిని ఉద్యోగాలనుంచి తొలగించింది.

అలాగే యునైటెడ్ టెలీ లింక్స్ (కార్బన్) కంపెనీకి 15 ఎకరాలు, సోజో మ్యానుఫ్యాక్చరింగ్ సర్వీసెస్‌కు 15 ఎకరాలు, సెవెన్‌హిల్స్ డిజిటల్ పార్కుకు 23 ఎకరాలు, మావెరిక్ సిస్టమ్స్ కు 2.66 ఎకరాలు, మెడివిజన్ కు దాదాపు 6 ఎకరాలను ఎపిఐఐసి కేటాయించింది. అయితే ఈ కంపెనీలన్నీ నేటికీ ప్రారంభానికి నోచుకోకపోవడం గమనార్హం.

శ్వేతపత్రం విడుదల చేయాలి

రేణిగుంట విమానాశ్రయానికి అతి చేరువలో ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్ల-1 పేరుతో కార్పొరేట్ కంపెనీలకు కారుచౌకగా ప్రభుత్వం భూములను కట్టబెట్టింది.ఆర్భాటంగా ప్రారంభమైన సెల్‌కాన్ ప్రారంభంలోనే 2,500 మందికి ఉద్యోగాలిస్తామని కేవలం 380 మందికి ఇచ్చి ఉత్పత్తి తగ్గిపోయిందంటూ ఏడాదిలోపే 120 మందిని తొలగించింది. మిగిలిన కంపెనీలేవీ పత్తాలేవు. ప్రభుత్వం వెంటనే స్పందించి తిరుపతి, రేణిగుంట తదితర ప్రాంతాల్లో వివిధ కంపెనీలకు ఇచ్చిన భూములు, రాయితీలు, లక్ష్యాలు, ఉద్యోగాలపై శ్వేతపత్రాన్ని విడుదల చేయాలి.

- కందారపు మురళి,
సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి, తిరుపతి

ఇ-టెండరు ఆహ్వానిస్తూ నోటీసు

భారత రాష్ట్రపతి తరుపున, ది ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు (ఇ), విశాఖపట్నం సెంట్రల్ ఎలక్ట్రికల్ డివిజన్, సిపిడబ్ల్యుడి, విశాఖపట్నం వారు దిగువ పనులు **1)** "సమీర్, గంభీరం, విశాఖపట్నం వద్ద ల్యాబరేటరీ భవనం కొరకు ఎయిర్ కండిషనింగ్ సిస్టమ్ ఏర్పాటు" కొరకు సిపిడబ్ల్యుడి యొక్క అమోదిత మరియు అర్హత గల కాంట్రాక్టర్ల నుండి ఆన్‌లైన్ పర్సంటేజ్ రేట్ బిడ్‌లు అహ్వానించడమైనది **నిట్ నం.60/ ఇఇ(ఇ)/విసిఇడి/ఇ-టెండర్/2018-19 అంచనా విలువ: రూ.38,50,619/-, బయానా: రూ.77,012/-,** పూర్తి చేయుకాలం: 3 నెలలు, **బిడ్‌దాఖలకు చివరి తేది మరియు సమయం: 15.01.2019**న 15.00గం.ల వరకు.

2) "ఆదాయపు పన్ను భవనం, శ్రీకాకుళం, ఆంధ్రప్రదేశ్ వద్ద అంతర్గత ఇఐ & ఫ్యాన్‌లు పునరుద్ధరణ. **"నిట్ నం.61/ఇఇ(ఇ)/ విసిఇడి/ఇ-టెండర్/2018-19 అంచనా విలువ: రూ.7,76,301/-, బయానా: రూ.15,526/-,** పూర్తిచేయుకాలం: 2 నెలలు, **బిడ్‌దాఖలకు చివరి తేది మరియు సమయం: 15.01.2019**న 15.00గం.ల వరకు. బిడ్ ఫారాలు మరియు ఇతర వివరాలు వెబ్‌సైట్ www.tenderwizard.com/cpwd నుండి పొందవచ్చు అదే విధంగా ప్రెస్ నోటీసు www.eprocure.gov.in అందుబాటులో ఉంటుంది.



సాహిత్యానికీ, కళలకూ
సిద్ధాంత, రాజకీయ పక్షపాతం
ఉండితీరాలి!

– కారల్ మార్క్స్



దేశం లోపలి దురద!

ఎవడి దురదను వాడే గోక్కోవాలి
ఈ దురద మాత్రం పక్కవాడిని గోకుతుంది!
చదువుతో సంస్కారంతో వేషంతో ప్రాంతంతో
జీవన స్థాయితో దేనితోనూ పనిలేదు!

దురద మొదలైందంటే
మనసు ఊడేదాకా గోక్కోవటమే!
తాకీతాకగానే మొదలయ్యే
దురదగొండాకు దురద కన్నా
అతి ప్రమాదకరమైన దురద ఇది!

ఏ ఆదిమ గుహల్నుంచి వచ్చి వాలిందో
ఏ జీవన విధానం? పుచ్చి పురుగులా ఈ వ్యవస్థ!
దేహాన్ని కుళ్లింపజేస్తుందో
ఏ గుడ్డి నమ్మకాల ఆచార వ్యవహారం
దురదనో క్రూర మృగంలా
ఈ జాతి మీదకు వదిలిందో!

ఇంకా ఎంత కాలం, ఈ వెలివేతల దాష్టీకం?
దేశానికే దురద పెట్టించే అమావాస్య చీకటి గోళం
తరతరాలుగా మానవ సమాజాన్ని
పట్టి పీడిస్తున్న గజ్జి పురుగు వేళాకోళం!

చూపుడు వేలి మీది సూర్యోదయం వెలుగులో
ఈ దేశానికి పవిత్ర స్నానం చేయించాలి
పల్లెనుంచి పట్నందాకా దేశమంతా మొలిచిన
దురదగొండాకుల చేతుల్ని తెగనరకాలి
మానవత్వపు పరదాలు కప్పి
ఈ దురదగొండి సమాజానికి
కొత్త కళ్లద్దాలేవో ఇవ్వాలి
వెలి వాడిన పూల వనాల్లో
వాడ వాడలా చూపుడు వేళ్లు
సూర్యోదయాలై మొలవాలి
ఈ దేశానికి పట్టిన దురద
ఆ చైతన్యపు వెలుగుల్లో మాడి మసైపోవాలి!

– నిరంతర
82474 32521

స్వీయానుభవంలోంచి గిరిజన సాహిత్యం

సందర్భం



గిరిజన సాహిత్యాన్ని రెండు రకాలుగా విభజించాల్సి ఉంటుంది. ఒకటి : గిరిజన భాషల్లో లభించిన మౌఖిక సాహిత్యం. రెండు : ఆ జీవితాలపై తెలుగులో వచ్చిన సృజన సాహిత్యం. మొదటిదానిని మళ్లీ లిపి గల, లిపి లేని గిరిజన లేదా ఆదివాసీ సాహిత్యాలుగా పరిశీలించాలి. లిపి లేని వాటిని తెలుగులోనే చేయాలి. లిపి గల భాషల సాహిత్యాన్ని యథాతథంగా రాయించి నిక్షిప్తం చేయాలి. ఇందుకోసం ఆయా జాతుల్లోని విద్యావంతుల్ని పురమాయించాలి. ఈ విభాగంలో... సవర సాహిత్య సృజనకు సంబంధించి కామేశ్వరరావు గారు పలు సవర సంప్రదాయాల్ని పాటల రూపంలో రచన చేయగా, బిడ్డిక రవి సవర జీవిత విశేషాల్ని వివరిస్తూ 'సవర దర్శిని' పుస్తకాన్ని ముద్రించారు. ఈ క్రమంలోనే 'గిరిగింజ గిరి మల్లెలు' అనే చెంచుగీతాల సంపుటిని భూమని రవీంద్ర, తోకల గురవయ్య సంయుక్తంగా ముద్రించారు. ఇంకా శ్రీకాకుళం జిల్లా సీతంపేట ఏజెన్సీ ప్రాంతంలో ఆర్ట్స్ సంస్థ, గోదావరి పరీవాహక ప్రాంతంలో శక్తి శివరామకృష్ణ గిరిజన సాహిత్యంపై పలు పుస్తకాలు వెలువరించటం జరిగింది.

ఆదిలాబాద్ ఉట్నూర్ ప్రాంతంలో ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావు పర్యవేక్షణలో గుంజాల గ్రామంలో గోండు భాషా ఉద్యమం సాగుతోంది. డెబ్బయ్యో దశకంలో అక్కడి గోండులు వెలికితీసిన గోండి లిపిని ప్రాచుర్యంలోకి తీసుకురావడానికి విశేష కృషి చేస్తున్నారు. సుమారు నలభైమంది గోండు యువకులకు ప్రత్యేక శిక్షణనిచ్చి, వారిచే గోండి లిపిలో రెండు వాచకాలు తయారు చేసి, అక్కడి బాలబాలికలకు ప్రాథమిక విద్యనేర్పుతున్నారు. ఇదే 'గోండి కోయతూర్' ఉద్యమం. గోండు లిపిలోనే పిల్లలకు విద్యనందివ్వడం గొప్ప విషయం. ఆ తరువాత ఆ పిల్లలు తెలుగు నేర్చుకుని సాధారణ విద్యావిధానంలో కొనసాగుతారు. ఇలాంటి పనే మిగతా ఐటీడీయేల్లో కొనసాగుతున్నా అది సాంకేతికంగా లోపభూయిష్టంగా ఉంది. అక్కడ సవర భాషని తెలుగు లిపిలో రాయించారు. అంటే వారి భాషని తెలుగులో చదవాల్సి రావడం మరింత కష్టమైనదే అవుతుంది తప్ప ఉపయోగకరంగా ఉండదు. ఉన్న సవర లిపిని వాచకకర్తలు గుర్తించకపోవడమే దీనికి కారణం. దీనివల్ల విద్యార్థికి తమ భాషని నేర్చుకోవడానికి కూడా అదనంగా తెలుగు తప్పనిసరవడం దురదృష్టకరం. విజయనగరం, శ్రీకాకుళం, ఒడిషా సరిహద్దు ప్రాంతంలో ఉన్న కొంతమంది సవర భాషా సంఘాల ప్రతినిధులు గుంజాలలోని 'గోండి కోయతూర్' లాంటి ఉద్యమం చేపడుతున్నారు. కాగా, ఐటీడీయేలు వాచకాలను తయారు చేయడంలోనూ, భాషాబోధకులను గుర్తించడంలోనూ, వారికి గౌరవవేతనాలు కల్పించడంలోనూ తీవ్రమైన ఇబ్బందులకు గురి చేస్తున్నాయి.

ఇక లిఖిత సాహిత్యాన్ని కూడా రెండు విభాగాలుగా చూడాల్సి ఉంటుంది. అవి 1. గిరిజనేతరుల సహానుభూతి సాహిత్యం. 2. గిరిజనుల స్వీయానుభవ సాహిత్యం. ఇప్పటివరకూ తెలుగు గిరిజన సాహిత్యంలో సహానుభూతికి చెందిందే ఎక్కువ. మొదటి గిరిజన కథ రాసింది చింతా దీక్షితులు అనుకుంటున్న సమయంలో గూడూరు రాజేంద్రరావు అనే రచయిత రాశారని 'ఇప్పపూలు' కథాసంకలనం ద్వారా ప్రపంచానికి తెలిసింది. ఈ సంకలనం ద్వారా గిరిజన కథలు రాసే రచయితలు బయటికొచ్చారు. కరుణ కుమార, భూషణం, ఫణికుమార్, సాహు, బిఎస్ రాములు, పి.చంద్, అట్టాడ అప్పల్నాయుడు, అల్లం రాజయ్య, గోపీ భాగ్యలక్ష్మి, ఎ.విద్యాసాగర్, వాడ్రేవు వీరలక్ష్మీదేవి, సువర్ణముఖి, గంటేడ గౌరునాయుడు, శ్రీరామకవచం సాగర్, పెద్దింటి అశోక్‌కుమార్, బోయ జంగయ్య, జాతశ్రీ, జీవన్, కొండవీటి సత్యవతి, డాక్టర్ విఆర్ రాసాని, డా. దిలావర్, శిరంశెట్టి కాంతారావు, భూక్యా తిరుపతి, మల్లిపురం జగదీశ్, పి.విద్యాసాగర్, పద్దం అనసూయ ఈ సంకలనంలోని కథారచయితలు. వీరితో పాటు బమ్మిడి జగదీశ్వరరావు, పలమనేరు బాలాజీ, సమ్మెట ఉమాదేవి లాంటి రచయితలు కూడా గిరిజన కథలు రాసినవారే! వారిలో స్వీయానుభవంతో రాసినది ఎంతమంది అనేది ప్రశ్న.

భారత సమాజంలో ఆదివాసీలు మూలవాసులు. తమ మీద జరుగుతున్న అణచివేతకీ, సంపదల పరిరక్షణ కోసం దోపిడీ, పీడనలను ఎదుర్కొంటున్న పోరాట యోధులు. అదే సమయంలో ఆచారాలు, సంస్కృతీ సంప్రదాయాల ప్రత్యేక వారథులు. వారి ఆశలు, ఆకాంక్షలూ, ఆచారాలూ, భాషలూ... ప్రశ్నార్థకమవుతున్న సందర్భంలో ఉన్నాం మనం. ఇవన్నీ సాహిత్యంలో రికార్డు కావాలి. స్వాతంత్ర్యానంతర భారతావని సాహిత్య చరిత్రలో ఆదివాసీ గొంతులు దాదాపు శూన్యం. దీనికి కారణాలు విశ్లేషించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పలమనేరు బాలాజీ, పద్దం అనసూయ, మల్లిపురం జగదీశ్, తోకల రాజేష్, తిమ్మక రామ్‌ప్రసాద్ లాంటి కవులు, రచయితలు రాకమునుపు తెలుగు సాహిత్యంలో గిరిజనుల స్వీయానుభవ సాహిత్యం దాదాపు శూన్యం. ఇటీవల సామాజిక మాధ్యమాల్లో వెలుగుచూస్తున్న పేరు కుంజా కళ్యాణి. ఈమె పద్దం అనసూయకు కొనసాగింపుగా చెప్పుకోవచ్చు. ఆదివాసీ కోయ తెగ నుంచి కవిత్వం రాస్తున్న కొత్త గళం ఈమె. ఆత్రం మోతీరాం మొదటి కొలామీ కవి. ఇతను ఉట్నూర్ ప్రాంతం నుంచి కొలామీ భాషలోనూ, తెలుగులోనూ కవిత్వం రాస్తున్నాడు. రమేష్ కార్తీక్ నాయక్ ఇటీవల తన కవితలను 'బల్దేరు బండి' పేరుతో పుస్తకరూపంలో తీసుకొచ్చిన యువ కవి. ఉత్తరాంధ్ర నుంచి జాతాపు ఆదిమ తెగనుంచి రాస్తున్న కవి రామ్ ప్రసాద్. కృష్ణచవాన్ కవులు అటు సంస్కృతంలోనూ, ఇటు తెలుగులోనూ రాస్తున్నారు. వీళ్ళంతా స్వీయానుభవంతో సాహిత్య సృజన చేస్తున్నారు.

ఈ నేపథ్యంలోనే 'శిలకోల' కథా సంపుటి గురించి ప్రస్తావించాలి. ఇది ఆదివాసీ హృదయాన్ని ఆవిష్కరించే పుస్తకం. ఈ కథల్లో కొన్ని ఆదివాసీలు మాత్రమే చెప్పగలిగేవి ఉన్నాయి. ఇందులో టిపిలికి పెళ్ళి, బాకుడుంబారి, గాయం, అరణ్యరోదన, దారి, శిలకోల లాంటి కథలు ప్రత్యేకమైనవి. ఈ కథలు ఆదివాసీ జీవితాలు ఎలా పరాయీకరణ చెందాయో, అక్కడి సంపద, స్త్రీలూ ఎలా దోపిడీకి గురయ్యారో చర్చిస్తాయి. దీనికి ప్రధాన కారణం వస్తు వినియమ సంస్కృతి, టెక్నాలజీ, ప్రభుత్వ పథకాలూ లాంటివి అడవుల్లోకి ప్రవేశించడమే అని సూత్రీకరిస్తాయి. స్వీయానుభవం కారణంగా ఈ కథల స్వరంలో తీవ్రత, నిజాయితీ వినిపిస్తాయి.


తెలుగు సాహిత్యలోకంలో ఆదివాసీల నుంచి రచయితలు అతి తక్కువమంది ఉండడానికి ప్రపంచీకరణ, అవిద్య, మూఢనమ్మకాలు, నాగరికతకు దూరంగా ఉండడం లాంటివి కారణాలుగా కనిపిస్తున్నాయి. వీటిని పారదోలడానికి ప్రభుత్వాలు ఎన్నో పథకాలను ప్రవేశపెడుతున్నాయి. వాటి అమలు తీరు ప్రశ్నార్థకంగా మారడంతో అనుకున్న లక్ష్యాలను సాధించలేకపోతున్నాయి. అడవి గనులు, బాక్సైట్ లాంటి సహజ సంపదతో ఉంది. ప్రభుత్వాల కన్ను ఎప్పటినుంచో వాటిపై ఉంది. వాటికోసం ఉన్న చట్టాలను బలహీనపరిచి ఆదివాసులను నిర్వాసితులుగా మార్చే ప్రక్రియ నిరంతరం జరుపుతుండడంతో ఆదివాసుల అభివృద్ధి కుంటుపడుతోంది. ఈ విస్థాపన మూలంగా ఆదివాసులు తమ అస్థిత్వాలను కోల్పోయి బతుకు జీవుడా అంటూ వలస పోతున్నారు. పోలవరం లాంటి ప్రాజెక్టుల వల్ల వేల మంది ఆదివాసులు నిర్వాసితులుగా మారిపోయారు. పాడేరు, అరుకు ప్రాంత బాక్సైట్ తవ్వకాల వల్ల సహజసిద్ధమైన పర్యావరణం దెబ్బతినడమే కాకుండా ఆదివాసులు తమ బతుకుల్ని కోల్పోవాల్సి వస్తోంది. వాకపల్లి గాయం ఇంకా మాననే లేదు. ప్రజాస్వామ్యం మీదే సందేహం కలుగుతున్న ఇలాంటి సంఘటనలు సాహిత్య రూపం దాల్చాల్సి ఉంది. ఈ అనుభవాలు కథలుగా మలచాలి. ఆదివాసీ సాహిత్య కారులు మరింతమంది తయారు కావడానికి ఇప్పుడున్న రచయితలు సీరియస్‌గా దృష్టి పెట్టాలి. సాహిత్య సంస్థలు, మేధావులు ఆ దిశగా కృషి చేయాలి.

అంతరించిపోతున్న ఆదిమ సంస్కృతి, మానవీయ ఆచార సంప్రదాయాలు ఒకవైపు... దూసుకొస్తున్న ప్రపంచీకరణ మరోవైపు. ఈ నేపథ్యంలో రచనలు రావాలి. గిరిజనులు ఎలాంటి అభివృద్ధిని, మార్పునూ కోరుకుంటున్నారు? అడవి వనరులను ధ్వంసం చేస్తున్న నమూనాను అభివృద్ధి అని నామకరణం చేస్తున్న ఈ సందర్భం సరైనదా? అభివృద్ధికి అసలు నిర్వచనం ఏమిటి? దానిని ఎవరు నిర్వచించాలి? పాలకులా? ఆదివాసీలా? ఈ ప్రశ్నల్ని అర్థం చేసుకోవాల్సిన అవసరం నేటి తరం రచయితలకు చాలా కీలకం. గిరిజన యువతలో సాహిత్యం పట్ల అభిరుచిని, తమ సంస్కృతి పట్ల గౌరవభావాన్ని పెంపొందించడం, దాన్ని అక్షర రూపంలోకి తేవటం వంటి అంశాల్లో విద్యావంతులు, గిరిజన సంఘాలు సాంస్కృతిక శాఖలు, పాఠశాలలు, సాహిత్య సంస్థలు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– మల్లిపురం జగదీష్
94401 04737

అద్దేపల్లి ఒక చైతన్య దీప్తి

స్మరణ



అతడు... 'కవితలో అగ్గిపిడుగు/ మమతకు అమృతం మడుగు/ వర్ధిష్ణు కవులకు గొడుగు/ అభ్యుదయ భావాలకు ముందడుగు' అని డా॥ పంపన సూర్యనారాయణ గారన్నది యదార్థం. అద్దేపల్లి రామమోహనరావు జీవన ప్రయాణానికీ, సాహితీ ప్రయాణానికీ తనదంటూ ఒక మార్గాన్ని ఏర్పరచుకుని, ఆ మార్గంలో నిబద్ధతగా నడవడమన్నది పరిశీలించిన ప్రతి ఒక్కరికీ తెలిసే విషయం.

ఆచార్య తంగిరాల సుబ్బారావు గారు అద్దేపల్లి కంటే ఎంఏలో ఒక ఏడాది ముందున్నారు. ఇద్దరూ మంచి మిత్రులు. శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయంలో చదువుకున్నారు. ఆ యనంటారు...

'1935లో అఖండ గోదావరీ తీరంలో నేను
1936లో కృష్ణవేణీ తరంగిణీగానంలో నీవు
బొమ్మన్ గర్భ దరిద్రం ఊబిలో/ పీకల దాకా కురుకుపోయి/ బొమ్మిడాయిల్లా గిలగిలా తన్నుకొని/ విధి బెస్తవాడి వేళ్ళ సందుల్లోంచి తప్పించుకొని /వచ్చీచెడి చాయంగల విన్నపాలుగా పైకొచ్చి/ ఆంధ్ర సాహిత్య సరోవరంలో/ జంట తామర పూలుగా కన్నులు విచ్చి/ అదృష్టంతో ఇంత దూరం సురభిళ ప్రయాణం
బుద్ధుడిలా పెళ్ళాం పిల్లల్ని వదిలేసి/ పెద్దగా మహాభి నిష్క్రమణం చేసి/ తిరుపతి దేవుని అభయరణ్యాలలో/ తెలుగు ఎంఏ దీర్ఘ తపస్సు కోసం వలస పోయాం..

ఈ పంక్తులు ఆనాటి తంగిరాల, అద్దేపల్లిల కుటుంబ పరిస్థితులకు అద్దం పడతాయి. షష్టిపూర్తిని పురస్కరించుకుని అద్దేపల్లి వారి అరవై ఏళ్ళ జీవితాన్ని పృథ్వి రేఖ మాత్రంగా రాసి అద్దేపల్లి 'జీవన చిత్రాలు' పేరున పుస్తకంగా ముద్రించటం జరిగింది.

1963లో అద్దేపల్లి కవిత మొలకెత్తడం ప్రారంభమైంది. 1996 అంటే షష్టిపూర్తి నాటికి ఐదు కవితా సంపుటాలు మాత్రమే వెలువడ్డాయి. అందులో ఒకటి దీర్ఘ కవిత 'మెరుపు పువ్వు', నాలుగు కవిత సంపుటాలు ఆధారంగా లోతైన విశ్లేషణ చేశారు ప్రముఖ సాహితి విమర్శకులు గూడ శ్రీరాములు. అద్దేపల్లి ఏ సమాజాన్నైతే వెతికారో, ఏ వ్యవస్థ కోసం కలలు కన్నారో అది లభించలేదంటారాయన. అద్దేపల్లి దానవుడిలో మానవుడిని వెతికాడు. తన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని ఒక ప్రశ్నగా నిలుపుకుని, దాని జవాబు కోసం ఒక తాత్విక వెతుకులాటని తన కవిత్వంలో పలికించుకున్నాడు. మనిషి అంతిమ విజయ ఉద్ఘాటన, తన కవిత్వ ఉపసంహారం చేసుకున్నాడు. తెలుగు సాహిత్యంలో ప్రతిఫలించిన వామపక్ష తాత్త్విక ధార వికాస క్రమంలో తన కవిత్వాన్ని ఒదిగించుకొంటూ పోయాడు అని పేర్కొన్నారు శ్రీరాములు.

అద్దేపల్లి షష్టిపూర్తి సందర్భంగా 1996 సెప్టెంబరు, అక్టోబరు నెలలకు గాను కొల్లూరి తన ఎక్స్‌రే పత్రికను ప్రత్యేక సంచికగా వెలువరించారు. దానికి నేను సంపాదకత్వం వహించాను. షష్టిపూర్తి తర్వాత ప్రయాణంలో కవిత్వం గురించి చెప్పుకున్నప్పుడు ముఖ్యంగా రెండు కవితా సంపుటాలను పేర్కొనాలి. ఒకటి : అయినా ధైర్యంగానే... ఇది సామాజిక చైతన్యానికి ప్రతీక. సాంఘిక రుగ్మతలపై పోరు. అద్దేపల్లి, తన జీవితంలో ఎదురైన ఒడిదుడుకులను నెట్టుకుంటూ ముందుకు సాగిన కవి, విమర్శకుడు. 'అయినా ధైర్యంగానే... ' కవితా శీర్షిక వెనుక ఈ నేపథ్యం గుర్తొస్తూ ఉంటుంది నాకు. రెండోది : 'పొగ చూరిన ఆకాశం'. ఇది ప్రపంచీకరణ నేపథ్యాన్ని తెరమీదికి తెచ్చిన కావ్యం. సామ్రాజ్యవాదం మనదేశ సంస్కృతీ సంపదను చిన్నాభిన్నం చేస్తుంది. వ్యాపారతత్త్వాన్ని మోహింప చేస్తుంది. ఆ నేపథ్యం గురించి ఒక కవితలో ఇలా అంటారు అద్దేపల్లి :

'వాడు మన పోరు పడలేక పోతూ పోతూ
దేశం మెదడులో వ్యాపార విత్తనం నాటిపోయాడు
ఏభై ఏళ్ళుగా అక్కణ్ణుంచి
ఎరువులు పంపుతూనే ఉన్నాడు
వాడి సముద్రాల నీళ్ళతో
మన పాదు తడుపుతూనే ఉన్నాడు
తన మొక్కని పెంచే సమర్థతనిస్తూనే ఉన్నాడు
మన మట్టిని మనమే తిట్టుకుని
గత కాలపు గోతిలో కప్పేట్టేటట్లు చేసాడు'

ఒక వ్యాసంలో కవితా శిల్పం శైలి గురించి ప్రస్తావిస్తూ డా॥ మేడిపల్లి రవికుమార్ ఇలా అంటారు... 'సుదీర్ఘ కాలంగా కవితా నిర్మాణం చేస్తున్న కలం అద్దేపల్లిది. స్వీకరించిన వస్తువును బట్టి, ఎంచుకున్న శ్రోతనుబట్టి, కవిత్వ నిర్మాణ పద్ధతిలో మార్పులు చేసుకోవడం కవి ప్రతిభను నిరూపిస్తుంది. అద్దేపల్లి, అటువంటి ప్రతిభ, సృజన శక్తి పుష్కలంగా కలిగిన కవి. అందుకే పొగ చూరిన ఆకాశం సంపుటిలో వైవిధ్యభరితమైన కవితా శిల్పం కనిపిస్తుంది.'

అద్దేపల్లి, దేశం భవిష్యత్తు మీద, శ్రమశక్తి మీద గొప్ప నమ్మకం ఉన్నవారు అంటూ, కింది పంక్తుల్ని ఉదహరించారు రవికుమార్.

'మనసులోని మట్టితనం/ మేల్కొనే సమయం వచ్చింది/ అమ్మతనం ముందు అమ్మకం ఓడిపోతుంది/ మన శ్రమతో మన దారిలోని ముళ్ళనూ రాళ్ళనూ/ మనమే తొలగించుకుని/ కొత్తదారి వేసుకున్నాక/ దేశం తలెత్తితే ఆకాశం తగలాలి/ దేశం చెయ్యి చూస్తే/ సూర్యబింబం వచ్చి అరచేతిలో నిలవాలి!/ ఇప్పుడు దారి మోస్తున్న గమ్యం/ దేశం మీద శిరస్సులా కనిపించింది/ దేశమే ఒక జెండాగా
నా గుప్పిట్లో నిలబడింది' ఇది కవి యొక్క ప్రధాన ఆత్మవిశ్వాసం అంటారు డా॥మేడిపల్లి. రవికుమార్. తంగిరాల వారి దృష్టిలో అద్దేపల్లి అభ్యుదయ కవి వసంతుడు; ఆధునిక కావ్య విమర్శక శిఖామణి; సహృదయ రేఖరుడు.

అద్దేపల్లికి షష్టిపూర్తి ఆలోచన అసలు లేదు. 1994లో ఆరుద్ర సాహిత్య పక్షోత్సవం నిర్వహించిన అనుభవం, కుతూహలం పృథ్విని అద్దేపల్లి షష్టిపూర్తి వైపు మళ్ళించాయి. ఆయన్ని ఒప్పించాక, ఘనంగా నిర్వహించడానికి ఒక ప్రణాళిక ఏర్పరుకోవడం, ఆ ఉత్సవ శిఖరం మీద విజయపతాకను ఎగురవేయడం జరిగింది. అదే విధంగా 2006లో సప్తతి పూర్తి ఉత్సవం కూడా అద్భుతంగా నిర్వహించారు. ఈ రెండు సందర్భాల్లోనూ మిత్రుల సహకారంతో విలువైన ప్రత్యేక సంచికలను పృథ్వి వెలువరించారు.

జీవన్‌గారొక మాటన్నారు : అద్దేపల్లి ఎక్కడ అని ప్రశ్న వేసుకున్నప్పుడు– అక్కడ, ఇక్కడ ఎక్కడైనా వరద గోదావరిలో, యువకవుల పదచిత్రాల వద్ద, ప్రజాకళాకారుల వద్ద, ఇంకా అందరూ ఆదమరచి నిద్రిస్తుంటే కళ్ళల్లో కవిత్వం ఒత్తువేసుకుని కాలానికి కాపలా కాస్తూ కనిపిస్తాడు .. చూడు' అని. అద్దేపల్లికి గాలి, నీరు, ఆహారం కవిత్వమే! స్నేహం, సహృదయత, ప్రేమ, ఆత్మీయత, సాహిత్యం, సద్విమర్శ, ఉత్సాహం, ప్రోత్సాహం... వీటన్నింటినీ కలిపి కూడితే 'అద్దేపల్లి' అవుతారని ఆసు రాజేంద్ర అంటారు. షష్టిపూర్తి అనంతరం పృథ్వి చొరవతో 'అద్దేపల్లి సాహిత్య ఫౌండేషన్' ఏర్పడింది. అద్దేపల్లి రచనల్ని కూడా కొన్నింటిని ఈ సంస్థ ముద్రించింది. అందులో ముఖ్యంగా అద్దేపల్లి వారి పిహెచ్‌డి సిద్ధాంత గ్రంథం 'అభ్యుదయ విప్లవ కవిత్వాలు, సిద్ధాంతాలు, శిల్పరీతులు' ఒకటి. సాహిత్య సిద్ధాంతమనేది తప్పకుండా ఒక సామాజిక సిద్ధాంతానికి ప్రతిబింబమే అవుతుందంటారు ఆయన.

సాహితీ చైతన్యానికి ప్రతినిధిగా నిలిచి, జీవన యాత్రలో స్నేహ సౌగంధాన్ని పరిమళింపజేసి, జాతి అభ్యుదయమే లక్ష్యంగా నిరంతర రచనా శీలి అయిన అద్దేపల్లి– సాహిత్య సౌరభాన్ని తెలుగు ముంగిట్లో విడిచి, ఆకస్మికంగా అంతర్ధానమై అప్పడే మూడేళ్ళు గడిచిపోయాయి. ఆయన చైతన్య స్ఫూర్తి, వెలిగించిన కవితాదీప్తి తెలుగు సాహిత్యలోకంలో ఎప్పుడూ ప్రేరణనిస్తూనే ఉంటాయి.

(జనవరి 13 : అద్దేపల్లి 3వ వర్ధంతి)

– ఎస్ఆర్ పృథ్వి




జాతీయ గీతాన్ని ..!

నేనొక నిశ్శబ్ద జ్వాలాతప్త హృదయాన్ని
సుడిగుండాలను మోస్తూ
సుడిగాలులు గుండెను చుట్టేస్తున్నా
సెలయేటి చల్లదనాన్ని పంచే
మలయమారుతాన్ని!

చీత్కార కోణాలను చమత్కార బాణాలను
మౌనంగా భరించే సుదూర తీరాన్ని
న్యాయాన్వేషణకై నిప్పుని రాజేసుకుంటున్న నిజాగ్నిని నేను
నవ్వుతూ ఓటమిని పలకరించిన ఒంటరి పోరాటాన్ని
చీకటిని లోలోపల చిదిమేస్తూ
ఉషోదయాన్ని పూయించే నవోదయాన్ని!

కారణమేదైతేనేం? తప్పొప్పుల జాబితాలో
తూనికలేని తరాజుని నేను
నాకు నేను నాలోనేను మమేకమయ్యే
సప్త సముద్రాల హృదయఘోషను నేను
అవును... నేనొక హత్యచేయబడ్డ జాతీయగీతాన్నిప్పుడు...!

– వైష్ణవిశ్రీ
89772 37345



విగ్రహాల పూదోట

ప్రపంచ ప్రోగ్రెసివ్ ఇండెక్స్‌లో
మొదటి స్థానంలో
ఈ దేశాన్ని ఎలాగైనా ఇరికిద్దాం
సందు మొగదాట్లో
పుట్టుకొస్తున్న విగ్రహాలని లెక్కకడుతూ
ఇంటికో వెనకబాటు సముద్రాన్ని తవ్వుకుందాం!

ఇప్పుడీదేశం నేలమీద
అతిపెద్ద విగ్రహాలున్న దేశాల్లో ఒకటి
బహుశా మొదటిది కూడా కావచ్చు
పస్తులతో బతుకు తెల్లారే పొద్దులున్న దేశాల్లో
ఎన్నోదో లెక్కలు కట్టండ్రా నాయనల్లారా!

ప్రభుత్వ ఆసుపత్రుల్లో
సెలైన్ బాటిల్ తగిలించడానికి
ఒక ఇనప స్టాండ్ అవసరాన్ని గుర్తించలేని దేశం
ఒక్క పడకని ఎన్ని రోగాలకైనా పంచుతుంది
పేదరికపు అస్థిపంజరానికి
ఊపిరిమందును బొట్లు బొట్లుగా రాల్చేసి
మొనవిరిగిన సూదిని ఎన్నో ఏళ్ళుగా గుచ్చుతుంది

వేలకోట్లు ఖర్చుపెట్టి మొలిపిస్తున్న స్మృతివనాల్లో
ఎన్ని బతుకులు చిగుర్చుతున్నాయో మరి!
కచ్చితంగా ఆ నవ్వుల్ని జాతికంకితం చెయ్యాలిక
మనిషన్నవాడ్ని తుడిచేసి
అంగుళానికో విగ్రహంగా ప్రతిష్టిద్దాం
ఏంచక్కా.. దేశం
ఒక విగ్రహాల పూదోటని ప్రకటించుకోవచ్చు!

– బంగార్రాజు కంఠ
85003 50464

సమాచారం

కవిసంధ్య కవితల పోటీ–2019

మార్చి 21 ప్రపంచ కవితా దినోత్సవ సందర్భంగా కవిసంధ్య సాహిత్య సాంస్కృతిక సంస్థ, జైనీ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సహకారంతో కవితల పోటీ–2019ని నిర్వహిస్తోంది. కవిత్వంలో కొత్తతరాన్ని ప్రోత్సహించడం ఈ పోటీ ఉద్దేశం. విజేతలకు మొదటి బహుమతి రూ. 3 వేలు, రెండవ బహుమతి రూ. 2 వేలు, మూడో బహుమతి రూ. వెయ్యి; ఇవి కాక రూ.5,00 చొప్పున పది ప్రోత్సాహక బహుమతులు ఉంటాయి. సమకాలీనమైన వస్తువు, ఆధునికమైన భాష, అభివ్యక్తితో కూడిన వచన కవితలు మాత్రమే పరిశీలించబడతాయి. పాల్గొన దలచినవారు రూ.200 ఎంట్రీ ఫీజుగా చెల్లించాలి. బహుమతులు 21 మార్చి 2019న యానాంలో జరిగే ప్రపంచ కవితా దినోత్సవ సభలో ప్రదానం చేయడం జరుగుతుంది. కవితలు పంపడానికి చివరితేదీ 15 ఫిబ్రవరి 2019. కవితలు పంపవలసిన చిరునామా : దాట్ల దేవదానం రాజు, ఉపాధ్యక్షులు, కవిసంధ్య, 8-1-048, జక్రియనగర్, యానాం -533464, తూర్పు గోదావరి జిల్లా. వివరాలకు : 94401 05987, 8555830789, 9848202526.

సాహితీ మాణిక్యం అవార్డు 2018

రావులపాటి నారాయణ, మాణిక్యం పేరిట ఇచ్చే 'సాహితీ మాణిక్యం' అవార్డును 2018గాను ప్రముఖకవులు కోట్ల వెంకటేశ్వరరెడ్డి, ప్రసాదమూర్తికి ఇవ్వనున్నట్లు ఆర్.వెంకటేశ్వర్లు, ఆర్.శ్రీనివాసరావు తెలిపారు. గత పదేళ్లుగా ఈ అవార్డును ప్రదానం చేస్తున్నారు. అవార్డు ఎంపిక కమిటీ సభ్యులుగా ప్రముఖ కవులు ఖాదర్ మొహియుద్దీన్, ప్రసేన్, మువ్వా శ్రీనివాసరావు, రవి మారుతి వ్యవహరించారు. జనవరి 12న ఖమ్మం చెరువు బజార్‌లోని తమ ఇంటి వద్ద పురస్కారం ప్రదానం జరుగుతుందని నిర్వాహకులు శ్రీనివాసరావు, సీతారాం, వెంకటేశ్వర్లు తెలిపారు.



సీతాకోక వన్నెలు

సంక్రాంతి సందడి మొదలైంది. కొత్తకొత్త డిజైన్లలో పట్టుచీరలు మార్కెట్లో సందడి చేస్తున్నాయి. పండగ వేళ పట్టుచీరలు ప్రత్యేకంగా కనబడతాయి. ఇందులో కంచి, బెనారస్, ధర్మవరం.. ఇలా ఎన్నెన్నో రకాలు. ఏ వయసు వారికైనా నప్పే సరికొత్త డిజైన్లతో పట్టుచీరలు అలరిస్తున్నాయి. రొటీన్ రంగులకు భిన్నంగా సరికొత్తగా వస్తున్నాయి. ఇక్కడ చీరలు చూస్తుంటే మీకూ అలాగే అనిపిస్తోంది కదూ?!

బహుమతి పొందిన ముగ్గు



25 చుక్కలు
1 వచ్చేవరకు
ఎదురెదురుగా

సిహెచ్ కావ్యశ్రీ,
బాలాజీపేట,
విజయనగరం జిల్లా.



వి. కృష్ణవేణి,
ముజాఫర్ నగర్,
కర్నూలు జిల్లా.

20 చుక్కలు,
4 వరుసలు,
4 వచ్చేవరకు
సరిచుక్కలు.

మా చిరునామా:
'రమణుల రంగవల్లి', జీవన,
ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి,
గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇమెయిల్: jeevanapageps@gmail.com ఆదివారం మినహా ఉ.12 గం. సా.6 గం. మధ్య ఫోన్ నెం. 9490099006కు సంప్రదించండి.

బైకులకు సరికొత్త హంగులు!



మార్కెట్లో అందుబాటులో ఉన్న గ్రిల్ కవర్లు బైకు హెడ్‌లైట్, టెయిల్ లైట్, ఇండికేటర్లు వంటి వాటికి రక్షణగా ఉండడంతోపాటు బైక్‌కు ఓ కొత్త లుక్‌ను ఇస్తాయి. ఇనుముతో తయారయ్యే ఈ గ్రిల్ కవర్లు ఎన్నో రకాల డిజైన్లలోనూ, ఆకారాల్లోనూ లభిస్తూ.. చూడగానే ఆకట్టుకునేలా ఉంటాయి. వీటి నాణ్యత, డిజైన్, బైక్‌లో ఏ చోటులో అమర్చేందుకు వీలున్నదీ వంటి అంశాల ఆధారంగా వీటి ధర ఉంటుంది. సాధారణంగా వీటిని బైకుల్లో రేర్ వ్యూ మిర్రర్లు, హ్యాండిల్ బార్ మధ్య భాగంలో అమర్చుతారు. దీనివల్ల ట్రాఫిక్‌లో బైక్ నడిపేటప్పుడు రేర్ వ్యూ మిర్రర్లు ఎవరికైనా తగులుతాయేమో అన్నట్లుగా అనిపిస్తుంటుంది. ఈ ఇబ్బందిని తొలగించడంతోపాటు కాస్త విభిన్నంగా ఉండేలా హ్యాండిల్ బార్ గ్రిప్ వద్ద అమర్చేలా రేర్ వ్యూ మిర్రర్లు లభిస్తున్నాయి. కావాలనుకుంటే రెండు వైపులా లేకుంటే ఒకవైపు ఈ మిర్రర్‌ను అమర్చుకోవచ్చు.

హీట్ ప్రొటెక్షన్ ర్యాప్స్


బైక్ నడుపుతున్నప్పుడు ఇంజన్ నుంచి విపరీతమైన వేడి వెలువడుతుంది. దాని నుంచి వెలువడే పొగను బయటకు విడుదల చేసే ఎగ్జాస్ట్ పైప్, సైలెన్సర్లు కూడా బాగా వేడెక్కుతాయి. పొరపాటున వాటిని తాకినా, చిన్న పిల్లలున్న చోట వారు ముట్టుకున్నా తీవ్రంగా గాయం కావడం ఖాయం. అందువల్ల సైలెన్సర్, ఎగ్జాస్ట్ పైప్‌కు హీట్ ప్రొటెక్షన్ ర్యాప్స్ అందుబాటులోకి వచ్చాయి. ఫైబర్ గ్లాస్ మెటీరియల్‌తో తయారయ్యే ఈ ర్యాప్‌లు చూడడానికి మందపాటి డెనిమ్ వస్త్రం తరహాలో ఉంటాయి. వీటిని సైలెన్సర్, ఎగ్జాస్ట్ పైపులకు చుట్టడం వల్ల వేడి నుంచి రక్షణతో పాటు బైక్ కూడా విభిన్నంగా కనిపిస్తుంది.

సైడ్ బాక్సులు

బైకులకు పక్కన వెనుకభాగంలో ప్రత్యేకంగా అమర్చుకోవడానికి వీలుగా బాక్సులు లభిస్తున్నాయి. చాలా కాలం నుంచీ ఇవి అందుబాటులో ఉన్నా.. ఇటీవల విభిన్న ఆకారాలు, డిజైన్లలో ఈ బ్యాగులు లభిస్తున్నాయి. ఏవైనా ఫైళ్లు, తక్కువ పరిమాణంలో ఉండే సామగ్రితో ప్రయాణాలు చేసేవారికి ఇవి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. బైకు కూడా కాస్త ఆకర్షణీయగా కూడా ఉంటుంది. ఈ బాక్సులు ప్లాస్టిక్, ఫైబర్, ప్లైవుడ్, లెదర్, డెనిమ్ తరహా గట్టి క్లాత్ తదితర తరహాలో అందుబాటులో ఉన్నాయి. ఇవి తయారైన మెటీరియల్‌ను బట్టి రూ. 500 నుంచి 3,000ల వరకూ ధరలో లభిస్తున్నాయి. ★



ఉలవలతో ఆరోగ్యానికి వెచ్చగా ...



ఈ సీజన్లో శరీరం పైనమాత్రమే కాదు. లోపల కూడా వెచ్చగా ఉంచుకోవాలని భావిస్తుంటాం. అయితే ఆ పనిని ఉలవలు సమర్థవంతంగా చేయగలవని నిపుణులు సూచిస్తున్నారు. • ఉలవలు శరీర ఉష్ణోగ్రతను పెంచుతాయి. అందువల్ల వీటిని చలికాలంలో తీసుకుంటే శరీరం వెచ్చగా ఉంటుంది. చలి నుంచి రక్షణ లభిస్తుంది. • మహిళల్లో నెలసరిలో వచ్చే సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. • ఉలవల్ని నిత్యం తింటే ప్రొటీన్లు, క్యాల్షియం, పాస్ఫరస్, పీచు తదితర పోషకాలు లభిస్తాయి. ఇక ఉలవలను నిత్యం తీసుకోవడం వల్ల స్థూలకాయ సమస్యను తగ్గించుకోవచ్చు. • ఉలవలు ఆకలిని పెంచుతాయి. ఆకలి లేని వారు, పైత్యం ఎక్కువగా ఉన్నవారు వీటిని తింటే ఫలితం కనిపిస్తుంది. • మూత్రాశయం, మూత్రపిండాల్లో ఉన్న రాళ్లను ఉలవలు కరిగిస్తాయి. • ఎక్కిళ్లతో తరచూ బాధపడేవారు ఉలవలను ఉడకబెట్టుకుని తినాలి. ఉలవల వల్ల కడుపు ఉబ్బరం సమస్య నుంచి ఉపశమనం కలుగుతుంది.

మీకోసం



నారింజపండుని తినటం వల్ల మలబద్ధకం నుంచి ఉపశమనం పొందవచ్చు.

జీవన సౌరభం

అధికార వాంఛ, అసూయ అనేవి వ్యక్తిగత ప్రగతికి అవరోధాలు

PHONETICS for DSC-SGT



పి. అనంత్ ఎం.ఎ, బీఈడి
ఇంగ్లీష్ ఉపాధ్యాయులు, తెనాలి.
సెల్ : 9297359222

In writing, words are made of letters. In speech, words are made of sounds. There are two kinds of sounds Vowel sounds and Consonant sounds.

Study of speech sounds is called **Phonetics.** The study of the distribution and patterning of speech sounds in a language is called **Phonology.**

Linguistics is the study of language system. **International Phonetic Association** (IPA) designs phonetic symbols.

Received Pronunciation (RP) is a speech style which is based on social class. **Phoneme:** A **phoneme** is a single "unit" of sound that has meaning in any language. There are 44 phonemes in English

Vowel sounds are 20: All are voiced sounds. **Pure vowel or Monophthong** is a vowel which remains constant and does not glide. These are **twelve. Diphthongs** are the sounds which consist of a movement or glide from one vowel to another. These are **eight.**

iː READ	ɪ SIT	ʊ BOOK	uː TOO	ɪə HERE	eɪ DAY	
e MEN	ə AMERICA	ɜː WORD	ɔː SORT	ʊə TOUR	ɔɪ BOY	əʊ GO
æ CAT	ʌ BUT	ɑː PART	ɒ NOT	eə WEAR	aɪ MY	aʊ HOW

There are twenty four Consonant sounds in English.

p PIG	b BED	t TIME	d DO	ʧ CHURCH	ʤ JUDGE	k KILO	g GO
f FIVE	v VERY	θ THINK	ð THE	s SIX	z ZOO	ʃ SHORT	ʒ CASUAL
m MILK	n NO	ŋ SING	h HELLO	l LIVE	r READ	w WINDOW	j YES

Syllable: A **syllable** is a group of sounds with a vowel sound, with or without consonant sounds before and/or after it. Words ను ఒకటి లేదా అంతకంటే ఎక్కువ syllables గా విభజించవచ్చు.

ఉదాహరకు go ఒక syllable, mother రెండు syllables, grandmother మూడు syllables, intelligent నాలుగు syllables ఉన్న పదాలు.

Monosyllabic (ఒక syllable ఉన్న పదాలు) : Dip, four, sing, good, book, girl

Disyllabic (రెండు syllable ఉన్న పదాలు) : across, before, doctor, mother

Polysyllabic (రెండు syllables కంటే ఎక్కువ ఉన్న పదాలు) : appreciation, beautiful, minister, university

Word Stress : ఒకటికంటే ఎక్కువ syllables ఉన్న words ను ఉచ్చరించునప్పుడు, ఒక syllable ను మిగత syllables కన్న ఎక్కువ force తో pronounce చేస్తారు. దీనినే word stress అంటారు. while pronouncing words of more than one syllable, one of the syllables is said with more force than the others. This is called word stress.

1. Disyllabic Nouns/Adjectives/ Adverbs లో stress first syllable మీద ఉంటుంది.

E.g., Master, pleasure, teacher, famous, really, very

2. Disyllabic Verbs లో stress **second syllable** మీద ఉంటుంది.

e.g., For' get, re' lax, en' joy, for' give

3. Trisyllabic words లో మొదట third syllable strong అయితే దానిని stress చేయవలెను, అది weak syllable అయితే second syllable ను ఆ రెండూ weak syllables అయితే మొదటి syllableను stress చేయవలెను.

E.g., 'entertain, en' counter, 'parody, po' tato, dis' aster, 'cinema, 'custody etc.,

4. Polysyllabic Words -ee, -ese, -eer, -ette, -esque మొదలైన suffixes తో end అయితే ఆ words లో stress ఆ suffixes మీద ఉంటుంది.

E.g., refu' gee, volun' teer, cigar' ette etc.,

5. Polysyllabic Words -eous, -graphy, -ial, -ic, -ion, -ious, -ty, -ive మొదలగు suffixes తో end అయితే ఆ words లో stress ఆ suffixes కు ముందు ఉన్న syllable మీద ఉంటుంది.

e.g., advan' tageous, pho' tography, cli' matic, per' fection, tran' quillity

6. Compound words లోstress first word మీద ఉంటుంది.

e.g., 'Bookshop, 'bedroom, 'blackbird, 'breakfast, 'postman, 'airport

Intonation: Intonation describes how the voice rises and falls in speech. The two main patterns of intonation in English are: falling intonation and rising intonation. ★

Falling tone[↘]

Exclamatory sentences	What a fool he is!
Statements	It is raining.
Orders	Get out.
Wh.. questions	Who is shouting?

Rising tone[↗]

Tag Questions	I am busy, aren't I ?
Yes/No Questions	Are you ready?
Apologies	I am sorry.
Questions showing concern	Why are you crying?
Polite requests	Please go away.

EXERCISE :

1. How many syllables are there in the word "pronunciation".
a. Three b. Four
c. Five d. Six

2. Syllabification means
a. breaking a word into syllables
b. dividing vowel and consonants
c. add a vowel sound to every syllable
d. none of the above

3. RP stands for:
a. Repeated Pronunciation
b. Registered Pronunciation
c. Received Pronunciation
d. Requested Pronunciation

4. The number of phonemes in English are
a.12 b. 44 c. 20 d. 24

5. The number of monophthongs in English are
a. 12 b. 8 c. 24 d. 44

6. The number of diphthongs in English are
a. 12 b.8 c. 24 d. 44

7. Choose the word that has stress on the second syllable.
a. mother b. beauty
c. sister d. relax

8. Choose the word that has stress on the first syllable.
a. copy b. forget
c. forgive d. believe

9. Which of the following is not a speech organ?
a. lips b. teeth
c. palate d. cheeks

10. English phonemes, consonants and vowels are in the following order.
a. 8, 24, 12 b. 12,24,8
c. 42, 24, 20 d. 44,24,20

11. Change the stress from the first syllable to the second as in 'record-record'.
a. noun to verb b. verb to noun
c. noun to noun d. noun to adjective

12. Which of these terms refer to the study of speech process?
a. Phonology
b. Phonetic substances
c. Phonetics
d. Semantics

13. What is the full form of IPA?
a. Indian Phonetic Alphabet
b. International Phonetic Alphabet
c. International Phonetic Agreement
d. Indian Phonetic Agreement

14. What does the sign / / represent?
a. Phonetic transcription
b. Centralization
c. Voiced bilabial nasal
d. Rising- falling pitch

15. What is the structure in the following syllable: pack?
a. CVC b. CV
c. VCC d. VC

16. Which of these terms refers to the study of speech sounds of a given language and their function within the sound system of that language?
a. Phonetics b. Phonology
c. Syntax d. Morphology

17. Which of the following is not a polysyllabic word?
a. accountability b. irrational
c. tranquillity d. classroom

18. Identify the phonetic transcription of the word 'bus'.
a. /bes/ b. /bus/
c. /bs/ d. / bz/

19. Which of the following is not true about vowels?
a. voiceless b. voiced
c. diphthongs d. monophthongs

20. The falling tone is observed in
a. ordinary statements
b. w/h questions
c. commands
d. all the above

Answers : 1.C, 2.A, 3.C, 4.B, 5.A, 6.B, 7.D, 8.A, 9.D, 10.D, 11.A, 12.A, 13.B, 14.A, 15.A, 16.A, 17.A, 18.C, 19.A, 20.D.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

దక్షిణాది రాష్ట్రాలు - నిధుల కేటాయింపు



ఎస్.ఎం.సువర్ణకుమార్
డివిజినల్ అకౌంట్స్ ఆఫీసర్, ఏలూరు.
సెల్ : 9441169869

ఇండియన్ ఎకానమి

భారతదేశం భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతిరూపం. ఒకే జాతి కులంలోనే భిన్నత్వాన్ని పరిరక్షించే విధంగా రాజ్యాంగ నిర్మాతలు రాజ్యాంగాన్ని రూపొందించారు. వైవిధ్యభరితమైన జాతులు, సంస్కృతులు, భాషలు, ప్రాంతాల్లో జాతి నిర్మాణం నిరంతరాయంగా నిర్విఘ్నంగా కొనసాగుతుంది.

ఇటీవల కాలంలో దక్షిణాది రాష్ట్రాల వ్యయంతో ఉత్తరాది రాష్ట్రాలు అభివృద్ధి చెందుతున్నాయని, ఢిల్లీ పాలకులు దక్షిణాది రాష్ట్రాలను చిన్నచూపు చూస్తూ నిధుల కేటాయింపులో తగిన న్యాయం జరగడం లేదని దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు పేర్కొనటం గమనిస్తున్నాం. కర్ణాటక ముఖ్యమంత్రిగా పనిచేసిన సిద్ధరామయ్య మాటల్లో చెప్పాలంటే 'వింధ్య పర్వతాలకు దక్షిణాన ఉన్న ఆరు రాష్ట్రాలు ఎక్కువ మొత్తంలో పన్ను చెల్లిస్తూ తక్కువ మొత్తం పొందుతున్నాయి. ఉదాహరణకు ఉత్తర ప్రదేశ్ చెల్లించే ప్రతి రూపాయి పన్నుకు తిరిగి రూ.1.79 పొందుతుంటే, కర్ణాటక కేవలం రూ.0.47 మాత్రమే పొందుతుంది.' అని వ్యాఖ్యానించారు.

వింధ్య ప్రాంతాలకు ఉత్తరాన ఉన్న రాష్ట్రాలైన, హిందీ బెల్ట్‌గా పేర్కొనబడే ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, బీహార్, జార్ఖండ్, చత్తీస్‌ఘఢ్, రాజస్థాన్, ఢిల్లీ, పంజాబ్, హర్యానా వంటి రాష్ట్రాలను ఉత్తర భారతదేశంగా; తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, కేరళ రాష్ట్రాలను దక్షిణ భారతంగా పేర్కొంటారు.

– చారిత్రకంగా ఉత్తర, దక్షిణ భారతదేశాల మధ్య వైరుధ్యాలు ఉన్నప్పటికీ ఇటీవల కాలంలో 15వ ఆర్థిక సంఘం యొక్క పరిశీలనాంశాల విషయంలో ఈ వైరుధ్యం మరింత ప్రస్ఫుటంగా కనిపించిందని పేర్కొనవచ్చు. ఈ నేపథ్యంలో ఈ కింది అంశాలను పరిశీలించవచ్చు.

– చారిత్రకంగా ఉత్తర భారత దేశం అనేక విదేశీ దాడులకు గురయ్యింది. హిందుకుష్ పర్వత శ్రేణుల గుండా, ఇతర భూమార్గాల ద్వారా అనేక విదేశీ జాతులు వ్యాపార రీత్యా, రాజ్య విస్తరణ కోసం ఉత్తర భారత దేశంలోకి ప్రవేశించి మిశ్రమ జాతుల, సంస్కృతులు ఏర్పడడానికి కారణమయ్యారు. అయితే దక్షిణ భారతం ఇటువంటి విదేశీ దాడులకు లోనుకాలేదు. ప్రధానంగా సముద్రమార్గాల ద్వారా వ్యాపారాలు ఏర్పడడం ద్వారా భిన్నమైన సంస్కృతి ఏర్పడింది.

– ఉత్తరాది రాష్ట్రాలు, కేంద్రంలో జాతీయ పార్టీలు ఆధిపత్యం వహించగా దక్షిణ భారతదేశంలో ప్రాంతీయ పార్టీల ప్రాబల్యం ఎక్కువగా ఉంది. 1959లోనే మొట్టమొదటి కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని (కేరళ) రాష్ట్రపతి పాలనతో తొలగించబడింది.

– దక్షిణాది రాష్ట్రాల రాజకీయ నాయకులకు కేంద్రస్థాయిలో సరిపడనంత ప్రాతినిధ్యం దక్కలేదు. దక్షిణాది రాష్ట్రాలు ఆర్థికంగా దేశానికి ఇతోధికంగా తోడ్పడినప్పటికీ సరిపడినంత స్థాయిలో ప్రాతినిధ్యం కేంద్ర మంత్రి మండలిలో లభించలేదు.

– ఆర్థిక సంస్కరణల వల్ల లభించిన అవకాశాలను తమిళనాడు, కర్ణాటక ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలు వినియోగించుకుని లబ్ధి పొందగా బీహార్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, జార్ఖండ్, చత్తీస్‌ఘడ్, వంటి రాష్ట్రాలు సముచిత రీతిలో వినియోగించుకోలేక వెనకబడ్డాయి.

– 2011 జనాభా లెక్కల ప్రకారం దక్షిణాది రాష్ట్రాలలో జనాభా వృద్ధి రేటు ఉత్తరాది రాష్ట్రాలతో పోలిస్తే గణనీయంగా తగ్గిపోయింది. దక్షిణాది రాష్ట్రాలు ధనవంతమైన, వయసు మళ్లిన వారితో నిండిపోగా అందుకు భిన్నంగా ఉత్తరాది పేద, యుక్త వయస్సు వారితో నిండిపోయింది. దీనివల్ల దక్షిణాదిలో నైపుణ్యం లేని కార్మికులకు కొరత ఏర్పడగా, దేశంలో ఇతర ప్రాంతాల నుంచి దక్షిణాది రాష్ట్రాలకు వలసలు పోటెత్తుతున్నాయి.

ఇటీవల కాలంలో నాలుగేళ్లుగా కేంద్ర రాష్ట్ర సంబంధాలపై జరిగిన చర్చల్లో కేంద్రపన్నుల్లో పెరిగిన రాష్ట్రాల వాటాలపైనే జరిగింది. రాజకీయ, ఆర్థిక పాలనా సామర్థ్యం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధులను భారత రాజ్యాగంలో స్పష్టంగా పేర్కొన్నారు. వలస రాజ్యంగా ఉన్న సమయంలో స్వాతంత్ర్యం కోసం జరిగే తిరుగుబాటును అణిచివేయాలని అధికార కేంద్రీకరణ జరిగింది. అందుకే బలమైన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. స్వాతంత్ర్యం సిద్ధించి 70 సంవత్సరాలు అయినా నేటికీ రాష్ట్రాల చిన్న చిన్న ఆర్థిక అవసరాల కోసం కేంద్రంవైపు చూడాల్సిన పరిస్థితి నెలకొని ఉంది. రాష్ట్రాల ఆదాయ వనరులు తక్కువగా ఉండటమే దీనికి ప్రధాన కారణం.

మొదటి ఆర్థిక సంఘం కేంద్ర ప్రభుత్వ పన్నుల్లో కేవలం పది శాతం మాత్రమే రాష్ట్రాలకు పంచాలని సిఫార్సు చేసింది. ఈ వాటా క్రమేణా పెరుగుతూ వచ్చి 14వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు 42 శాతానికి పెరిగింది.

పూర్వ సంఘాలు 1971 జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకుని రాష్ట్రాల వాటాను సిఫార్సు చేశాయి. 14వ ఆర్థిక సంఘం 1971 జనాభా లెక్కలతోపాటు 2011 జనాభా లెక్కలను పరిగణనలోకి తీసుకున్నప్పటికీ దానికి తక్కువ మొత్తంలోనే వెయిటేజీ కల్పించింది. 1971 తరువాత నిర్బంధ కుటుంబ నియంత్రణా పద్ధతులు అమలులోకి తెచ్చారు. అందువల్లనే పూర్వ సంఘాలు 1971 జనగణనను ప్రాతిపదికగా తీసుకున్నాయి. 1971 నాటి జనాభా లెక్కల ఆధారంగానే లోక్‌సభ నియోజకవర్గాలను విభజించారు. అవి 2026 వరకూ అమలులో ఉంటాయని నిర్దేశించారు. అంటే 2031లో చేపట్టే జనగణన ఆధారంగా లోక్‌సభ సీట్లలో మార్పులు చేర్పులు చేయబడతాయి. కుటుంబ నియంత్రణలో విజయం సాధించిన రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా ఉండేందుకు ఈ ఏర్పాట్లు చేశారు.



ప్రగతిశీల దృక్పథంలో దక్షిణాది రాష్ట్రాల తల్లిదండ్రులు తక్కువ మంది పిల్లలుంటే వారి విద్య, అభివృద్ధి పట్ల ఎక్కువ శ్రద్ధ కనబరచవచ్చని, కుటుంబ ఆదాయాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని భావించారు. అందుకే 2011లో ఆంధ్రప్రదేశ్‌లో సంతాన సాఫల్యరేటు 3.2 శాతంగా ఉండగా, ఉత్తరప్రదేశ్‌లో 5.6 శాతంగా ఉంది. బీహార్‌లో 5.2 శాతం, రాజస్థాన్‌లో 4.3 శాతం ఉండటం గమనించవచ్చు. 15వ ఆర్థిక సంఘ సిఫార్సులకు ప్రాతిపదికగా 2011 జనాభా లెక్కలను తీసుకోవడం వల్ల దక్షిణాదికి నిధుల కేటాయింపు తగ్గిపోనుంది. 2031 జనాభా లెక్కల ఆధారంగా చేపట్టే లోక్‌సభ సీట్ల మార్పులలో దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోనున్నాయి. ప్రగతి శీలక, అభ్యుదయ పురోగమన విధానాలను అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలకు అటు నిధులలో కోత, పార్లమెంటు ప్రాతినిధ్యంలో తగ్గుదల వల్ల దక్షిణాది రాష్ట్రాలపై ఉత్తరాది రాష్ట్రాల పెత్తనం పెరగడం ఖాయంగా కనిపిస్తుంది.

14వ ఆర్థిక సంఘం సిఫార్సుల వల్ల (42 శాతం) కేంద్రం కోల్పోయిన మొత్తాన్ని కేంద్ర ప్రాయోజిత్ పథకాలకు కేంద్ర ప్రభుత్వం మద్దతును ఎత్తివేయడం వల్ల, కేంద్ర ప్రాయోజిత పథకాలకు ఇవ్వాల్సిన వాటాను తగ్గించడం వల్ల కేంద్రం భర్తీ చేసుకుంటుంది. అంతేగాక రాష్ట్రాలలో పంచుకోనవసరంలేని సుంకాలైన సెస్, సర్‌ఛార్జి స్పెషల్ డ్యూటీల రేట్లను కేంద్రం పెంచింది. ఉదాహరణకు 2018–19 ఆదాయపన్నుపై సర్‌ఛార్జిని 3 నుంచి 4 శాతానికి పెంచింది. కేంద్ర పన్నుల్లో సుంకాల శాతం 2012–13లో 8 శాతం ఉంటే అది 2016–17 నాటికి 15.2 శాతానికి చేరుకుంది.

ఉత్తరాది రాష్ట్రాల నుంచి ప్రస్తుతం ఎక్కువ సీట్లు లభించినందుకు ఆ ప్రాంతాలకు ఎక్కువ నిధులు కేటాయిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దక్షిణాది రాష్ట్రాలు తమ అభివృద్ధికి కావాల్సిన నిధులను అప్పు తెచ్చుకుంటుంటే, ఉత్తరాది రాష్ట్రాలు గ్రాంటుల రూపంలో నిధులు కేంద్రం నుంచి పొందుతున్నాయి. అప్పును వడ్డీతోసహా చెల్లించాల్సి ఉండగా గ్రాంటును తిరిగి చెల్లించనవసరం లేదు. ఉత్తరాదికి నిధులివ్వడమంటే అసమర్ధతను, అవినీతిని, అలసత్వాన్ని గౌరవించడమనీ, దక్షిణాదిపై వివక్షణు చూపడమంటే కష్టించే తత్వాన్ని, శ్రమించే తత్వాన్ని, సామర్థ్యం, చదువు, పెట్టుబడులపై పెట్టే సంస్కృతిని శిక్షించడమన్నమాట.

రాష్ట్రాల మధ్య పరస్పర నమ్మకం, సహకారం మీదనే దేశ ఐక్యత ఆధారపడి ఉంది. ఇప్పటికే దేశంలో అనేక ప్రాంతాల మధ్య అసమానతలు పెరిగిపోయాయి. సంతులత, సమ్మిళిత అభివృద్ధిలో భాగంగా అన్ని ప్రాంతాలనూ, అందరినీ అభివృద్ధి పథంలోకి తీసుకురావాల్సిందే. అయితే అందుకు కేటాయించిన నిధులు దుబారా కాకుండా పర్యవేక్షణ ఉండాలి. ★

ఉద్యోగాలు

ఏపీపీఎస్సీ 169 గ్రూప్-1 పోస్టులకు నోటిఫికేషన్

ఆంధ్రప్రదేశ్‌లో వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 169 గ్రూప్–1 సర్వీస్ పోస్టుల భర్తీకి రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) ప్రకటన విడుదల చేసింది.

పోస్టుల వివరాలు...

పోస్టులు : డిప్యూటీ కలెక్టర్, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ స్టేట్ ట్యాక్స్, డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (సివిల్), డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ జైల్స్ (మెన్), డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్లు, అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్/అసిస్టెంట్ అకౌంట్స్ **ఆఫీసర్ తదితర పోస్టులు...**

అర్హత : బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత. కొన్ని పోస్టులకు కమిషన్ నిర్దేశించిన ఇతర అర్హతలు ఉండాలి.

వయసు : 18–42 ఏళ్ల మధ్య ఉండాలి. రిజర్వేషన్ అభ్యర్థులకు సడలింపు ఉంటుంది.

ఎంపిక : ప్రిలిమినరీ ఎగ్జామ్, మెయిన్ ఎగ్జామ్, ఇంటర్వ్యూ ఆధారంగా.

ప్రిలిమినరీ పరీక్ష తేదీ : మార్చి 10, 2019.

మెయిన్ ఎగ్జామ్ తేదీ : 2019, జూన్ 10 నుంచి 22 వరకు.

దరఖాస్తు విధానం : ఆన్‌లైన్‌లో.

దరఖాస్తు ఫీజు: అప్లికేషన్ ప్రాసెసింగ్ ఫీజు రూ.250, ఎగ్జామ్ ఫీజు రూ.120 చెల్లించాలి.

దరఖాస్తు ప్రారంభతేదీ : జనవరి 7, 2019.

దరఖాస్తుకు చివరితేదీ : జనవరి 28, 2019.

ఫీజు చెల్లించుటకు చివరితేదీ : జనవరి 27, 2019.

వెబ్‌సైట్: https://psc.ap.gov.in

ఏపీపీఎస్సీ 446 గ్రూప్-2 పోస్టులకు నోటిఫికేషన్

ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 446 గ్రూప్–2 పోస్టుల భర్తీకి రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) ప్రకటన విడుదల చేసింది.

పోస్టులు: 446 (ఎగ్జిక్యూటివ్–154, నాన్ ఎగ్జిక్యూటివ్–292) అసిస్టెంట్ కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్, డిప్యూటీ తహశీల్దార్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్, అసిస్టెంట్ డెవలప్‌మెంట్ ఆఫీసర్, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్, సీనియర్ ఆడిటర్ తదితర పోస్టులు.

అర్హత : బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత. కొన్ని పోస్టులకు కమిషన్ నిర్దేశించిన ఇతర అర్హతలుండాలి.

వయసు : 18–42 ఏళ్ల మధ్య ఉండాలి. (ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్సై పోస్టుకు 18–28 మధ్య ఉండాలి). రిజర్వేషన్ అభ్యర్థులకు సడలింపు ఉంటుంది.

ఎంపిక: రెండంచెల రాత పరీక్ష ద్వారా.

స్క్రీనింగ్ టెస్ట్ తేదీ : మే 5, 2019.

మెయిన్ ఎగ్జామ్ తేదీ : 2019 జులై 18, 19 తేదీల్లో.

దరఖాస్తు విధానం : ఆన్‌లైన్‌లో.

దరఖాస్తు ఫీజు : అప్లికేషన్ ప్రాసెసింగ్ ఫీజు రూ.250, ఎగ్జామ్ ఫీజు రూ.80 చెల్లించాలి.

దరఖాస్తు ప్రారంభ తేదీ : జనవరి 10, 2019.

దరఖాస్తుకు చివరితేదీ : జనవరి 31, 2019.

ఫీజు చెల్లింపునకు చివరితేదీ : జనవరి 30, 2019.

వెబ్‌సైట్: https://psc.ap.gov.in

ఈఎస్ఐసీలో 329 ఉద్యోగాలు

ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్ఐసీ) ఆధ్వర్యంలో దేశంలోని వివిధ ఈఎస్ఐసీ ఆసుపత్రుల్లో 329 స్పెషలిస్ట్ గ్రేడ్–2 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

గ్రేడ్‌ల వారీ ఖాళీలు : సీనియర్ స్కేల్–72, జూనియర్ స్కేల్–257.

విభాగాలు : అనస్థీషియా, కార్డియాలజీ, హెమటాలజీ, న్యూరాలజీ తదితర విభాగాలు.

అర్హత : ఎంబీబీఎస్‌తో పాటు సంబంధిత స్పెషాలిటీలో పీజీ, అనుభవం ఉండాలి.

వయసు : జనవరి 24, 2019 నాటికి 45 ఏళ్లకు మించకూడదు. రిజర్వేషన్ అభ్యర్థులకు సడలింపు ఉంటుంది.

ఎంపిక విధానం : ఇంటర్వ్యూ ఆధారంగా.

దరఖాస్తు విధానం : ఆఫ్‌లైన్‌లో.

దరఖాస్తు ఫీజు : రూ.500 (ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ, మహిళలకు ఉచితం). **దరఖాస్తుకు చివరితేదీ :** జనవరి 24, 2019.

వెబ్‌సైట్: www.esic.nic.in

ఘనంగా ముగిసిన రాంకోసా స్వర్ణోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - కాకినాడ

తూర్పుగోదావరి జిల్లా కాకినాడ రంగరాయ వైద్య కళాశాల ఆర్ఎంసి ప్రాంగణంలో రెండు రోజులుగా జరుగుతున్న కళాశాల వజ్రోత్సవం, పూర్వ విద్యార్థుల సంఘం రాంకోసా స్వర్ణోత్సవ వేడుకలు ఆదివారంతో ముగిశాయి. నాలుగేళ్లకోసారి జరిగే ఈ వేడుకలకు ప్రపంచం నలుమూలల నుంచి రాంకోసా పూర్వ విద్యార్థులు కుటుంబాలతో హాజరయ్యారు. అనంతరం రాంకోసా నూతన అధ్యక్షునిగా ప్రముఖ వైద్యుడు వాడ్రేవు రవి, కార్యదర్శిగా డాక్టర్ కల్యాణ చక్రవర్తి, ట్రెజరర్‌గా డాక్టర్ సిహెచ్.కిరణ్, ఉపాధ్యక్షులుగా డాక్టర్ ఆనంద్, డాక్టర్ పిడుగు భాస్కర్, మరో 15 మందిని సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

దోమలజోరు గిరిజనులకు రగ్గులు పంపిణీ చేస్తున్న వి.శ్రీనివాసరావు



గిరిజనులకు రగ్గుల పంపిణీ

ఆదివాసీల సమస్యలు పరిష్కరించాలని వి.శ్రీనివాసరావు డిమాండ్

ప్రజాశక్తి - అరకురూరల్ (విశాఖపట్నం)

ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. అరకు మండలం మాదల పంచాయతీ పరిధి దోమలజోరు, రత్తకండి గ్రామాల్లో ఆదివారం ఆయన పర్యటించారు. సిపిఎం ఆధ్వర్యాన ఆయా గ్రామాల గిరిజనులకు శ్రీనివాసరావు రగ్గులు పంపిణీ చేశారు. అనంతరం స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రత్తకండి గ్రామంలో షెడ్‌లో నిర్వహిస్తున్న ప్రభుత్వ పాఠశాలను పరిశీలించారు. నిత్యం అభివృద్ధి జపం జపిస్తూ గిరిజన ఉద్ధరణే తన ధ్యేయమని గొప్పలు చెప్పుకొనే చంద్రబాబుకు గిరిజన గ్రామాల్లో సొంత భవనాలు లేక షెడ్లు, పాకలు నిర్వహిస్తున్న పాఠశాలలు కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పాఠశాలకు సొంత భవనాలకు నిధులు విడుదల చేసి నిర్మించాలని డిమాండ్ చేశారు. తీవ్రమైన చలితో ఇబ్బందులు పడుతున్న గిరిజనులకు ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు విడుదల చేసి రగ్గులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు దత్తత పంచాయతీ పెదలబుడులో శ్రీనివాసరావు పర్యటించి అక్కడి గిరిజనుల సమస్యలను తెలుసుకున్నారు. డ్రెయినేజీ, ఇతర మౌలిక వసుతులు లేక అనేక ఇబ్బందులు పడుతున్నామని, 24 గంటలు నీరు అందడంలేదని, దోమల బెడద ఎక్కువగా ఉందని స్థానికులు శ్రీనివాసరావు దృష్టికి తీసుకొచ్చారు. డిగ్రీ, బిఇడి చదువుకున్న యువత ఎక్కువగా ఉన్నా తమకు ఉపాధి కల్పించలేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకు శ్రామికుల సమాయత్తం

- పలుచోట్ల బైక్‌ర్యాలీలు, సమావేశాలు
- కార్మికులంతా పాల్గొనాలని పిలుపు

ప్రజాశక్తి - యంత్రాంగం



మచిలీపట్నంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

8, 9 తేదీల్లో సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ప్రజల మద్దతు కోరుతూ ఆదివారం పలుచోట్ల ర్యాలీలు, విస్తృత ప్రచారాలు, సమావేశాలు వంటి కార్యక్రమాలు జరిగాయి. తూర్పుగోదావరి జిల్లా కాకినాడలో సిఐటియు ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆంధ్ర ప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ కాకినాడ బ్రాంచ్ కార్యదర్శి బి.సత్య శ్రీనివాస్ ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీ కాకినాడ కలెక్టరేట్ నుంచి జిజిహెచ్, బాలాజీ చెరువు, నూకాలమ్మ గుడి, భానుగుడి, సినిమా రోడ్, మెయిన్ రోడ్, జగన్నాధపురం, దేవాలయం వీధి మీదుగా బాలజీచెరువుకు చేరుకుంది. కాజులూరులో కౌలురైతు సంఘం నాయకులు పలువురు కార్మికులను కలిసి సమ్మె ప్రాధాన్యతను వివరించారు. పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులో సిపిఎం ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్ అధ్యక్షతన అఖిలపక్షం రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి చింతకాయల బాబూరావు మాట్లాడారు. తెలిపారు. ఆకివీడులో దేశవ్యాప్త సమ్మె ప్రచార కార్యక్రమంలో భాగంగా స్థానిక ఆక్వా కార్మికులతో సంస్థ కార్యాలయం వద్ద సమావేశం నిర్వహించారు. యలమంచిలో సిఐటియు మండల కార్యదర్శి దేవ సుధాకర్ పిలుపునిచ్చారు. పెంటపాడు మండల ప్రజాసంఘాల కార్యాలయంలో గోడపత్రికను ఆవిష్కరించారు. చింతలపూడిలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మామిళ్లపల్లి వసంతరావు పిలుపునిచ్చారు. పోడూరులో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. మధురానగర్‌లోని సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, ఏఐటియుసి గౌరవధ్యక్షులు జె రామచంద్రయ్య, ఐఎన్‌టియుసి అధ్యక్షులు ఎల్ రత్నకుమార్, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎం నాగార్జున పాల్గొన్నారు. తిరుపతిలో ఆటోల బంద్‌ను నిర్వహిస్తున్నట్లు సిఐటియు, ఏఐటియుసి, ఐఎన్‌టియుసి సంఘాలు ఉమ్మడిగా నిర్ణయించాయి. విశాఖ సిటీలో ఉక్కు అఖిల పక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యాన పెదగంట్యాడ, కణితి, వడ్లపూడి, లక్ష్మీపురం నిర్వాసిత కాలనీల్లో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు మాట్లాడారు. మధురవాడ, కొమ్మాది ప్రాంతాల్లో జరిగిన ప్రచార జాతాలో సిఐటియు నగర అధ్యక్షులు ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడారు. పెందుర్తి, వేపగుంట, కంచరపాలెం ప్రాంతాల్లో జోరుగా సమ్మె ప్రచారం సాగింది. విశాఖ గ్రామీణ జిల్లాలోని నర్సీపట్నంలో భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యాన, చోడవరం, చీడికాడలో సిఐటియు ఆధ్వర్యాన బైక్ ర్యాలీలు నిర్వహించారు. అనకాపల్లి, అచ్యుతాపురం జీపు జాతా, పాడేరులో ఆటో ప్రచారం చేపట్టారు. దేవరాపల్లిలో పోస్టర్‌ను ఆవిష్కరణ చేశారు. నర్సీపట్నంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు, పాడేరులో జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరరావు పాల్గొన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని సిపిఐ కార్యాలయంలో సిపిఎం, సిపిఐ సమావేశం నిర్వహించారు. సత్తెనపల్లిలో చేయూత ట్రాలీ ఆటో వర్కర్స్ యూనియన్ విస్తృత సమావేశం నిర్వహించారు. రేపల్లె మండలం అడవులపల్లి, కూచిపూడి గ్రామాల్లోని అంగన్వాడి, ఆశ, యానిమేటర్లు, కాంట్రాక్టు ఉద్యోగ సంఘాలతో సమావేశాలు నిర్వహించారు. తాడేపల్లి మండలం గుండిమెడలో ఆటో వర్కర్స్ యూనియన్ విస్తృత సమావేశం నిర్వహించారు. దుగ్గిరాలలో సిపిఎం, సిపిఐ, జనసేన విస్తృత సమావేశాలు నిర్వహించారు. తెనాలి హెడ్ పోస్టాఫీస్‌లో పోస్టల్ పెన్షనర్స్ సమావేశం నిర్వహించారు.

కృష్ణాజిల్లా కోనేరు సెంటర్ నుండి బస్టాండ్ సెంటర్ వరకు మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. హనుమాన్‌జంక్షన్‌లో బైక్ ర్యాలీ నిర్వహించారు. పమిడిముక్కల, మైలవరంలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. శ్రీకాకుళంలో పలు కార్మిక సంఘాల ఆధ్వర్యాన మోటారు సైకిల్ ర్యాలీ జరిగింది. సిఐటియు, ఐఎఫ్‌టియు, ఎఐటియుసి తదితర సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు. రణస్థలం మండలం పైడిభీమవరం జంక్షన్‌లో చేపట్టిన మరో బైక్ ర్యాలీ లేన్ టెక్ ఫార్మా, సరాకా లేబొరేటరీస్, అరబిందో, డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్, ఆంధ్రా ఆర్గానిక్స్, ఏకశిలా కెమికల్స్, శ్యామ్‌పిస్టన్స్, ఎస్.ఆర్ ప్లాస్టర్స్, వికెటి ఫార్మా తదితర పరిశ్రమల మీదుగా సాగింది.



పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

ఎన్నికల్లో ధన ప్రభావం ప్రజాస్వామ్యానికి ముప్పు

ఎపి ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కృష్ణంరాజు

ప్రజాశక్తి - సత్యనారాయణపురం (విజయవాడ)

ఎన్నికల్లో ధన ప్రభావం తగ్గకపోతే దేశ ప్రజా స్వామ్యానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని ఎపి ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వివిఆర్.కృష్ణంరాజు అన్నారు. ఓట్ల కొనుగోలు, ఓటర్లను ప్రలోభపెట్టే చర్యలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్య పరచడానికి బెటర్ ఆంధ్రప్రదేశ్ కన్వీనర్ (బాప్) డిఎస్ఎన్‌వి.ప్రసాదబాబుతో కలిసి ప్రచార పోస్టర్లను విడుదల చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కృష్ణంరాజు మాట్లాడుతూ 2004లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో గెలిచిన వారిలో 30 శాతం మంది కోటీశ్వరులు కాగా వారి సంఖ్య 2014 నాటికి 82 శాతానికి పెరిగిందన్నారు. అసోసియేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్) అంచనా ప్రకారం 2014 లోక్ సభ, అసెంబ్లీ ఎన్నికల్లో ఆయా పార్టీలు అనధికారికంగా సుమారు రూ.35 వేల కోట్లు వ్యయం చేశాయని, 2009 ఎన్నికలతో పోల్చితే ఇది రూ.20 వేల కోట్లు ఎక్కువని కృష్ణంరాజు వివరించారు. వచ్చే ఎన్నికల్లో ఈ అనధికార వ్యయం రూ.50 వేల కోట్లు దాటే అవకాశం ఉందని, దీనిలో ఎక్కువ భాగం ఓట్ల కొనుగోలుకు వెచ్చించబోతున్నారని అన్నారు. రాజకీయాల్లోకి వస్తున్న ధనవంతుల విజయావకాశాలు సాధారణ అభ్యర్థుల కన్నా 20 రెట్లు ఎక్కువగా ఉన్నాయని ఎడిఆర్ తెలియజేసిందని తెలిపారు. ధన ప్రభావం కారణంగా చట్ట సభల్లో మేధావులు, ప్రజాసంఘాల నాయకులు ప్రవేశించలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

రజక వృత్తిదార్లందరికీ పనిముట్లు ఇవ్వాలి

ప్రజాశక్తి - తాడేపల్లి

ఆదరణ-2 పథకం ద్వారా రిజిస్టర్ చేసుకున్న రజకవృత్తి దారులందరికీ పనిముట్లు వెంటనే మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ రజకవృత్తిదారుల సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం రాష్ట్ర అధ్యక్షులు ఎం.భాస్కరరావు అధ్యక్షతన గుంటూరు జిల్లా తాడేపల్లిలోని రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం జరిగింది. వివరాలను సంఘం రాష్ట్ర కార్యదర్శి గురుశేఖర్ మీడియాకు విడుదల చేశారు. ఆదరణ పథకం ద్వారా 1.25 లక్షల మంది రజకులు ఆన్‌లైన్ ద్వారా రిజిస్టర్ చేసుకుంటే ప్రభుత్వం ఇప్పటివరకు 10 వేల మందికైనా వాటిని మంజూరు చేయలేదని, వృత్తిదార్లకు సిఎం చంద్రబాబు అన్యాయం చేస్తున్నారని సమావేశం అభిప్రాయపడింది. ప్రభుత్వ కార్యాలయాల్లో దోబీపోస్టులను భర్తీ చేయాలని, 50 ఏళ్లు నిండిన రజకులకు రూ.2 వేలు పింఛను ఇవ్వాలనే తీర్మానాలను సమావేశం ఆమోదించింది.

ప్రజ్ఞ

జవాబులు

1.ఢిల్లీ
2.చైనా
3.లోక్‌సభ
4.బెంగుళూరు బుల్స్
5. కటక్

నూతన అటవీ విధానాలతో ఆదివాసీలకు ముప్పు

- గిరిజన నిధులు దారి మళ్లింపు
- సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ మిడియం బాబూరావు

ప్రజాశక్తి - కురుపాం (విజయనగరం జిల్లా)



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ మిడియం బాబూరావు

కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం నూతన అటవీ విధానం ద్వారా గిరిజనులను భూముల నుంచి, కొండల నుంచి దూరం చేసి వారికి జీవనోపాధి లేకుండా చేయాలని చూస్తోందని భద్రాచలం మాజీ ఎంపి, గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ మిడియం బాబూరావు అన్నారు. 'ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లకు ముంచుకొస్తున్న ముప్పు-కారణాలు-పరిష్కారాలు'పై విజయనగరం జిల్లా గుమ్మలక్ష్మీపురం మండలం భద్రగిరిలోని ఐటిడిఎ వైటిసి శిక్షణ కేంద్రంలో గిరిజన సంఘం ఆధ్వర్యాన ఆదివారం జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. బోయ, వాల్మీకులను ఎస్‌టిల్లో చేర్చాలంటూ రాజకీయ లబ్ధి కోసం కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం నివేదిక పంపిందన్నారు. వైసిపి కూడా దీనికి మద్దతు ఇచ్చిందని విమర్శించారు. రాష్ట్రంలోనూ, జిల్లాలోనూ నకిలీ గిరిజనులు ఉన్నారన్నారు. వీరివల్ల రాజ్యాంగంలో పొందుపర్చిన హక్కులను అసలైన గిరిజనులు పొందలేకపోతున్నారని తెలిపారు. దీనికి విజయనగరం జిల్లాలోని చినమేరంగి జమీందారులే నిదర్శమన్నారు. ఎస్‌సి, ఎస్‌టిలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, రిజర్వేషన్ల అమలులో పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. గిరిజనుల నిధులను దారి మళ్లిస్తున్నారని తెలిపారు. ప్రయివేటీకరణ వల్ల రిజర్వేషన్లకు ముప్పు వాటిల్లుతోందన్నారు. గిరిజన ప్రాంతాన్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయన్నారు. అడవి బిడ్డలను అడవి తల్లి నుంచి దూరం చేసేందుకు కుట్ర పన్నుతున్నాయని విమర్శించారు. 1/70 చట్టం, పీసా చట్టం నీరుగారుతున్నాయన్నారు. పోలవరం ప్రాజెక్టు వల్ల సుమారు 2.50 లక్షల మంది గిరిజనులు నిర్వాసితులు అవుతున్నారని తెలిపారు. పోరాడి సాధించుకున్న హక్కుల పరిరక్షణకు గిరిజనులంతా ఐక్యంగా ఉద్యమించాలన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం.కష్ణమూర్తి మాట్లాడుతూ టిడిపి, బిజెపి, వైసిపి నకిలీ గిరిజనులకు ఎంపి, ఎమ్మెల్యే టికెట్లు ఇస్తూ, నిజమైన గిరిజనులకు అన్యాయం చేస్తున్నాయని విమర్శించారు. సిపిఎం పోరాడి విశాఖ మన్యంలో బాక్సైట్ తవ్వకాలను అడ్డుకుందని తెలిపారు.

విజయనగరం జిల్లా సాలూరు కొండల్లోని విలువైన ఖనిజాలను దోచుకోవడానికి జరుగుతున్న కుట్రలకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. మాజీ ఎమ్మెల్యే, గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలక లక్ష్మణమూర్తి మాట్లాడుతూ జిసిసిని నిర్వీర్యం చేయడంతో అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర రాక దళారుల చేతిలో గిరిజనులు దగా పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు రమణ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో సిపిఎం జిల్లా (పార్వతీపురం) కార్యదర్శి రెడ్డి శ్రీరామ్మూర్తి, జిల్లా ఆదివాసీ వికాస్ పరిషత్తు, యుటిఎఫ్, ఏజెన్సీ యువజన సంఘం, ఎస్ఎఫ్ఐ, పిఆర్‌టియు నాయకులు పాల్గొన్నారు.



దీక్షలకు మద్దతు తెలుపుతున్న వి.కృష్ణయ్య

ప్రభుత్వ హామీతో రైతుల దీక్ష విరమణ

మద్దతిచ్చిన సిపిఎం నేత వి.కృష్ణయ్య

ప్రజాశక్తి - పెదనందిపాడు (గుంటూరు జిల్లా)

సాగు, తాగు అవసరాలు తీర్చే గుంటూరు ఛానల్ పొడిగింపు కోసం గుంటూరు జిల్లా పెదనందిపాడులో నల్లమడ రైతు సంఘం ఆధ్వర్యంలో కొద్దిరోజులుగా నిర్వహిస్తున్న దీక్షలు ఆదివారం ముగిశాయి. రాష్ట్ర జలవనరుల శాఖమంత్రి ఆదేశాల మేరకు ప్రభుత్వ ప్రతినిధిగా శాప్ చైర్మన్ పి.అంకమ్మచౌదరి దీక్షా శిబిరాన్ని సందర్శించారు. ఫైలు ఆర్థిక శాఖ వద్ద ఉందని, సంక్రాంతిలోపే ఆమోదిస్తారని హామీనిచ్చారు. ఈ హామీ అమలు కాకుంటే సంక్రాంతి అనంతరం మళ్లీ దీక్షలు చేస్తామని, ఉద్యమం మరింత ఉధృతమవుతుందని నల్లమడ రైతు సంఘం నాయకులు కొల్లా రాజమోహన్ స్పష్టం చేశారు. అనంతరం దీక్షాపరులకు అంకమ్మ చౌదరి నిమ్మరసం ఇచ్చారు.

తాడోపేడో తేలేదాక పోరాటానికి మద్దతు : సిపిఎం

గుంటూరు ఛానల్ పొడిగింపు విషయంలో ప్రభుత్వంతో తాడోపేడో తేలేదాక నడిచే పోరాటానికి సిపిఎం పూర్తి మద్దతు ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.కృష్ణయ్య ప్రకటించారు. ఐదోరోజు దీక్షా శిబిరాన్ని సందర్శించిన ఆయన మాట్లాడుతూ రైతులు, రైతు సంఘాలు ఐక్యంగా పోరాడితే ఏదైనా సాధించొచ్చని చెప్పారు. పెన్నా, గోదావరి నదుల అనుసంధానం పేరుతో రూ.650 కోట్లు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగించడానికి రూ.290 కోట్లు ఖర్చు చేయలేదా? అని ప్రశ్నించారు. పొడిగింపు వల్ల 50 గ్రామల ప్రజలకు తాగునీరు, 50 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని పేర్కొన్నారు.

జన్మభూమిలో ప్రశ్నల పరంపర

- విశాఖలో గంటా కాన్వాయ్ అడ్డగింత
- కర్నూలు, చిత్తూరు సహా పలు జిల్లాల్లో అధికారులను అడ్డుకున్న ప్రజలు
- జన్మభూమిలోనూ ముందస్తు అరెస్టులే



గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం కుంచనపల్లి సభలో జెడ్‌పిటిసి, ప్రజల మధ్య వాగ్వాదం

ప్రజాశక్తి యంత్రాంగం

రాష్ట్రంలో జన్మభూమి సభలు ఆదివారం కూడా కొనసాగాయి. అన్నిజిల్లాల్లోనూ తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. తిత్లీ తుపానుతో నష్టపోయిన పంటలకు నేటికీ పరిహారం ఇవ్వకపోవడంపై శ్రీకాకుళం జిల్లా హిరమండలం మండలంలోని కల్లట జన్మభూమి సభలో అధికారులను స్థానికులు నిలదీశారు. డ్వాక్రా సంఘాలకు చెందిన పసుపు-కుంకమ పథకం డబ్బులు బ్యాంకు ఖాతాల్లో జమకాకపోవడంపై తుంగతంపర సభలో మహిళలు ప్రశ్నించారు. విజయనగరం జిల్లా జియ్యమ్మవలస మండలం కెపిడి వలస, పెదమేరంగి గ్రామాల్లో తాగునీటి సమస్యపై జన్మభూమిలో అధికారులను స్థానికులు నిలదీశారు. గత జన్మభూమిలో ఇచ్చిన వినతులను నేటికీ పరిష్కరించక పోవడాన్ని నిరసిస్తూ గుమ్మలక్ష్మీపురం మండలం చాపరాయిబిన్నిడిలో గ్రామసభను సిపిఎం, గిరిజన సంఘం ఆధ్వర్యాన గిరిజనులు అడ్డుకున్నారు. విశాఖ జివిఎంసి 4వ వార్డులో నిర్వహించిన జన్మభూమి సభకు మంత్రి గంటా హాజరయ్యారు. సభ అనంతరం మంత్రి వెళ్లి పోతుండగా స్థానిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వైసిపి కార్యకర్తలు ఆయన కాన్వాయిని అడ్డగించారు. దీంతో వారిపై పోలీసులు లాఠీఛార్జి చేశారు. 10 మందిని అరెస్టుచేశారు. వీరిలో కొంత మందికి గాయాలయ్యాయి. గూండాల రాజ్యాం కొనసాగుతోందని, పోలీసుల దౌర్జన్యం నశించాలని నినాదాలు చేశారు. సమస్యలు తీర్చకుండా గ్రామంలోకి అధికారులను అడుగు పెట్టనివ్వబోమని కర్నూలు జిల్లా ఆస్పరి మండలం జోహరాపురం గ్రామస్తులు అధికారులను అడ్డుకున్నారు. జోహరాపురంలో సభను బహిష్కరించారు. అధికారులు గ్రామంలోకి వస్తుండగా, గ్రామ పొలిమేరలోనే అడ్డుకున్నారు. 'సమస్యలు తీర్చని జన్మభూమి మాకొద్ద'ంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. చిత్తూరు జిల్లా కెవిబి పురం మండలం పెరిందేశంలో అధికారులు, అధికార పార్టీ నాయకుల వాహనాలను గ్రామంలోకి రాకుండా స్థానికులు అడ్డుకున్నారు. వాహనాల ముందు పడుకొని గ్రామంలో సభ జరపడానికి వీల్లేదని,అతిపెద్ద పంచాయతీ తమ గ్రామంలో టిడిపి అధికారంలోకి వచ్చి ఐదేళ్లయినా.. ఇంత వరకు ఒక చిన్న పనీ చేసిన పాపానపోలేదని, అటువంటి వారు జన్మభూమి జరపడానికి అర్హులు కారని వాహనాలను అడ్డుకున్నామన్నారు. కలత్తూరు పంచాయతీలో కూడా రచ్చరచ్చగా సాగింది.

గుంటూరు జిల్లా మంగళగిరి మండలం నవులూరులో సభ తోపులాటల మధ్య రసాబాసగా మారింది. అధికార పార్టీకి చెందిన రౌడీషీటర్‌ను వేదికపై కూర్చోబెట్టడమూ వివాదాస్పదమైంది. రాజధానిలో నిర్మిస్తున్న జిప్లస్3 ఇళ్ల లాటరీ సరిగ్గా లేదని, ఏ గ్రామంలో వారికి ఆ గ్రామంలోనే ఇళ్ళు కేటాయించాలని సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి డిమాండ్ చేశారు. తాగునీరు, రేషన్‌కార్డులు, పింఛన్లు, ఇతర సమస్యలపై పెట్టిన అర్జీలను బుట్టదాఖలు చేస్తున్నారని మండిపడ్డారు. తాడేపల్లి మండలంలోని కుంచనపల్లిలో పలు సమస్యలపై సిపిఎం నాయకులతోపాటు స్థానిక ప్రజలూ అధికారులను ప్రశ్నించారు. ఇళ్ల స్థలాల్లేవని తహశీల్దార్ చెప్పగా సిపిఎం తాడేపల్లి రూరల్ కార్యదర్శి డి.వెంకటరెడ్డి కలుగజేసుకున్నారు. పేదలందరికీ ఇళ్లు, మూడు సెంట్ల స్థలం తదితర ప్రభుత్వ వాగ్దానాలను గుర్తు చేశారు. మంగళగిరిలో పారిశుధ్య సమస్యలపై అధికార్లను నిలదీశారు. కృష్ణాజిల్లా చల్లపల్లి మండలం పురిటిగడ్డలో పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయలేదని రైతులు అధికారులను నిలదీశారు. మొవ్వ మండలం కూచిపూడిలో నివేశనాస్థలాలు ఇవ్వాలని ఎమ్మెల్యే ఉప్పులేటి కల్పనను మహిళలు నిలదీశారు. అవనిగడ్డ మండలం మోదుమూడిలో రహదారి వేయాలని అధికారులను గ్రామస్తులు నిలదీశారు. జగ్గయ్యపేట రూరల్ మండలం షేర్‌మహ్మద్ పేటలో స్థానిక సమస్యలపై గ్రామస్తులు అధికారులను నిలదీశారు.

సిపిఎం నేతల ముందస్తు అరెస్టు

కృష్ణాజిల్లా కంకిపాడులో అగ్నిమాపక కేంద్రం, ఉయ్యూరులో ఆటోనగర్ ఏర్పాటు, ఇళ్ల స్థలాల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పునాదిపాడులో జరుగుతున్న జన్మభూమి సభలో వినతిపత్రం ఇచ్చేందుకు వెళుతున్న 8 మంది సిపిఎం నాయకులను కంకిపాడు బస్టాండ్ వద్ద పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల జులుం నశించాలని నినాదాలు చేస్తున్న వారిని కర్కశంగా, రాక్షసత్వంగా అరెస్ట్ చేశారు. అనంతరం పెనమలూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో సిపిఎం ఉయ్యూరు, కంకిపాడు మండల కార్యదర్శులు శివనాగేంద్రం, పంచకర్ల రంగారావు, నాయకులు కొండా రాజేష్, కోటేశ్వరరావు, శివ తదితరులు ఉన్నారు. ముఖ్యమంత్రి సభ ముగించుకొని వెళ్లిన తర్వాత వారిని విడుదల చేశారు.

మైనారిటీల రచనలకు ప్రోత్సాహం కరువు

ముస్లిం కథకుడు షేక్ హుస్సేన్ సత్యాగ్ని

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

మైనారిటీల రచనలకు ప్రోత్సాహం కరువైందని, ఇదే అభిప్రాయం ఆ రచయితల్లో ఉందని తొలి తెలుగు ముస్లిం కథకుడు షేక్ హుస్సేన్ సత్యాగ్ని అన్నారు. విజయవాడ స్వరాజ్యమైదాన్‌లో విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో జరుగుతున్న 30వ పుస్తక మహోత్సవ్‌లో ఆదివారం సాయంత్రం 'తెలుగునాట వర్తమాన ముస్లిం కథ - అస్థిత్వ వికాసం' అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సదస్సులో ముందుగా హుస్సేన్ సత్యాగ్నిని ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగునాట ముస్లిం కథలు, కవిత్వాలు చాలా ఉన్నాయని, వాటి గురించి నేటితరం వారికి తెలియచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కవి మహ్మద్ ఖదీర్‌బాబు మాట్లాడుతూ తెలుగులో ముస్లిం కథలకు అంతగా ప్రాచుర్యం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కొద్ది మంది రచయితలు కథలను రాస్తున్నారని, వాటికైనా ప్రాచుర్యం కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కవులు వేంపల్లె షరీఫ్, సిద్ధి షాజిదా ప్రసంగించారు. అనంతరం ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ బి.వి. పట్టాభిరామ్ పుస్తకావిష్కరణ జరిగింది. పట్టాభిరామ్ రచించిన 'పట్టాభి రామబాణం' పుస్తకాన్ని విశ్రాంత ఐఎఎస్ అధికారి ప్రభాకరరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదిహేనేళ్లుగా విజయవాడ పుస్తక మహోత్సవ్‌లో పట్టాభిరామ్ పుస్తకాలను ఆవిష్కరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పద్మభూషన్ ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర ఇండ్ల రామసుబ్బారెడ్డి, ఎమెస్కో బుక్ సెంటర్ అధినేత విజయకుమార్, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు ఎం.ఎ.గపూర్

రూ.100 కోట్లతో రెండు పంటలకూ నీళ్లు

సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గపూర్

ప్రజాశక్తి - ఆత్మకూరు

రూ.100 కోట్లు ఖర్చు చేస్తే కెసి కెనాల్ నీటిని నిల్వ ఉంచి జిల్లాలో రెండు పంటలకు అందించవచ్చన్లి సిపిఎం కేంద్ర కమిటీసభ్యులు ఎంఎ గఫూర్ తెలిపారు. కెసి కెనాల్‌కు 20 టిఎంసిలు నిల్వ ఉంచి నిరంతరం ఇచ్చేందుకు అవకాశమున్నా ప్రభుత్వం స్పందించడంలేదన్నారు. ఆదివారం కర్నూలు జిల్లా ఆత్మకూరులో శ్రీశైలం నియోజకవర్గ సిపిఎం కార్యకర్తల సమావేశం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు వి.ఏసురత్నం అధ్యక్షత నిర్వహించారు. గఫూర్ మాట్లాడుతూ ఎవరు అధికారంలోకొచ్చినా ప్రజా సమస్యలను పరిష్కరించడం లేదన్నారు. కర్నూలు జిల్లా చుట్టూ కృష్ణా, తుంగభద్ర జలాలున్నా ప్రజలకు తాగునీరు, రైతులకు సాగునీరు ఇవ్వలేని స్థితిలో ఈ ప్రభుత్వం ఉందని విమర్శించారు. నేడు రాయలసీమ ప్రజలు ఇతర రాష్ట్రాలకు వలసలు వెళ్తున్నారని, వలసల నివారణలో ప్రభుత్వం విఫలమయిందని పేర్కొన్నారు. సిపిఎం, జనసేన, సిపిఐ వచ్చే ఎన్నికల్లో ఉమ్మడిగా పోటీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రజా, రైతు, కూలీలు, కార్మికులు, కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించి, రాష్ట్రాభివృద్ధికి ప్రత్యామ్నాయ విధానాలను ప్రజల ముందు ఉంచబోతున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రత్యామ్నాయ రాజకీయ శక్తి కోసం కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తున్న సిపిఎం, సిపిఐ, జనసేన పార్టీలను రాబోయే ఎన్నికల్లో ప్రజలు ఆదరించాలని కోరారు. ప్రజలు ఆలోచించే విధంగా సిపిఎం కార్యకర్తలు ఈ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. బిజెపి, దాని మిత్రపక్షాలను ఓడించడమే సిపిఎం కార్యకర్తల బాధ్యత అని తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు ఎ.రాజశేఖర్, ఆయా మండలాల కార్యదర్శులు ఎన్.స్వాములు, నరసింహ నాయక్, మారెన్న, యాదాటి నాగేంద్రుడు తదితరులు మాట్లాడారు.

రాజధానిని వణికిస్తున్న చలి

న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీలో ఆదివారం కురిసిన వర్షానికి నగరంలో ఉష్ణోగ్రత 7 డిగ్రీలకు పడిపోయి చలి తీవ్రత ఎక్కువైంది. దీనికి తోడు మంచుతో ప్రయాణ మార్గాలు అన్నీ కప్పుకుపోవడంతో రాజధానిలో దాదాపు 320 రైళ్లను పూర్తిగా రద్దు చేయగా, 129 సర్వీసులను పాక్షికంగా నిలిపేశారు. విమాన సర్వీసులకు ఎటువంటి అంతరాయం కలుగలేదు. వర్షం కారణంగా వాతావరణ కాలుష్య శాతం కొంతమేర తగ్గినప్పటికీ గాలి నాణ్యతలో ఎటువంటి మార్పు రాలేదని అధికారిక వర్గాలు వెల్లడించాయి.

సన్నాహం



కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ కార్మిక, కర్షక సంఘాల పిలుపు మేరకు ఈనెల 8,9 తేదీల్లో జరగనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ పశ్చిమబెంగాల్‌లోని 24 పరగణాల జిల్లాలో ప్రచారం నిర్వహిస్తున్న వామపక్షాల కార్యకర్తలు.

విధ్వంసక చర్యలను ఉపేక్షించం

సంఘ్ పరివార్‌కు కేరళ సిఎం విజయన్ వార్నింగ్



తిరువనంతపురం : కేరళలో మతసామరస్యానికి భంగం కల్గించేలా, మతోన్మాదాన్ని రెచ్చగొట్టేలా ఎవరు ప్రయత్నించినా సహించేదిలేదని కేరళ సిఎం విజయన్ హెచ్చరించారు. మతం పేరుతో ప్రజల మధ్య విబేధాలు సృష్టించి అశాంతిని నెలకొల్పాలనే సంఘ్ పరివార్ కుయుక్తులను కేరళలో సాగనివ్వ బోమని చెప్పారు. ఆదివారం నాడు ఆయన ఫేస్‌బుక్‌లో ఈ విధమైన వ్యాఖ్యలు చేశారు. కేరళలోని వామపక్ష ప్రజాతంత్ర ప్రభుత్వం ఎటువంటి బెదిరింపులకు లొంగదని స్పష్టం చేశారు. మత విశ్వాసాల విషయంలో పురుషులకు, మహిళలకు సమాన హక్కులు ఉంటాయన్న సుప్రీం కోర్టు తీర్పునే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని చెప్పారు. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ శక్తులు చట్టవిరుద్ధంగా సుప్రీంకోర్ట్ ఇచ్చిన తీర్పుకు వ్యతిరేకంగా పని చేస్తున్నాయని అన్నారు. కేరళ పోలీసులకు ఎటువంటి రాజకీయ పార్టీలతో సంబంధం లేదని, తప్పు చేసినవారు ఏ పార్టీవారైనా సరే వారిపై చర్యలు తీసుకుంటారని అన్నారు.

బిజెపి కక్షపూరిత చర్యలకు దిగుతోంది

యుపి మాజీ సిఎం అఖిలేశ్



లక్నో : బిజెపి తనపై కక్షపూరిత చర్యలకు పాల్పడుతుందని ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేశ్‌యాదవ్ మండిపడ్డారు. అక్రమ మైనింగ్ కేసుకు సంబంధించి తనను సిబిఐ విచారించబోతుందన్న వార్తలపై ఆయన స్పందించారు. ఆదివారం జరిగిన పార్టీ సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడారు. ఎన్నికల దగ్గరపడుతున్న తరుణంలో బిజెపి తన నిజస్వరూపం బయటపెట్టుకొంటూ కక్షపూరిత చర్యలకు ప్పాలడు తుందన్నారు. సిబిఐని అడ్డుపెట్టుకొని తమను ఆపాలనుకుంటున్న బిజెపికి ప్రజల మద్దతుతో రాష్ట్రంలోని అన్ని లోకసభ స్థానాలకు గెలుచు కొని సమాధానమిస్తామని ఆయన అన్నారు. తదుపరి పరిణామాలను ఎదుర్కొనేందుకు బిజెపి సిద్ధంగా ఉండాలని ఆయన హెచ్చరించారు. దీనిపై రాష్ట్ర బిజెపి మంత్రి సిద్దార్థనాథ్ స్పందిస్తూ అఖిలేశ్ తప్పు చేయకుంటే కంగారు పడాల్సిన అవసరం లేదని ఎద్దేవా చేశారు. ఈ కేసుకు సంబంధించి విచారణకు 2016లోనే అలహాబాద్ హైకోర్టు సిబిఐకి అప్పగించిందన్నారు. అఖిలేశ్ 2012-13 మధ్యలో మైనింగ్ శాఖ బాధ్యతలు కూడా నిర్వహించారు. ఆ సమయంలో నమోదైన కేసుకు సంబంధించి సిబిఐ శనివారం 14 ప్రాంతాల్లో సోదాలు నిర్వహి ఒచింది. దీనికి సంబంధించి ఇటీవల జనవరి 2వ తేదీన మూడో ఎఫ్ఐ ఆర్ కూడా నమోదు చేసింది.

బిజెపిని ఓడించేందుకు ఎస్‌పి, బిఎస్‌పి చాలు

రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తర ప్రదేశ్‌లో బిజెపిని ఓడించేందుకు సమాజ్‌వాది పార్టీ (ఎస్‌పి), బిఎస్‌పిల కలయిక సరిపోతుందని సమాజ్‌వాది పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు కిరణ్మయ్ నంద అన్నారు. బిజెపిని ఓడించేందుకు అంతగా ప్రాధాన్యత లేని కాంగ్రెస్ అవసరం లేదని ఆయన అన్నారు. యుపిఎ ఛైర్‌పర్సన్ సోనియాగాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ప్రాతినిధ్యం వహిస్తున్న రాయబరేలి, అమేథీ నియోజకవర్గాలను ఎస్‌పి-బిఎస్‌పి కూటమి పక్కన పెట్టిందని ఆయన చెప్పారు. "ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్ అంతగా ప్రాధన్యత కలిగి లేదు. అందువల్ల దానిని కూటమిలో చేర్చుకోవాలా, వద్దా అనే విషయమై ఆలోచించడం లేదు." అని ఆయన అన్నారు.

బిజెపిని ఓడించేందుకు ఎస్‌పి-బిఎస్‌పి కూటమి ప్రధాన భూమికను పోషిస్తుందన్నారు. కాంగ్రెస్ ఒకటి, రెండు స్థానాల్లో పోటీచేసే అవకాశ ముందన్నారు. రాష్ట్రంలో ఏ స్థానంలో ఉండాలని కోరుకుంటుందో కాంగ్రెస్సే నిర్ణయించుకోవలసి ఉందని నందా అన్నారు. బహుజన సమాజ్ పార్టీ (బిఎస్‌పి) అధినేత్రి మాయావతి, ఎస్‌పి నేత అఖిలేష్ యాదవ్ సీట్ల పంపిణీని ఖరారు చేసేందుకు సిద్ధమైన రెండు రోజుల తరువాత నందా పై వ్యాఖ్యలు చేశారు. నేతలిద్దరూ కూడా శుక్రవారం భేటీ అయిన సంగతి తెలిసిందే.

యుపిలో పంటలను ధ్వంసం చేస్తున్న పశువులు

- ఆర్థిక భారంతో కుదేలవుతున్న రైతులు

లక్నో : గోవధ నిషేధం పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పశువుల విక్రయాలను నిషేధించటంతో యుపిలో పశువిక్రయాలు పూర్తిగా నిలిచిపోయాయి. దీనితో కట్టుతప్పిన ఆవులు తమ పంటపొలాలపై పడి విధ్వంసం సృష్టిస్తున్నాయని రైతన్నలు ఫిర్యాదు చేస్తున్నారు. ఈ పశువులను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్న రైతులు వాటిని ఎదుర్కోలేక తీవ్ర గాయాల పాలవుతున్నారు. వట్టిపోయిన పాడిపశువులను వాటిపెంపకందారులు అమ్ముకోలేక, కబేళాలకు తరలించలేక వీధుల్లోకి వదిలివేస్తుండటంతో అవి కన్పించిన పంటపొలాలపై పడి విధ్వంసం సృష్టిస్తున్నాయి. కొన్ని సందర్భాలలో ఈ పశువులు పంటలను పూర్తిగా ధ్వంసం చేస్తుండటతో తమకు తిండి గింజలు కూడా లేకుండా పోతున్నాయని రైతన్నలు గగ్గోలు పెడుతున్నారు. కట్టుతప్పుతున్న ఈ పశువుల బెడద నుండి తమను కాపాడాలని రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఈ పశువుల బెడదకు రాష్ట్రంలోని యోగి ఆదిత్యనాథ్ సర్కారే కారణమని వారు మండిపడుతున్నారు. ఈ బెడద నుండి తమను కాపాడేందుకు ఏర్పాట్లు చేయాలని, లేకుంటే తాము 2019 ఎన్నికల్లో బిజెపికి ఓట్లు వేయబోమని రైతులు ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేశారు. 2017 మార్చిలో యోగి ఆదిత్యనాథ్ అధికారంలోకి వచ్చిన తరువాత పశువుల విక్రయాలపై నిషేధం విధించిన విషయం తెలిసిందే. ఈ నిషేధంతో పాటు గోగూండాల దాడుల బెడద కూడా



పెరిగిపోవటంతో రాష్ట్రంలోని రైతులందరూ తమ వద్ద వున్న వట్టిపోయిన పశువులను, కాలం చెల్లిన ఎడ్లను ఏం చెయ్యాలో తెలియక బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. ఈ పరిస్థితిపై గత వారం ఫిరోజాబాద్, ఆలీగఢ్‌లలో గ్రామీణులు ఆగ్రహం వ్యక్త ంచేస్తూ తమ వద్ద వున్న ఈ పశువులను ప్రభుత్వ స్కూళ్లలో కట్టివేశారు. ఏ సమయంలో ఎప్పుడు, ఎలా వచ్చిపడతాయో తెలియని ఈ పశువుల నుండి తమ పంటపొలాలను కాపాడుకునేందుకు రైతులు స్త్రీ, పురుషులు కర్రలు చేబూని రాత్రింబవళ్లు కాపలా కాస్తున్నారు. ప్రభుత్వ నిషేధాజ్ఞలు, గోగూండాల దాడులతో గోహత్యలు నిలిచిపోవటం సంతోషకరమే అయినప్పటికీ మార్కెట్‌లో విక్రయాల పరిస్థితి ఏమిటని రైతులు నిలదీస్తున్నారు. పశువులు వచ్చి తమ పంటపొలాలను ధ్వంసం చేస్తున్నాయని, పోలీసులు, గోగూండాలు, మత విశ్వాసాల వంటి అంశాలతో వాటిపై బలప్రయోగం చేయటానికి తాము వెనుకాడుతున్నామని రైతులు చెబుతున్నారు. వట్టిపోయిన, కాలం చెల్లిన పశువులను ముఖ్యమంత్రి యోగికి అప్పగిస్తామని, వాటి బాధ్యత ఆయనే చూసుకోవాలని రైతులు స్పష్టం చేస్తున్నారు.

నష్టనివారణ చర్యలు

వట్టిపోయిన, కాలం చెల్లిన పశువుల విషయంలో రైతులు, గ్రామీణుల నుండి వ్యక్తమవుతున్న ఆగ్రహంతో యోగి సర్కారు అప్రమత్తమైంది. పశువులను ఈ నెల 10 నాటికి గో సంరక్షణ కేంద్రాలకు తరలించాలని జిల్లా మేజిస్ట్రేట్‌లను ప్రభుత్వం ఆదేశించింది. పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో ఏర్పాటు చేసే తాత్కాలిక గోరక్షణ కేంద్రాలకు అవసరమైన నిధుల కోసం అదనపు సెస్సులను విధించాలని ఇటీవల జరిగిన భేటీలో కేబినెట్ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. వట్టిపోయిన, కాలం చెల్లిన తమ పశువులను వదిలివేసే వారిని గుర్తించి ప్రభుత్వ భవనాల్లో నిర్బంధిం చాలని, వారిపై సంఘ వ్యతిరేక శక్తులుగా ముద్ర వేయాలని కూడా సిఎం ఆదిత్యనాథ్ అధికారులను ఆదేశించారు.

పశువధకు నో!

రాష్ట్రంలో కట్టుతప్పిన పశువుల బెడద పెరిగిపోవటంపై రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి ఎస్‌సి సింగ్ బాగెల్ స్పందిస్తూ రాష్ట్రంలో కోడెదూడల పెంపకం నిష్ప్రయోజనం, నిరుపయోగంగా మారిందన్నారు. అయితే ఈ కారణంతో పశువధను తాము ఎట్టిపరిస్థితుల్లోనూ అనుమతించబోమని ఆయన స్పష్టం చేశారు. పెరుగుతున్న వ్యవసాయ యంత్రీకరణతో పంటల నూర్పిడి, రవాణా వంటి ప్రక్రియల్లో సైతం ఎడ్ల వినియోగం కొరవడిందని ఆయన చెప్పారు. కోడెదూడల ఉత్పత్తి పెరుగుదలను నిరోధించటానికి పశువుల్లో కుటుంబ నియంత్రణ పద్ధతులను అనుసరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఆయన చెప్పారు.

కేరళ ప్రశాంతం

తిరువనంతపురం : కేరళలోని శబరిమల ఆలయాన్ని ఇద్దరు మహిళలు సందర్శించడంపై హిందూత్వ మూకలు పాల్పడ్డ విధ్వంసం తర్వాత ఆదివారం రాష్ట్రంలో ప్రశాతంత నెలకొందని అధికారులు తెలిపారు. విధ్వంస కార్యకలా పాలను రెచ్చగొట్టే మూకలను అదుపు చేసేందుకు పోలీసులను భారీగా మోహరిం చారు. జిల్లా కలెక్టర్ సమక్షంలో జరిగిన శాంతి ఒప్పందాన్ని ఉల్లంఘించిన బిజెపి కన్నూర్‌లోని సిపిఎం కార్యకర్తల ఇళ్లపై దాడులు చేసింది. ఇప్పటి వరకు పోలీసులు 5,397 మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరిలో బిజెపి, ఆరెస్సెస్ కార్యకర్తలు భారీ సంఖ్యలో ఉన్నారు. 731 మందిని కోర్టులో హాజరుప రచగా, వారిని జ్యుడిషియల్ కస్టడీకి తరలించారు. వీరిపై పోలీసు అధికారులపై దాడి, ప్రజల ఆస్తులు విధ్వంస, చట్టవిరుద్ధంగా పేలుడు పదార్థాల వినియోగం, అల్లర్లకు పాల్పడం కింద చార్జీషీటు దాఖలు చేశారు. వివిధ ఆరోపణలపై అరెస్టు అయిన వారికి బెయిల్‌ను నిరాకరించారు. శబరిమల ఘర్షణలకు సంబంధించి ఇప్పటివరకు మొత్తం 1,771 కేసులు నమోదు చేశారు.

రైల్వే స్టేషన్‌కు 20 నిమిషాల ముందుగానే చేరుకోవాలి

న్యూఢిల్లీ : భద్రతా ప్రమాణాల దృష్ట్యా ఎయిర్‌పోర్టు అధికారులు పాటించే కొన్ని నిబంధనలను ప్రవేశపెట్టేందుకు రైల్వేశాఖ సమాయత్తమవుతోంది. ప్రయాణీకులు తాము వెళ్లాలనుకున్న రైలు బయలుదేరే సమయానికి 20 నిమిషాల ముందు గానే స్టేషన్‌కు చేరుకోవాలని రైల్వే భద్రతాదళం డైరెక్టర్ జనరల్ అరుణ్‌కుమార్ ఆదివారం తెలిపారు. ఆ సమయంలో సామాను తనిఖీలు పూర్తి చేసుకోవచ్చన్నారు. ఈ విధానాన్ని ఇప్పటికే అలహాబాద్, హుబ్లీ స్టేషన్‌లలో ప్రవేశపెట్టినట్లు తెలిపారు. మరో 202 స్టేషన్‌లలో ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టనున్నారు. 2016లో పార్లమెంట్ ఆమోదించిన ఏకీకృత భద్రతా వ్యవస్థ (ఐఎస్‌ఎస్)లో భాగంగా ఈ విధానాన్ని ప్రవేశపెడుతున్నట్లు ఆయన తెలిపారు. ఇందుకుగానూ ప్రభుత్వం రూ.385.06 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఈ సిస్టమ్‌లో సిసి కెమెరాలు, ముఖాన్ని గుర్తించే పరికరాలు, తదితరాలు ఉంటాయన్నారు. ఎవరైనా నేరస్తులు స్టేషన్ పరిసరాల్లోకి వస్తే వెంటనే గుర్తించే అవకాశం ఇందులో ఉందన్నారు.

పౌరసత్వ బిల్లును వ్యతిరేకిస్తాం

శివసేన నేత సంజయ్ రౌత్



న్యూఢిల్లీ : పార్లమెంట్‌లో పౌరసత్వ చట్ట సవరణ బిల్లు-2016ను వ్యతిరేకిస్తామని శివసేన ఆదివారం తెలిపింది. ఈ బిల్లును వ్యతిరేకించాలని అస్సాం గణ పరిషత్ చేసిన విజ్ఞప్తి మేరకు శివసేన ఈ నిర్ణయం తీసుకొందని పార్టీనేత సంజయ్ రౌత్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిపాదిత పౌరసత్వ చట్ట బిల్లును కుల, మత విశ్వాసాలకు అతీతంగా అస్సాం ప్రజలందరూ వ్యతిరేకిస్తున్నారని ఆయన చెప్పారు.

ఆఫ్ఘనిస్థాన్, బంగ్లాదేశ్, పాకిస్థాన్‌ల నుండి అక్రమంగా వలస వచ్చిన వారికి మత ప్రాతిపదికన పౌరసత్వం కల్పించేందుకు ప్రభుత్వం చట్టానికి సవరణలు తీసుకురావాలనుకుంటున్నది. ప్రతిపాదిత బిల్లును ఉమ్మడి పార్లమెంటరీ కమిటీ పరిశీలించడంతో సోమవారం పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టనున్నది. అస్సాం ప్రజల సాంస్కృతి, సామాజిక, భాష, వారసత్వ గుర్తింపును రక్షించుకునేందుకు దోహదం చేసే అస్సాం ఒప్పందంలోని అంశాలను ప్రతిపాదిత చట్టం నీరుగారుస్తుందని శివసేన పేర్కొంది. ఒకవేళ ఈ బిల్లు ఆమోదం పొందితే సుప్రీంకోర్టు పర్యవేక్షణలోని జాతీయ పౌరసత్వ నమోదు ప్రక్రియకు అర్థం ఉండదని ఆయన అన్నారు. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తుండటంతో బిజెపి పట్ల శివసేన మరింత దురుసుగా వ్యవహరిస్తున్నది. గత నాలుగేళ్ళుగా బిజెపి-శివసేనల మధ్య సంబంధాలు అంతంత మాత్రంగానే కొనసాగుతున్న విషయం తెలిసిందే.

భారత్ చేరుకున్న ఫ్రెంచ్ నౌకాదళాధిపతి

న్యూఢిల్లీ : ఫ్రాన్స్ నౌకాదళాధిపతి అడ్మిరల్ క్రిస్టోఫ్ ప్రాజుక్ భారత్‌లో మూడు రోజుల అధికార పర్యటన నిమిత్తం ఆదివారం ఇక్కడికి చేరుకున్నారు. ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక, నౌకాదళ సంబంధాలను పటిష్టం చేసుకునే లక్ష్యంతో ఆయన ఈ పర్యటనకు వచ్చారని భారత నౌకాదళ ప్రతినిధి కెప్టెన్ డికె శర్మ చెప్పారు. అడ్మిరల్ ప్రాజుక్ సోమవారం నాడు భారత నౌకాదళాధిపతి సునీల్ లంబాతో భేటీ అయి ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సహకారాన్ని విస్తరించుకోవటానికి సంబంధించి చర్చలు జరుపుతారని ఆయన చెప్పారు. ఆపరేషనల్ రంగంతో సహా వివిధ రంగాలలో ఇరుదేశాల నౌకాదళాల మధ్య సహకారానికి ఉన్న అవకాశాలపై వీరు చర్చిస్తారన్నారు.

ముగ్గురు యుపి మంత్రుల వ్యక్తిగత కార్యదర్శుల అరెస్టు

లక్నో : లంచం, అవినీతి అభియోగాలపై ఉత్తరప్రదేశ్‌లోని ముగ్గురు మంత్రుల వ్యక్తిగత కార్యదర్శులను ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అరెస్టు చేసింది విధానసభ ప్రాంగణంలో లంచాలు డిమాండ్ చేస్తున్న వారిని స్థానిక టివి ఛానల్ తన స్టింగ్ ఆపరేషన్‌లో భాగంగా బుధవారం పట్టుకుని, తన ఛానల్‌లో ప్రసారం చేసింది. ఛానల్‌లో ప్రసారమైన విషయాలపై తక్షణమే దర్యాప్తు చేసేందుకు అడిషనల్ డైరెక్టర్ జనరల్ (లక్నో జోన్) రాజీవ్ కృష్ణన్ నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని యోగి ప్రభుత్వం నియమించింది. కాగా అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ముగ్గురు కార్యదర్శులను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. అరెస్టయిన వీరు ముగ్గురు కూడా మైనింగ్, ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ మంత్రి ఆచార్య పాండే, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి ఓం ప్రకాష్ రాజ్‌భర్, విద్యా శాఖ మంత్రి సందీప్ సింగ్‌ల వద్ద కార్యదర్శులుగా పనిచేస్తున్నారు.

డ్రైవింగ్ లైసెన్స్‌కు ఆధార్ అనుసంధానం

కేంద్ర మంత్రి రవిశంకర్ వెల్లడి



ఫగ్వార : డ్రైవింగ్ లైసెన్స్‌తో ఆధార్‌ను అనుసంధానం చేయడాన్ని ప్రభుత్వం త్వరలోనే తప్పనిసరి చేయనున్నదని కేంద్ర న్యాయ, ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ తెలిపారు. ఇక్కడి లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీలో జరుగుతున్న 106వ ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌లోప్రసంగిస్తూ ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. డ్రైవింగ్ లైసెన్స్‌తో ఆధార్‌ను అనుసంధానించడాన్ని తప్పనిసరి చేస్తూ త్వరలోనే చట్టాన్ని తీసుకురానున్నామన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రమాదానికి కారణమైన వ్యక్తి సంఘటనా స్థలం నుండి పారిపోయి డూప్లికేట్ లైసెన్స్ తీసుకుని స్వేచ్ఛగా తిరుగుతున్నాడని ఆయన చెప్పారు. ఆధార్‌ను అనుసంధానం చేయడంతో పేరు మార్చుకోగలరేమో గాని బయోమెట్రిక్, ఐరిస్, వేలి ముద్రలు మారవని అన్నారు. దీంతో డూప్లికేట్ లైసెన్స్ కోసం వెళ్ళిన వారి వివరాలను సిస్టమ్ తీసుకోదన్నారు. దాంతో కొత్త లైసెన్స్ ఇవ్వడం సాధ్యపడదంటూ ఆధార్ అనుసంధానం అవసరాన్ని రవి శంకర్ ప్రసాద్ వివరించారు.

విద్యార్థి అరెస్టుకు ఉత్తర్వులు

- విద్య, ఉద్యోగాలపై ప్రశ్నించటమే నేరం
- మహారాష్ట్ర మంత్రి నిర్వాకం

ముంబయి : ఒక విద్యార్థిపై విరుచుకుపడి మహారాష్ట్ర విద్యాశాఖ మంత్రి వినోద్ తవ్డే వివాదంలో చిక్కుకున్నారు. ప్రశ్నలు- సమాధానాల సమావేశంలో ఆయన చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన వీడియో రికార్డును తొలగించాలని ఒక విద్యార్థితో వాగ్వాదానికి దిగారు. అనంతరం విద్యార్థిని అరెస్టు చేయాలని పోలీసులకు ఉత్తర్వులు జారీ చేశారు. అమరావతిలోని ఒక కళాశాలకు చెందిన విద్యార్థులు మాట్లాడుతూ రోజు రోజుకూ ఖర్చులు పెరుగుతున్నందు వల్ల పేద విద్యార్థులకు ఉచిత ఉన్నత విద్యకు అవకాశం కల్పించాలని కోరగా, చదువుకోలేకపోతే పనులు చేసుకోవాలని ఎద్దేవా చేస్తూ సమాధానం ఇచ్చారని తెలిపారు. ఆ వ్యాఖ్యలను జర్నలిజం చదువుతున్న విద్యార్థి రికార్డు చేయగా, దానిని తొలగించాలని వాదులాడి అనంతరం, అతడిని అదుపులోకి తీసుకోవాలని పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ వార్త మహారాష్ట్రలో రాజకీయ వివాదానికి దారి తీసింది. యువసేన చీఫ్ ఆదిత్య ఠాకరే దీనికి సంబంధించిన పేపర్ క్లిప్‌ను ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. విద్య, ఉద్యోగం వంటి అంశాలపై ప్రశ్నలను తప్పించుకోవడానికే మంత్రి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు.

ఒడిస్సా మంత్రి రాజీనామా

భువనేశ్వర్ : 2011లో దళిత బాలికపై జరిగిన అత్యాచారం ఘటనకు సంబంధించి వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన ఒడిస్సా వ్యవసాయ, పంచా యతీ రాజ్ మంత్రి ప్రదీప్ మహారథి ఆదివారం తన పదవికి రాజీనామా చేశారు. తన వ్యాఖ్యలకు నైతిక బాధ్యత వహిస్తూ పార్టీకి చెడ్డపేరు రాకూ డదనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. పిప్లీ గ్యాంగ్ రేప్‌కు సంబంధించి సరైన సాక్ష్యాధారాలు లేకపోవడంతో గత సంవత్సరం డిసెంబర్ 24న నిందితులను కోర్టు నిర్దోషులుగా విడుదల చేసిన సమయంలో వారికి మద్దతుగా మంత్రి మాట్లాడారు.

'కోర్టును తీర్పును ఆహ్వానిస్తున్నాను, ఇది నిజం యొక్క విజయం' అని ఆ సమయంలో వ్యాఖ్యానించారు. దీనిపై ప్రతిపక్ష బిజెపి విమర్శలు చేసింది. మంత్రి రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. కేసును మరలా విచారించాలని శనివారం బరిపాదలో జరిగిన పబ్లిక్ మీటింగ్‌లో ప్రధాని కూడా డిమాండ్ చేశారు.

ప్రముఖుల వర్ధంతులను పేర్కొనని మహారాష్ట్ర

బాధ్యులపై చర్యలకు కాంగ్రెస్ డిమాండ్



ముంబయి : నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని మహారాష్ట్ర ప్రభుత్వం ప్రచురించిన కేలండర్‌లో పలువురు ప్రముఖుల వర్ధంతులను పేర్కొనకపోవడంపై ప్రతిపక్ష కాంగ్రెస్ ఆగ్రహం వ్యక్తం చేసింది. 2019వ సంవత్సరానికి గాను ప్రచురించిన కేలండర్‌లో ఛత్రపతి శివాజీ, ప్రముఖ ప్రజాస్వామిక సంస్కరణ వాది రాజర్షి సాహు మహారాజ్, సామాజిక సంస్కర్త మహాత్మా జ్యోతిబా పూలే, బిఆర్ అంబేద్కర్‌ల వర్ధంతుల తేదీలను ప్రచురించడాన్ని విస్మరించింది. ఈ కేలండర్‌ను ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు, శాఖలకు పంపిణీ చేశారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం (డిసెంబరు 1), అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం (డిసెంబరు 3) తదిత రాలను ప్రచురించింది కాని ఆ ప్రముఖుల వర్ధంతులను విస్మరించింది. దీనిపై ప్రతిపక్షం తీవ్రంగా స్పందించింది.

ఇది తీవ్రమైన తప్పిదమని, దీనికి ఎవరు బాధ్యులో స్పష్టం చేయాలని అసెంబ్లీలో కాంగ్రెస్ నేత రాధాకృష్ణన్ విఖే-పాటిల్ అన్నారు. కేవలం రాజకీయ లక్ష్యాల కోసమే వార్షిక కేలండర్‌లో ప్రముఖుల వర్ధంతుల వివరాలు వెల్లడించలేదని ఆయన విమర్శించారు. ప్రభుత్వం కేలండర్ ప్రచురణలో చేసిన తప్పిదాలు పూలే, అంబేద్కర్‌లను అవమానించే విధంగా ఉన్నాయని, ముఖ్య ఃమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ క్షమాపణలు చెప్పాలని నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ నేత ధనంజయ్ ముండే డిమాండ్ చేశారు. కేలండర్ నుండి ప్రముఖుల పేర్లు, ఫొటోలు, వివరాలు ఎలా తొలగించబడ్డాయో ముఖ్యమంత్రి వివరణ ఇవ్వాలని కోరారు. దానికి బాధ్యులు ఎవరో, వారిపై ఎటువంటి చర్య తీసుకుంటారో కూడా తెలియచేయాలని ధనుంజయ్ డిమాండ్ చేశారు.

జెఎన్‌యులో నిధుల దుర్వినియోగం

నిరసనగా 8,9 తేదీల్లో సమ్మె



న్యూఢిల్లీ : యూనివర్సిటీకి సంబంధించిన రూ.13 లక్షల నిధులను అకడమిక్ కార్యకలాపాలకు కాకుండా ఇతర కార్యక్రమాలకు ఖర్చు పెట్టినందుకు నిరసనగా ఈ నెల 8, 9 తేదీల్లో సమ్మెకు పిలుపునిస్తున్నట్లు జెఎన్‌యు విద్యార్థి సంఘం ఆదివారం ప్రకటించింది. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు మాట్లాడుతూ శ్రీశ్రీ రవిశంకర్ సెమినార్ కోసం లక్షల రూపాయలను యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ దుర్వినియోగం చేసినట్లు తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలకు నిధులు వెచ్చించే అధికారులు యూనివర్సిటీలో వికలాంగులకు మౌలిక వసతులు కల్పించడంలో విఫలమ య్యారని మండిపడ్డారు. వీరి కారణంగా ఒక విభిన్న ప్రతిభావంతుడు జపనీస్ విద్యకు సంబంధించి రిజిస్ట్రేషన్ పొందలేక పోయినట్లు తెలిపారు. వర్సిటీలో లైబ్రరీ నిధుల్లో 80 శాతం కోత పెడుతూ, విద్యార్థులకు ఉపకార వేతనాలు చెల్లించకుండా, వాటిని భవనాలు, విగ్రహాలు, ఇతర అవసరాలకు మళ్లిస్తూ అధికారులు అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. కార్మిక సంఘాలు చేపట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు మద్దతుగా ఈ సమ్మెను చేపడుతున్నట్లు వారు తెలిపారు.

ప్రత్యేకం

గౌరీ లంకేశ్ హత్య కేసు

వెలుగు చూస్తున్న నిజాలు

వాంగ్మూలమిచ్చిన ప్రధాన నిందితుడు శరద్

బెంగళూరు : లంకేశ్ దినపత్రిక ఎడిటర్, సామాజిక కార్యకర్త గౌరీ లంకేశ్ హత్యకు కుట్ర వెనుక వాస్తవాలు ఒక్కొక్కటి వెలుగు చూస్తున్నాయి. ప్రధాన నిందితుడు శరద్ కలాస్కర్ నేరాన్ని అంగీకరిస్తూ పూర్తి వివరాలను వెల్లడించాడు. కర్ణాటక కంట్రోల్ ఆఫ్ ఆర్గనైజ్డ్ క్రైమ్ చట్టం(కెసిఒసిఎ) కింద వాంగ్మూలం కోర్టులో సాక్ష్యంగా చెల్లుతుంది. 2017 డిసెంబర్ 5న గౌరీ లంకేశ్‌ను బెంగళూరులోని ఆమె నివాసంలో కాల్చి చంపిన సంగతి తెలిసిందే. నిందితుడు చెప్పిన వివరాలు ఇలా వున్నాయి. 2016 ఆగస్టులో 'నాల్గవ లక్ష్యం'గా గౌరీ లంకేశ్‌ను ఎంచుకొని..ఆమెను హత్యగావించడానికి పథకం నిమిత్తం ఆమోల్ కాలే నేతృత్వంలోని ఓ బృందం బెలగావిలో సమావేశమైంది. ఈ బృందానికి నాయకుడైన డాక్టర్ వీరేంద్ర తవ్దేను అదే ఏడాది జూన్‌లో హత్యకు గురైన నరేంద్ర దబోల్కర్ కేసులో అరెస్టు చేయడంతో కాలే అతడి బాధ్యతలను చేపట్టినట్లు శరద్ వెల్లడించారు. గౌరిలంకేశ్ హిందువైనప్పటికీ, హిందు ధర్మానికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేస్తుండటంతో హత్యచేయాలని నిర్ణయించుకొన్నట్లు శరద్ తెలిపాడు. కుట్రకు పథకం వేసే ప్రతి సమావేశంలో తాను పాల్గొన్నట్లు నిందితుడు చెప్పాడు.

లంకేశ్ హత్యకు కొద్దిరోజుల ముందు 2017 ఆగస్టు రెండో వారంలో జరిగిన సమావేశం వివరాలను నిందితుడు వెల్లడించాడు. సమావేశంలో బృందంలోని సభ్యులకు కాలే నిర్దిష్ట బాధ్యతలను అప్పగించాడు. గణేస్ మిస్‌కిన్, పరుశురామ్ వాఘ్మోరే, భరత్ కుర్ణేను హత్యలో పాల్గొనే బృందం కింద కేటాయించాడు. సుధాన్వా సహాయంతో ఈ కుట్రకు అవసరమైన ఆయుధాలను సేకరించి బెల్గావికి రవాణా చేయాలన్న పనిని అమిత్ బద్దీకి అప్పగించాడు. తాను ఐదు తుపాకులతో జాంబోతి రోడ్డులోని ఓ అడవి ప్రాంతంలో గణేస్ మిస్‌కిన్, పరుశురామ్ వాఘ్మోరే, భరత్ కురేలు కలిసినట్లు చెప్పాడు. ఈ ముగ్గురు తుపాకుల్లో మూడింటిని సెలక్ట్ చేసుకున్నారు. అందులో ఒక పాత తుపాకీ ఉందని అది గతంలోనే వాడారని వాంగ్మూలంలో తెలిపారు.

ఈ ఘటన జరిగిన కొన్ని నెలల అనంతరం బుల్లెట్ ముక్కలతో పాటు తూటాలను, కొన్ని వస్తువులను సిట్ స్వాధీనం చేసుకుంది. ఇందులోని ఒక తూటా గోవింద్ పన్సారే, ఎంఎం కల్బుర్గి, గౌరీ లంకేశ్ హత్యల్లో ఉపయోగించిన బుల్లెట్‌తో సరిపోలినట్లు ఫోరెన్సిక్ నివేదికలో వెల్లడైంది. 2017లో తన గదిలో దేశీయ తుపాకులను తయారు చేసినట్లు వాంగ్మూలంలో తెలిపారు. గౌరీ లంకేశ్ హత్య అనంతరం పుణే ఫాం హౌస్‌లో శిక్షణ క్యాంపును నిర్వహించామని, ఆ సమయంలో 30 బాంబులను తయారు చేసినట్లు తెలిపాడు. సుమారు 15 మంది ఈ క్యాంపులో పాల్గొనగా, అదే ఏడాది డిసెంబర్‌లో జరగనున్న సన్‌బర్న్ మ్యూజికల్ ఫెస్టివల్‌పై దాడి చేయాలని, అందుకు మమ్మల్ని నాలుగు బృందాలుగా అమోల్ కాలే విభజించాడని చెప్పాడు. ఈ దాడి నిమిత్తం రెక్కి నిర్వహించిన శ్రీకాంత్ పంగార్కర్, గణేశ్‌ల చిత్రాలు సిసిటివిలో రికార్డు కావడంతో ఈ కుట్ర నుండి వారిని తొలగించారని తెలిపారు. పద్మావత్ చిత్రాలను ప్రదర్శి స్తున్న థియేటర్లపై దాడి లక్ష్యంగా 'ఈవెంట్' అనే కోడ్ పదాన్ని ఉపయోగించామని వెల్లడించారు. ముంబయి, పుణె, కోల్హాపూర్, బెలగావిలలో దాడులు చేయాలని నిర్ణయించుకోగా..బెలగావి, ముంబయిలోని రెండు థియేటర్లపై మాత్రమే పెట్రోబాంబు దాడులు చేసినట్లు తెలిపారు. గ్యాంగ్‌లోని ప్రధాన వ్యక్తులు కాలే, దేగ్వేకర్‌ను 2018 మేలో సిట్ అరెస్టు చేసిన అనంతరం గౌరీ లంకేశ్ హత్యకు వాడిన తుపాకీని ఎక్కడ పారేయాలన్న విషయంపై బృందంలోని కొంత మంది చర్చించుకున్నట్లు పేర్కొన్నాడు. పాత హత్యల్లో వాడిన తుపాకులను పారవేసి...మిగిలిన వారిని రక్షించాలని నిర్ణయించు కన్నట్లు తెలిపారు. ఈ మూడు తుపాకుల బారెల్స్‌ను తొలగించాలని, మిగిలిన భాగాలను ఇతర ఆయుధాల్లో ఉపయోగించుకోవచ్చునని భావించి. తుపాకులను బ్యాగ్‌లో వేసి వైభవ్ తన కారులో 2018 జూన్ 23 రాత్రి ముంబయిలోని ఒక నదిలో పడవేశాడని వెల్లడించాడు. తుపాకుల్లోని మిగిలిన విభాగాలను తాను వైభవ్‌కు అప్పగించానని వాంగ్మూలమిచ్చాడు. వైభవ్‌ను గత ఏడాది ఆగస్టులో మహారాష్ట్ర ఉగ్రవాద వ్యతిరేక స్క్వాడ్ అరెస్టు చేసి..తుపాకులతో పాటు పలు ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపాడు.

అఫ్ఘన్ బంగారు గనిలో ప్రమాదం

30 మంది మృతి

కాబూల్: అఫ్ఘనిస్తాన్ రాజధాని కాబూల్ నగరంలోని ఓ బంగారు గనిలో ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో 30 మంది మృతి చెందారు. ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. గనిలో చిక్కుకున్న మరికొందరిని రక్షించేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. స్థానిక అధికారులు తెలిపిన వివరాల ప్రకారం...బదాక్షణ్ ప్రావిన్స్‌లో కోహిస్తాన్ జిల్లాలోని బంగారు గనిలో కార్మికులతో కలిసి గ్రామస్థులు తవ్వకాలు జరుపుతున్న సమయంలో ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో 30 మంది చనిపోయారు. సమాచారం అందుకున్న జిల్లా కలెక్టర్ రోస్తమ్ రఫీ ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలను పర్యవేక్షించారు. సహాయక బృందాలు 13మందిని రక్షించాయని చెప్పారు. మరికొందరు గనిలో చిక్కుకొని ఉంటారని అనుమానిస్తున్నామని అన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రభుత్వ అనుమతి లేకుండా గ్రామస్థులు తవ్వకాలు జరపడంతోనే ఈ ప్రమాదం సంభవించిందని అన్నారు. మృతుల కుటుంబాలను ఆదుకుంటామని నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ ప్రకటించింది.

డ్రైవర్ లేని రైలు

డ్రైవరు, పట్టాలు లేకుండా నడిచే రైలు గురించి మీరు ఎప్పుడైనా విన్నారా? చూశారా? అటువంటి ఓ అద్భుతమైన ఎలక్ట్రిక్ రైలును చైనా ఇటీవల రూపొందించింది. 30 మీటర్ల పొడవైన ఈ చిట్టి రైలు స్మార్ట్ బస్సులా కూడా పనిచేస్తుంది.



మిచిగన్‌లో తెలంగాణ విద్యార్థిపై కాల్పులు

- పరిస్థితి విషమం..
- కారు, నగదు, ఐడీ కార్డులు అపహరణ



మిచిగన్ : అమెరికాలో తెలంగాణ విద్యార్థిపై దుండగులు కాల్పులకు పాల్పడ్డారు. అనంతరం బాధితుడి నుంచి నగదు, కారు, గుర్తింపు కార్డులు అపహరించుకుపోయారు. మిచిగాన్ రాష్ట్రంలో ఈ సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. మహబూబాబాద్ పట్టణం బెస్తంబజార్‌కు చెందిన పూస ఎల్లయ్య, శైలజ దంపతులకు చెందిన కుమారుడు పూస సాయికృష్ణ లోరెంచ్‌టెక్ యూనివర్సిటీ సౌత్ ఫీల్డ్‌లో ఎంఎస్ చదువుతున్నాడు. ఈ నెల 3న స్థానిక రెస్టారెంట్‌లో పార్శిల్ కోసం వెళ్లాడు. బయటకు వస్తున్న క్రమంలో కొందరు దుండగులు తుపాకీతో అతనిపై కాల్పులు జరిపారు. కుడి చేతికి తీవ్రంగా గాయమైంది. బాధితుడు కుప్పకూలగానే అతని వద్ద నుంచి డబ్బు, గుర్తింపు కార్డులు సహా కారును ఎత్తుకెళ్లారు. స్థానికులు గమనించి క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలిసింది. ఈ విషయం బంధువులకు తెలియడంతో ఆందోళన చెందుతున్నారు.

సరిహద్దు గోడపై ట్రంప్ మంకుపట్టు

- చర్చల్లో కానరాని పురోగతి
- ఆందోళనలో ఉద్యోగులు



వాషింగ్టన్: మెక్సికో సరిహద్దుల్లో గోడపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మంకుపట్టు పడుతుండడంతో ప్రభుత్వ 'షట్‌డౌన్' ను అంతమొందించేందుకు జరుగుతున్న చర్చల్లో ఎలాంటి పురోగతి కనిపించలేదు. షట్‌డౌన్ మూడవ వారంలోకి ప్రవేశించింది. మరో వైపు షట్‌డౌన్ మూలంగా జీతాలు ఆగిపోయి ఇబ్బంది పడుతున్న వారు, ఉద్యోగం నుంచి తాత్కాలికంగా తొలగించబడినవారు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. షట్‌డౌన్‌కు తక్షణమే తెరదించాలని వారు కోరుకుంటున్నారు. షట్ డౌన్ సోమవారం కూడా కొనసాగితే అమెరికా చరిత్రలో అతి సుదీర్ఘమైనదిగా నిలిచిపోతుంది. శనివారం డెమొక్రాట్లకు, ట్రంప్ ప్రభుత్వానికి మధ్య జరిగిన చర్చలు ట్రంప్ మొండి వైఖరి వల్ల అసంపూర్తిగా ముగిశాయి. సోమవారం తిరిగి మొదలవుతాయి. సరిహద్దు గోడ నిర్మాణానికి 500 కోట్ల డాలర్లు ఇవ్వాల్సిందేనని ట్రంప్ చేసిన డిమాండ్ ఎంతమాత్రమో ఆమోదయోగ్యం కాదని డెమొక్రాట్లు వాదిస్తున్నారు. పాక్షికంగా మూత పడిన కొన్ని ప్రభుత్వ విభాగాల పునరుద్ధరణకు నిధులు మంజూరు గావించే బిల్లులను ఆమోదించేందుకుతమ కూటమి సిద్ధంగా వుంటే, ట్రంప్ ఏమో సైనిక నిధులను సరిహద్దు గోడకు ఉపయోగించుకునేందుకు జాతీయ ఎమర్జన్సీని విధించే యోచనలో వున్నారని అమెరికన్ కాంగ్రెస్ ప్రతినిధుల సభ స్పీకర్ నాన్సి పెలోసి పేర్కొన్నారు.

సరిహద్దు గోడ నిర్మాణానికి డెమొక్రాట్లు నిరాకరిస్తున్నారనే ఒకే ఒక్క కారణంతో ట్రంప్ ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని పెలోసి ట్వీట్ చేశారు. ఈ రోజు చర్చల్లో పెద్దగా పురోగతి ఏమీ లేదని అధ్యక్షుడు ట్రంప్ అంతకుముందు ట్వీట్ చేశారు. షట్‌డౌన్ కొన్ని వారాలు, సంవత్సరాల పాటు కొనసాగే అవకాశ ముందని వుక్రవారం ట్రంప్ పేర్కొన్న సంగతి తెలిసిందే. డెమొక్రాట్లతో చర్చల్లో ట్రంప్ తరపున ప్రతినిధిగా హాజరైన ఉపాధ్యక్షుడు మైక్ పెన్స్ మాత్రం చర్చలు కొంతమేరకు ఆశావహంగాని, మరో సారి సమావేశం కావాలని ఇరు పక్షాలు నిర్ణయించాయని ట్వీట్ చేశారు.

చైనా నుండి వెనక్కి వచ్చేయండి

యాపిల్ సంస్థకు ట్రంప్ హితవు

వాసింగ్టన్: ప్రముఖ ఐఫోన్‌ల తయారీ సంస్థ యాపిల్ చైనా నుండి వచ్చి అమెరికాలో తన ఉత్పత్తులను కొనసాగించాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ పిలు పునిచ్చారు. ప్రస్తుతం ఒడిదుడుకులతో ఎలక్ట్రానిక్స్ మార్కెట్ కుదేలయి యాపిల్ సంస్థ రెవిన్యూ అంచనాలు తగ్గుతున్న సమయంలో ట్రంప్ ఈ పిలుపునివ్వటం గమనార్హం. శనివారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ 'యాపిల్ సంస్థ చైనాలో తన ఉత్పత్తులను తయారు చేస్తోంది. చైనా నుండి వచ్చి అమెరికాలోని ఉత్పత్తి కార్యకలాపాలు కొనసాగించాలని ఇటీవల నన్ను కలిసిన యాపిల్ సిఇఒ, నా మిత్రుడు టిమ్ కుక్‌కు చెప్పాను.' అని వివరించారు. చైనాలో నిర్మించిన భారీ, ప్లాంట్లను అమెరికాలోనే నిర్మించాలని తాను సూచించానని ఆయన అన్నారు.

సిరియా నుండి సేనల ఉపసంహరణ వెనుక...

వేగంగా మారుతున్న ప్రపంచ పరిస్థితులకు అనుగుణంగా అమెరికా తన సైనిక వ్యూహాన్ని మారుస్తున్నదని, దీనిలో భాగమే మధ్య ప్రాచ్యం నుంచి సైనిక బలగాల ఉపసంహరణ అని నిపుణులు చెబుతున్నారు. అమెరికా జాతీయ భద్రతా సలహాదారు జాన్ బోల్టన్‌తో కలిసి సిరియాలో పర్యటించిన ఒక అధికారి మీడియాతో మాట్లాడుతూ సిరియా నుండి సేనలను పాక్షికంగానే ఉపసంహరించుకుంటున్నట్లు చెప్పారు. సిరియా నుండి అధికశాతం సేనలను ఉపసంహరించి నప్పటికీ కొన్ని సేనలు అక్కడి అల్-తాన్ఫ్ సైనిక ఔట్‌పోస్ట వద్ద వుంటాయని పేరు తెలపడానికి ఇష్టపడని ఆ అధికారి చెప్పారు. ఇరాక్‌లో ఐఎస్ఐఎస్‌పై పోరాడేందుకు అమెరికా మరిన్ని సేనలను అక్కడికి తరలిస్తున్నది. సోమాలియాలో ప్రస్తుతం అల్‌షబాబ్‌గ్రూప్‌తో పోరాడుతున్న సైన్యాలను తగ్గించి రష్యా, చైనా చుట్టూ మోహరించాలని చూస్తున్నది.

జర్దారీ ఆస్తుల స్థంభన

పాక్ సుప్రీంకోర్టుకు జిట్ సిఫార్సు



ఇస్లామాబాద్: దాదాపు రు.22,000 కోట్ల మనీ లాండరింగ్ కేసును దర్యాప్తు చేస్తున్న పాక్ అధికారులు మాజీ అధ్యక్షుడు ఆసిఫ్ ఆలీ జర్దారీకి సంబంధించిన బ్యాంకుఖాతాలు, అమెరికా, దుబాయ్ తదితర దేశాలలో వున్న ఆస్తులను స్థంభింప చేయాలని ప్రభుత్వానికి సిఫార్సు చేసినట్లు పాక్ మీడియా తన కథనాలలో వెల్లడించింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్న జాయింట్ ఇన్వెస్టిగేషన్‌టీమ్ (జిట్) తన నివేదికను పాక్ సుప్రీంకోర్టుకు శనివారం సమర్పించినట్లు తెలుస్తోంది. కరాచీ, లాహోర్‌లలోని బిలావల్ హౌస్, ఇస్లామాబాద్‌లోని జార్దారీ హౌస్ తదితర ఆస్తులను స్థంభింప చేయాలని జిట్ తన నివేదికలో సూచిచినట్లు మీడియా తన కథనాలలో పేర్కొంది. బినామీ బ్యాంకు ఖాతాల ద్వారా దాదాపు రు.22 వేల కోట్లను లాండరింగ్ చేశారంటూ జర్దారీ, తదితరులపై కేసు నమోదయిందని ఈ కథనంలో మీడియా వివరించింది. జర్దారీ, ఆయన సోదరి ఫర్యాల్ తల్పూర్, జర్దారీ గ్రూప్‌కు చెందిన పట్టణ, వ్యవసాయ ఆస్తులను కూడా స్థంభింప చేయాలని జిట్ తన నివేదికలో సూచించినట్లు తెలుస్తోంది. అయితే తమపై నమోదయిన మనీ లాండరింగ్ ఆరోపణలను తిరస్కరించిన జర్దారీ, తల్పూర్‌లు జిట్ నివేదిక అంతా రాజకీయ దురుద్దేశాలతోనూ, ఊహాగానాల తోనూ నిండి వుందని విమర్శించారు. జర్దారీ గ్రూప్‌తో పాటు ఒమ్ని గ్రూప్‌కు చెందిన సుగర్‌మిల్స్ వ్యవసాయ, విద్యుత్ కంపెనీలకు చెందిన ఆస్తులను కూడా స్థంభింప చేయాలని జిట్ సుప్రీంకోర్టుకు సిఫార్సు చేసింది.



ఫ్రాన్స్‌లో మరోసారి 'యెల్లో వెస్ట్స్' నిరసనలు

పారిస్: ఇటీవల ఫ్రాన్స్‌లో తీవ్ర కలకలం రేపిన ఎల్లో వెస్ట్స్ నిరసనకారులు శనివారం మరోసారి రోడ్డెక్కి మాక్రాన్ సర్కారుపై తమ వ్యతిరేకతను పునరుద్ఘాటించారు. శనివారం సెంట్రల్ పారిస్‌లో జరిగిన భారీ నిరస ప్రదర్శనను ప్రభుత్వ ప్రతినిధి ఒకరు తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలతో యెల్లో వెస్ట్స్ ఉద్యమం సద్దు మణిగినప్పటికీ, ప్రభుత్వాన్ని గద్దె దింపాలని కోరుకుంటున్నవారు మాత్రం ఇంకా ఆందోళనలు కొనసాగిస్తూనే వున్నారని ఆయన విమర్శించారు. సెంట్రల్ పారిస్‌లో ఛాంప్స్ ఎలిసీస్ వద్ద వేలాది మంది నిరసనకారులతో జరిగిన భారీ ప్రదర్శనకు దాదాపు 15 పోలీసు బృందాలతో భద్రత కల్పించారని మీడియా తన కథనాలలో పేర్కొంది. పారిస్‌తో పాటు ఫ్రాన్స్‌లోని ఇతర నగరాల్లో కూడా శనివారం భారీ యెత్తున నిరసన ప్రదర్శనలు జరిగాయి. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎల్లో వెస్ట్స్ ఉద్యమించటం ఇది వరుసగా ఎనిమిదో శనివారం కావటం విశేషం. అయితే ఉద్యమ ప్రారంభం నాటి ఉత్సాహం ఇప్పుడు తగ్గిపోయిందని పరిశీలకులు చెబుతున్నారు. అయితే ఒడాక్సా డెంట్సు నిర్వహించిన తాజా ఒపీనియన్ పోల్‌లో ఇప్పటికీ 55 శాతం మంది ప్రజలు ఎల్లో వెస్ట్స్ ఉద్యమాన్ని బలపరుస్తున్నట్లు తెలుస్తోంది. నవంబర్‌లో ఇంధన పన్నుల పెంపుదలను నిరసిస్తూ ఫ్రాన్స్ గ్రామీణ ప్రాంతాలలో మెరుపుతో స్పష్టంగా కన్పించే పసుపు రంగు జాకెట్లను ధరించిన ఆందోళనకారులు నిరసన ప్రదర్శన నిర్వహించటంతో దీనిని 'యెల్లో వెస్ట్స్' ఉద్యమంగా పిలుస్తున్నారు. మాక్రాన్ సర్కారు మార్కెట్ అనుకూల విధానాలు, పాలనా తీరును నిరసిస్తూ ఈ ఉద్యమం క్రమంగా ఉధృత రూపం దాల్చటంతో, తొలుత వ్యతిరేకించినప్పటికీ తరువాత వత్తిడి పెరిగిన నేపథ్యంలో మాక్రామన్ గత నెలలో ప్రతిపాదిత ఇంధన పన్ను పెంపుదలను రద్దు ఏయటంతోపాటు కనీస వేతనాలు అందుకునే వారికి అదనపు నగదు చెల్లింపును, పెన్షనర్లకు పన్ను రాయితీలనుకల్పిస్తామని హామీ ఇచ్చారు. మాక్రాన్ 20 నెలల పాలనను ఈ నిరసనలు రాజకీయంగా భారీ కుదుపు కుదిపాయని పరిశీలకులు చెబుతున్నారు.

మొదటి పేజీ తరువాయి

మందులా! బయటే కొనుక్కోండి !!

ఆదేశాలు జారీ చేశారు. ప్రజల్లో అసంతృప్తికి ముఖ్య కారణం ఎన్‌టిఆర్ వైద్య సేవల కింద చికిత్స పొందే రోగులకు అవసరమైన మందులు ఏవీ ఉచితంగా దొరకడం లేదు. అన్ని బయటి నుంచే కొనాల్సిన పరిస్థితి ఉంది. బయట కొన్న మందులకు రీయింబర్స్‌మెంట్ కోసం కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా అధికారుల్లో స్పందన లేదు. ఛార్జీలు పెట్టుకుని తిరగలేక ఆ మొత్తాన్ని వదిలేసుకుంటున్నారు. ఇక్కడ ఎన్‌టిఆర్ వైద్య సేవల కింద ప్రతినెలా సుమారు 600 నుంచి 700 వరకూ శస్త్ర చికిత్సలు చేస్తుంటారు. 2018 జనవరి నుంచి డిసెంబర్ వరకూ 14,280 మంది ఎన్‌టిఆర్ ఆరోగ్యశ్రీ కింద వైద్యం పొందారు. ఎన్‌టిఆర్ వైద్య సేవల కింద పేదలకు చేసిన శస్త్ర చికిత్సల ద్వారా ఆస్పత్రికి సుమారు రూ.15 కోట్ల వరకూ నిధులు సమకూరుతాయి. పేదల నుంచి లభిస్తున్న ఈ ఆదాయంతో వారికి మెరుగైన వసతులు కల్పించేలా చూడాల్సిన అధికారులు ఆ దిశగా దృష్టి పెట్టడం లేదు. ఎన్‌టిఆర్ వైద్య సేవల కింద కనీసం 260 రకాల మందులు అందుబాటులో ఉండాలి. బిపి, షుగర్, పారా సిటమల్, బి కాంప్లెక్స్, గ్యాస్ మాత్రలు ఇలా 16 రకాలు మందులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి.

ఎన్‌టిఆర్ వైద్య సేవల కింద శస్త్ర చికిత్స కోసం ఆస్పత్రిలో చేరిన వారికి అవసరమైన రక్త పరీక్షలు, ఎంఆర్ఐ, సిటీ, ఎక్స్‌రే, స్కానింగ్.. ఇలా అన్ని ఉచితంగా చేయాలి. శస్త్ర చికిత్స చేసే సమయంలో దానికి అవసరమయ్యే మందులను ఆస్పత్రి నుంచే ఇవ్వాలి. డిశ్చార్జి అయ్యాక అవసరమైన మందులు ఏడాది పాటు నెలనెలా ఆస్పత్రి ద్వారా ఉచితంగా అందజేయాలి. రోగులకు కావాల్సిన మందులను చాలా వరకూ బయట నుంచే కొనిపిస్తున్నారు. రోగికి నయమై ఇంటికి వెళ్లే సమయంలోనూ మందులు అందుబాటులో ఉండడం లేదు. సాధారణంగా ఒక్కో రోగికి కనీసం రూ.1000 ఖర్చు అవుతుంది. అదే శస్త్ర చిక్తిత్స చేయించుకున్న వారికి రూ.5 వేల నుంచి రూ.8 వేల వరకూ అవుతుంది. రోగికి ఆరోగ్యం కుదుటపడి ఇంటికి వెళ్లే సమయంలో నిధులు లేవని డబ్బులివ్వడం లేదు. నగదు వచ్చాక సమాచారం ఇస్తామని చెప్పి రోగులను నెలల తరబడి తిప్పకుంటున్నారు. బాధితులు చివరికి ఆ మొత్తాన్ని వదిలేసుకుంటున్నారు. ఎన్‌టిఆర్ వైద్య సేవల కింద రోగులకు మందులు, ప్రయాణ ఖర్చులకు కలిపి నెలకు రూ.8 లక్షలు ఖర్చు చేస్తున్నట్లు లెక్కలున్నాయి. ఈ నిధుల్లో కొంత మొత్తం పక్కదారి పడుతున్నాయనే అనుమానాలు లేకపోలేదు.

బయటి మందులకు 10 శాతమే రీయింబర్స్

ఒగురు వెంకట నరసింహులు, ఉయ్యాలవాడ

రెండేళ్లుగా ఆటో ఇమ్మోనియా అనే వ్యాధితో బాధపడుతున్న నా కుమార్తె పావని శశి(14)ని గత సెప్టెంబర్‌లో ఎఎంసిలో 18 రోజులు పెట్టారు. తర్వాత వార్డుకు మార్చారు. నవంబర్‌లో చనిపోయింది. ఆ సమయంలో రూ.12 వేల ఖరీదు చేసే మందులు బయట కొన్నాం. రీయింబర్స్ కోసం నెల రోజులపాటు తిప్పుకుని కేవలం పది శాతమే వస్తుందని చెప్పారు. దానికోసం తిరగలేక వదిలేశాను.

వారం రోజుల్లో మందులు : డాక్టర్ పి.చంద్రశేఖర్, ఆస్పత్రి సూపరింటెండెంట్

మందులు లేని మాట వాస్తవమే. ఇటీవల టెండర్లు వేశాం. త్వరలో సమస్యను పరిష్కరిస్తాం. బయట కొన్న మందులకు 10 శాతమే రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలనే నిబంధన ఉంది. కేసును బట్టి వైద్యులకు, ఇన్‌స్టికేషన్స్‌కు, పరీక్షలకు, మందులకు పర్సెంటేజీని బట్టి ఇవ్వాలి. మందుల ధర జనరిక్ స్థాయిలోనే ఉంటుంది. అంతే రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలి. టెండర్లు పూర్తయ్యాయి. త్వరలో అన్ని మందులూ అందుబాటులోకి తెస్తాం.

ఆరు లక్షల కోట్ల అవినీతి

సోంపేటలోని లక్కవరంలో ఆదివారం ఆయన ఆవిష్కరించారు. నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం జారీ చేసిన అన్ని జిఒలూ, నిధుల విడుదల, వాటి వినియోగం, ప్రాజెక్టుల అంచనాలు, రాజధాని భూసేకరణలో రియల్ దందాలు, రాజధాని తాత్కాలిక నిర్మాణాల్లో అవినీతి సహా పలు అంశాలను ఈ పుస్తకంలో పొందుపరిచారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోపాటు అధికార పార్టీ నేతలు దేన్నీ వదలకుండా అన్నీ దోచుకున్నారని విమర్శించారు. వారి అవినీతితో రాష్ట్రానికి ఎంతో నష్టం వాటిల్లిందన్నారు. వీటిని ప్రజల్లోకి తీసుకెళ్లి అధికార పార్టీ నేతల దోపిడీని వివరించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. లక్కవరం క్రాస్ శిబిరం నుంచి 338వ రోజు ప్రజాసంకల్పయాత్ర ప్రారంభానికి ముందు ఆయన ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం సోంపేట మండలంలోని పలాసపురం, జింకిభద్ర క్రాస్, సోంపేట, కంచిలి మండలంలోని ఇసుకలపాలెం క్రాస్, మండపల్లి క్రాస్ మీదుగా తలతంపర వరకూ యాత్ర కొనసాగింది. 10.8 కిలోమీటర్లు నడిచిన ఆయన 3,618 కిలోమీటర్ల పాదయాత్రను పూర్తి చేశారు.

సహకార నిర్వీర్యం బాబు ఘనతే!

ఐక్య పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

పిఎసిఎస్ ఉద్యోగుల దీక్షలో సిఐటియు ఉపాధ్యక్షులు ఉమామహేశ్వరరావు



పిఎసిఎస్ ఉద్యోగుల దీక్షలో మాట్లాడుతున్న సిఐటియు ఉపాధ్యక్షులు ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సహకార రంగాన్ని నిర్వీర్యం చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి ఉమామహేశ్వరరావు అన్నారు. విజయవాడలోని ధర్నాచౌక్‌లో అగ్రికల్చర్ కో-ఆపరేటివ్ సొసైటీ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం చేపట్టిన దీక్షలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిష్కరించ డానికి అవకాశమున్న అంశాలను కూడా ఎందుకు పరిష్కరించడం లేదని ప్రశ్నించారు. కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన సిఎం వాటిని అమలు చేయకుండా మోసం చేశారన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచమనడం అన్యాయమా అని ప్రశ్నించారు. సహకారం ఉద్యోగుల వేతన పెంపునకు ప్రభుత్వం వేసిన కమిటీ పనికిమాలిన సిఫారసులు చేసిందని, న్యాయమైన కోర్కెలు తీర్చడంపై ప్రభుత్వం ఆలోచించాలని అన్నారు. సహకార రంగాన్ని బతికించు కుంటేనే రైతులు బాగుపడతారన్నారు. సహకార రంగంలో మాల్యా, నీరవ్ మోడీలాగా లక్షల కోట్లు ఎగ్గొట్టిన సందర్భం ఉందా? అని ప్రశ్నించారు. సహకార రంగాన్ని ప్రభుత్వం నిర్వీర్యం చేయాలని చూస్తోందని, మూడేళ్ల సక్రమంగా నడవకపోతే మూసేస్తామని చెబుతున్నారని, అలా అయితే అప్పులు పెరిగిన ప్రభుత్వాన్ని కూడా మూసేయాలి కదా అని ప్రశ్నించారు. సహకారం రంగంలాంటి బలమైన వ్యవస్థలు ఇతర బ్యాంకుల్లో కూడా లేవని, ఐక్య పోరాటాల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని, ప్రభుత్వం మెడలు వంచే వరకూ పోరాడాలని పిలుపునిచ్చారు. కార్మికుల హక్కులను మోడీ, చంద్రబాబు కాలరాస్తున్నారని, గతంలో లాగా కార్మికులను బానిసలుగా చూసే చట్టాలు రాబోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. యూనియన్ గౌరవాధ్యక్షులు పి అజయ్‌కుమార్ మాట్లాడుతూ కమిటీ సిఫారసులు యథావిధిగా ఆమోదం పొందితే కొన్ని నష్టాలున్నాయన్నారు. సిఫారసుల్లో మార్పులు చేసి జీవో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 10 శాతం వేతనం పెంపును వ్యతిరేకిస్తున్నామని, గ్రాట్యుటీ కూడా భిక్షగా ఉందని అన్నారు. గ్రాట్యుటీ చట్టం ప్రకారం చూసినా కనీసం రూ.5 లక్షలు రావాల్సి ఉందన్నారు. 2016 మార్చి నాటికి ఐదేళ్ల సర్వీసు లేని వారికి ఉద్యోగ భద్రత లేని విధంగా కమిటీ సిఫారసులు ఉన్నాయన్నారు. సుదీర్ఘ పోరాటం చేస్తే ఏదైనా సాధించుకోగలమన్నారు.

ఎయు విసి వ్యాఖ్యలపై

సైన్సు సొసైటీ ఆగ్రహం

మొదటి పేజీ తరువాయి

(1920), సర్ రామ్‌నాథ్ చోప్రా (1948), పి. పరిజా (1960) తదితరులను సైన్సు సొసైటీ ఈ సందర్భంగా గుర్తుకు తెచ్చుకుంది. ప్రాచీన భారత దేశంలో సైన్సు సాధించిన లక్ష్యాలకు గుర్తింపు తీసుకు వచ్చేందుకు వీరు ఎంతగానో కృషి చేశారని తెలిపింది. సైన్సును ఒక లక్ష్యాత్మక అంశంగా వారు భావించారని సైన్స్ సొసైటీ తెలిపింది. "మూల కణాలపై పరిశోధన, ఫలదీకరణ,, బాలిస్టిక్, గైడెడ్ క్షిపణుల శాస్త్రం, సాపేక్ష సిద్ధాంతం, క్వాంటం మెకానిక్స్ తదితర అంశాలు ఒక ప్రక్రియగా ఉద్భవించాయి. తగిన శాస్త్రీయ సైద్ధాంతిక పునాది లేకుండా సాంకేతికత ఏదీ కూడా సాఫల్యం చెందదు" అని సొసైటీ పేర్కొంది.

జలంధర్‌లో జరిగిన ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ సమావేశంలో ఆంధ్రా యూనివర్సిటి వైస్ ఛాన్సలర్ జి. నాగేశ్వరరావు శుక్రవారం మాట్లాడుతూ మూల కణాల కారణంగా టెస్ట్ ట్యూబ్ సాంకేతికతతో కౌరవులు పుట్టారని, గైడెడ్ మిస్సైల్స్‌కు సంబంధించిన విజ్ఞానం వేల సంవత్సరాల క్రితమే భారత్‌లో ఉందని వ్యాఖ్యానించారు. . ఐన్‌స్టీన్, న్యూటన్ ప్రపంచాన్ని తప్పుదోవ పట్టించారని,దశవతారం డార్విన్ సిద్ధాంతం కన్నా గొప్పదని తమిళనాడులోని అలియార్‌లో ప్రపంచ కమ్యూనిటీ సర్వీస్ సెంటర్‌లో సీనియర్ రీసెర్చ్ సైంటిస్ట్‌నని చెప్పుకున్న డాక్టర్ కన్నన్ జెగతాల కృష్ణన్ వ్యాఖ్యానించారు. అంతేకాక డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం కన్నా శాస్త్ర, సాంకేతిక మంత్రి డాక్టర్ హర్షవర్ధన్ గొప్ప శాస్త్రజ్ఞుడని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై ఐఎస్‌సిఎ జనరల్ ప్రెసిడెంట్ డాక్టర్ మనోజ్ కుమార్ చక్రవర్తిని ప్రశ్నించగా ఈ వ్యాఖ్యలను గురించి తనకు తెలియదని చెప్పారు. సైన్సుపై పూర్తి అవగాహన ఉన్న వారినే ఈ కాంగ్రెస్‌కు పిలిచామని, ఈ వేదికలో ఇటువంటి వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదని, ఆ సదస్సులో తాను ఉండి ఉంటే వారిని ప్రశ్నించేవాడినని అన్నారు. కాగా ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌లో ఇటువంటి పొరపాట్లు జరగడం ఇదే తొలి సారి కాదని కూడా బ్రేక్ త్రూ సైన్స్ సొసైటీ పేర్కొంది.

గిన్నిస్‌లోకి పోలవరం

మొదటి పేజీ తరువాయి

స్పిల్ ఛానల్‌లో కాంక్రీట్ పనులు ఆదివారం ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభమయ్యాయి. 24 గంటల పాటు నిర్విరామంగా సాగే ఈ పనులు సోమవారం ఉదయం 8 గంటలకు కొనసాగుతుంది. నవయుగ కంపెనీకి చెందిన నాలుగు వేల మంది కార్మికులు మూడు షిఫ్టులుగా షిఫ్టుకి తొమ్మిది వందల మంది చొప్పున కాంక్రీట్ పనుల్లో పాల్గొంటున్నారు. 76 మంది జలవనరుల శాఖ ఇంజినీర్ల పర్యవేక్షణలో ఈ పనులు సాగుతున్నాయి. స్పిల్‌ఛానల్‌లో 310 బ్లాకుల్లో బ్లాక్‌కు 100 క్యూబిక్ మీటర్ల చొప్పున కాంక్రీట్ పనులు సాగుతున్నాయి. ఈ కాంక్రీట్ పనుల్లో జర్మనీ నుంచి దిగుమతి చేసుకున్న అత్యాధునిక యంత్రాలు ఆరు టెలీ బెల్టులు, 80 సిమెంట్ మిక్సర్ యంత్రాలు, ఏడు క్రషర్లు, పది బ్లాచింగ్ ప్లాంట్ల నుండి కాంక్రీట్ వేగవంతంగా సరఫరా అవుతుంది. ఒక్కో బ్లాచింగ్ ప్లాంట్ నుండి గంటకు 1560 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ సరఫరా వేగవంతంగా చేస్తున్నారు. ఆదివారం రాత్రి 8 గంటల సమయానికి 15,684 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ వేసినట్లు అధికారులు తెలి పారు. దీనికి అవసరమైన సిమెంట్‌ను ముందు గానే సిద్ధం చేసి ఉంచారు. గిన్నిస్ బుక్ నిపుణులు రిషినాథ్ ఆదివారం ఉదయం ఎనిమిది గంటలకు కాంక్రీట్ పనులను ప్రారం భించారు. గంటలోనే 1382 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులు విజయవంతంగా పూర్తి చేసారు. ఇదే విధంగా కాంక్రీట్ పనులు వేగవంతంగా చేస్తే ఆదివారం అర్ధరాత్రి నాటికి గతంలో దుబాయిలో రికార్డు సష్టించిన 21,580 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనిని నవయుగ కంపెనీ అధిగమిస్తుందని పోలవరం ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్ శ్రీధర్, పోలవరం ప్రాజెక్టు గౌరవ సలహాదారుడు రమేష్ బాబు తెలిపారు. 24 గంటల్లో సుమారు 32 వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పని జరగనున్నట్లు పోలవరం ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్ శ్రీధర్ తెలిపారు.

సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పోలవరం ప్రాజెక్టులో గిన్నిస్ బుక్ అధికారుల చేతుల మీదుగా ప్రపంచ రికార్డు పత్రాన్ని కచ్చితంగా తీసుకుంటారన్నారు. నవయుగ కంపెనీ కాంక్రీట్ పనులకు సంబంధించి ఇప్పటికే రెండు గిన్నిస్ బుక్ రికార్డులను చేజిక్కించుకుంది. సోమవారం నమోదయ్యే కొత్త రికార్డు ఈ సంస్థకు మూడో గిన్నిస్ రికార్డు కానుంది. ఈ కార్యక్రమాల్లో పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ సిఇఒ ఆర్‌కె జైన్, సిఇ ఎకె.ప్రధాన్, పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ సభ్యులు ఆర్కే గుప్తా, ఇంజినీరింగ్ చీఫ్ ఎం.వెంకటేశ్వరరావు, గేట్ల తయారీ నిపుణుడు కన్నయ్యనాయుడు, ఎబి.పాండ్యా, వైకె.హొూండా, సెంట్రల్ వాటర్ కమిషన్ సిఇ ఎస్.ముస్నీలాల్, ఫ్రాన్స్ ఇంజినీర్ అనిల్ జైన్ పాల్గొన్నారు.

తమిళనాడులో ఘోరం

మొదటి పేజీ తరువాయి

15 మంది ఈ నెల 2న ప్రయివేటు ట్రావెల్‌వ్యాన్‌లో హైదరాబాద్ నుంచి శబరిమలకు బయలుదేరారు. ఆది వారం తిరుగు ప్రయాణంలో తమిళనాడు రాష్ట్రంలోని పుదుకొట్టై సమీపంలో ప్రధాన రహదారిపై ఆగి ఉన్న లారీని భక్తులు ప్రయాణిస్తున్న ట్రావెల్ వ్యాన్ ఢీకొట్టింది. దీంతో వ్యాన్‌లో ఉన్న నాగరాజు(40), శ్యాంసుందర్ గౌడ్(22), ఆంజనేయులు (42), కిష్టాగౌడ్(35), మహేష్ (26), కుమార్ (26), సాయి(22), సురేష్(30), ప్రవీణ్‌గౌడ్(25), వ్యాన్ డ్రైవర్ (40) మృతిచెందారు. రాజు, వెంకటేష్, నరేష్‌గౌడ్, భూమాగౌడ్, శ్రీశైలం తీవ్ర గాయాలతో ప్రాణాపాయ స్థితిలో ఉండగా చికిత్స నిమిత్తం స్థానికులు అక్కడి ఆస్పత్రికి తరలించారు. ప్రమాద వార్త తెలుసుకున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, మెదక్ కలెక్టర్ ధర్మారెడ్డి అక్కడి కలెక్టర్‌తో మాట్లాడారు. గాయాలపాలైన వారికి మెరుగైన చికిత్స అందించాలని కోరారు.

నర్సాపూర్ మండలంలో విషాదఛాయలు

అయ్యప్పమాల ధరించి దైవదర్శనం కోసం వెళ్లిన తమవారు ఇక రాలేరని కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. ఈ ఘటనతో నర్సాపూర్ మండల పరిధిలోని గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. ఖాజిపేట్, మంతూర్, రెడ్డిపల్లి, చిన్న చింతకుంట గ్రామాల్లో ప్రతి ఒక్కరూ శోకసంద్రంలో మునిగిపోయారు.

సిఎం కెసిఆర్ దిగ్భ్రాంతి

పుదుకొట్టై ఘటనపై సీఎం కేసీఆర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదం చాలా బాధాకరమని విచారం వ్యక్తం చేశారు. మృతిచెందిన అయ్యప్ప భక్తుల కుటుంబాలకు ఆయన సంతాపం ప్రకటించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను కోరారు.

రాజీనామా చేస్తారా..?

మొదటి పేజీ తరువాయి

స్పందిస్తూ 'అబద్ధాలు చెప్పే రక్షణ శాఖ మంత్రి అవాస్తవాలు బహిర్గతమయ్యాయి. లక్ష కోట్ల రూపాయల విలువ చేసే కొనుగోలు ఆర్డర్లను హాల్‌కు ప్రభుత్వం ఇచ్చినట్లు చెప్పారు. సింగిల్ ఆర్డర్ కానీ..ఒక్క పైసా కానీ రాలేదని హాల్ చెబుతోంది. చివరికి ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేక మొదటిసారి వెయ్యి కోట్ల రూపాయల రుణాలను తీసుకోవాల్సిన పరిస్థితికి వచ్చింది' అని ట్విట్టర్‌లో విమర్శించారు. హాల్ ఆర్థిక నష్టాల్లో కూరుకుపోయిందని, ఉద్యోగుల వేతనాలను చెల్లించడానికి రుణాలను తీసుకోవాల్సి వస్తుందని మీడియా కథనాలు వెలువడటంతో కాంగ్రెస్ నేతలు విమర్శనాస్త్రాలు సంధించారు. తమ హాయాంలో కుదుర్చుకున్న 126 యుద్ధవిమానాలకు బదులు రక్షణా యుద్ధ విమానాల తయారీలో ఏమాత్రం అనుభవం లేని అనిల్ అంబానీ జేబులను నింపడానికే 36 రాఫెల్ యుద్ధ విమానాలను ఒప్పందాన్ని ఇప్పటి ప్రభుత్వం కుదుర్చుకుందని కాంగ్రెస్ పునర్ఘాటించింది.

ముందు ఎబిసిడిలు నేర్చుకో : సీతారామన్

రాహుల్ వ్యాఖ్యలపై రక్షణమంత్రి సీతారామన్ ట్విట్టర్ ద్వారా ఆదివారం స్పందించారు. ' రాహుల్, మీరు ఎబిసిల నుండి తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. దీనిపై వ్యాఖ్యలు చేసే ముందు పూర్తి నివేదిక చదవండి' అని వార్తా పత్రికకు సంబంధించిన క్లిప్‌ను జత చేశారు. రాహుల్ అవాస్తవాలను ప్రచారం చేస్తుండటం సిగ్గుచేటనీ, ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని దుయ్యబట్టారు. హాల్ చేసుకున్న ఒప్పందాలకు సంబంధించిన ప్రతులను ట్విట్టర్ ఖాతాకు జత చేశారు. 2014-18 మధ్య కాలంలో హాల్ 26వేల కోట్ల రూపాయల విలువ చేసే ఒప్పందంపై సంతకం చేసిందని, 73 వేల కోట్ల రూపాయల విలువ చేసే ఒప్పందాలు చేసుకోనుందని తెలిపారు. తనను రాజీనామా చేయడంపై దేశానికి క్షమాపణలు చెప్పాలని ఆమె కోరారు. కాగా, శుక్రవారం రాఫెల్‌పై సీతారామన్ మాట్లాడుతూ హాల్‌పై కాంగ్రెస్ మొసలి కన్నీరు కారుస్తోందని, ఆ పార్టీ హాయాంలో హాల్‌కు చేసిందేమీ లేదని, తాము లక్ష కోట్ల రూపాయాల కాంట్రాక్టునిచ్చామని సభాముఖంగా వివరణనిచ్చిన సంగతి తెలిసిందే.

2019 బయోపిక్‌లు, చారిత్రిక చిత్రాలు

శుక్రవారం వస్తే చాలు చిత్రసీమలో ఉత్కంఠ నెలకొంటుంది. ప్రేక్షకులు ఏం తీర్పు ఇస్తారా? అన్న టెన్షన్ అటు హీరోలు, ఇటు దర్శక నిర్మాతల్లోనూ ఉంటుంది. ఎందుకంటే సినిమాలు ఎక్కువగా విడుదలయ్యేవి ఆరోజే కాబట్టి. గత ఏడాది బాలీవుడ్‌లో చాలా సినిమాలు వచ్చాయి.. అలరించాయి. హిందీ చిత్రసీమ అంటేనే ఖాన్, కపూర్ వంటి వారిదే హవా ఉంటుంది. గత ఏడాది ఖాన్‌ల ముగ్గురు చిత్రాలు వచ్చినా అందులో సల్మాన్ ఒక్కరిదే మెప్పించింది. 2019లో కూడా బయోపిక్‌ల హవా కొనసాగనుంది. ఈ ఏడాది కొత్తగా చారిత్రిక సంఘటనలకు సంబంధించి చిత్రాలు రాబోతున్నాయి. ఎవరికి వారు కొత్తగా మెప్పించాలనే ప్రయత్నంలో ఎక్కడా రాజీపడడం లేదు. ఇప్పటికే చాలా మంది సినిమాలు ఎప్పుడు ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నది వెల్లడించేశారు.

సినిమా లాంఛనంగా ప్రారంభించినప్పుడు క్లాప్ కొట్టిన దగ్గర నుంచీ థియేటర్లకు వచ్చే రోజు వరకూ ఆ సినిమా గురించి ఊదరగొడుతూనే ఉంటారు. ఏదొక రూపంలో ప్రమోషన్ కల్పిస్తారు. తమ ఆలోచనలను ప్రేక్షకులకు చేరవయ్యేలా శతవిధాల ప్రయత్నిస్తారు. అందులో కొందరు వివాదాస్పదం చేసి ప్రమోషన్ చేస్తారు. మరికొందరు స్టార్‌ను పెట్టి ప్రచారం చేస్తారు. ఈ ఏడాది ప్రారంభంలోనే వివాదాస్పదమైన చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఆ సినిమాయే 'ది యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్'. ఇది మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ జీవితం ఆధారంగా రూపొందింది. బీజేపీ నేత, నటుడు అనుపమ్ ఖేర్ మన్మోహన్‌గా చేశారు. విజయ్ గుట్టే దర్శకత్వం వహించారు. ఈ సినిమా ట్రైలర్ విడుదలయ్యాక వివాదాస్పదమైంది. కాంగ్రెస్‌ను దెబ్బతీయడానికే ఈ సినిమా చే

శారని, ఈ ఏడాది జరగబోయే లోక్ సభ ఎన్నికలు దృష్టిలో పెట్టుకుని ఓటర్లను మభ్యపెట్టడానికి ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారని కాంగ్రెస్ తీవ్రంగా ఆరోపించింది. ఈ సినిమా విడుదలకు ముందు కాంగ్రెస్ కమిటీకి చూపించాలని కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ చిత్రం ఈనెల 11న ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రజాస్వామ్య దేశంలో ఏ విషయాన్ని అయినా స్వేచ్ఛగా చెప్పుకునే వెసులుబాటు ఉందని 'ది యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్' చిత్రబృందం చెబుతోంది.


థాక్రే

ఆదిత్యా ధార్ తెరకెక్కించిన చిత్రం 'ఉరి'. 2016లో ఇండియన్ బోర్డర్ ఉరి వద్ద పాకిస్థాన్ ఆర్మీ ఆకస్మిక దాడులు చేసి భారతీయ సైనికుల ప్రాణాలను బలికొంది. ఈ నేపథ్యంలో ఇండియన్ గవర్నమెంట్ పాకిస్తాన్‌పై సర్జికల్ స్ట్రయిక్ పేరిట సైనిక దాడులు నిర్వహించింది. ఈ వాస్తవ ఘటనపై తెరకెక్కిన చిత్రమే 'ఉరి'. విక్కీ కౌసల్, పరేశ్ రావల్, మోహిత్ రైనా, యామి గౌతమ్ తదితరులు నటించారు. ఈనెల 11న ప్రేక్షకుల ముందుకు రానుంది.

హాస్యభరిత చిత్రంగా 'ఛీట్ ఇండియా' రూపొందింది. ఈ చిత్రం ఈనెల 18న విడుదల కానుంది. సౌమిక్ సేన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో ఇమ్రాన్ హష్మి, శ్రేయ ధన్వాంత్రి ముఖ్య తారాగణంగా నటించారు. దీంతో పాటు ఇదే రోజు ఇదే తరహా తెరకెక్కిన మరొకటి వస్తుంది. మోసగాడైన భర్త అనే కాన్సెప్ట్‌పై 'ఫ్రాడ్ సైయాన్' రాబోతుంది.


ఉరి

ఈనెలలో విడుదల కానున్న మరో చిత్రం కూడా వివాదాస్పదమైంది. అదే 'థాక్రే'. శివ సేనా స్థాపకుడు, మహారాష్ట్రను అల్లాడించిన వ్యక్తి బాలథాక్రే జీవితం ఆధారంగా రూపొందింది. ఈ సినిమా ఈనెల 25న రానుంది. ఇప్పటికే విడుదలైన ట్రైలర్‌కు మంచి స్పందన వచ్చింది. ఈ సినిమా విడుదలయ్యే రోజు మరో చిత్రమేదీ విడుదల కావడానికి వీళ్లేదని శివ సేన ఆదేశాలు జారీ చేసింది. అమిర్ ఖాన్ లాంటి వారైతే థాక్రే కంటే రియల్ హీరో ఎవరని కూడా కితాబిచ్చేశారు. నవాజుద్దీన్ సిద్ధిఖీ బాలథాక్రేగా చేశారు. అమృత రావు థాక్రే భార్యగా నటించింది. అభిజిత్ పన్‌సే దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కింది.


భరత్

ఓ వ్యక్తి కష్టపడి చదువుకొని మళ్లీ తమలాంటివారికి సాయంగా నిలవడం అనేది చాలా అరుదు. బీహార్‌లో మాత్రం ఆనంద్ కుమార్ అనే వ్యక్తి మాత్రం ఏటా పేద పిల్లలకు ఉచితంగా ఐఐటీ ప్రవేశ ప్రవేశ పరీక్షకు శిక్షణ ఇస్తున్నాడు. ఇలా ఏటా 30 మందిని ఎంపిక చేసి ఇప్పటి వరకూ చాలా మంది పేద పిల్లలను విద్యావంతులను చేశాడు. ఇప్పుడు ఆయన జీవితం ఆధారంగా రూపొందుతోన్న సినిమా 'సూపర్ 30'. హృతిక్ రోషన్ ఆనంద్ కుమార్ పాత్రలో కనిపించబోతున్నాడు. వికాస్ బహ్లా దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రం ఈనెల 25న రాబోతుంది.

ఇదే రోజు వీరవనిత చిత్రం వెండితెరపై చూడబోతున్నాం. ఆమె ఝాన్సీ లక్ష్మీబాయి. బానిస సంకెళ్ల నుంచి దేశం విముక్తి కోసం ఆమె చేసిన పోరాటం అంతా ఇంతా కాదు. ఆమె జీవితం ఆధారంగా 'మణికర్ణిక' పేరుతో కంగనా రనౌత్ టైటిల్ రోల్ పోషిస్తూ రూపొందించారు. ముందుగా ఈ చిత్రానికి క్రిష్ దర్శకత్వం వహించారు. తర్వాత షెడ్యూల్ ప్రకారం ఆయన ఎన్టీఆర్ బయోపిక్‌కు వెళ్లిపోయారు. ఈ చిత్రంలో మిగిలిన 40 శాతం చిత్రీకరణకు కంగనా రనౌత్ దర్శకత్వం వహించారు. సూపర్ 30, మణికర్ణిక మధ్య క్లాస్ కానుంది.


కేశరి


టోటల్ డమాల్

రణవీర్ సింగ్ చేస్తోన్న 'గల్లీ బాయ్' శరవేగంగా చిత్రీకరణ జరుగుతోంది. వచ్చే నెల 14న విడుదల కానుంది. జోయ అక్తర్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను ఫర్హాన్ అక్తర్ నిర్మిస్తున్నారు. అలియా భట్ కథానాయిక. ఈ సినిమాపై భారీ అంచనాలే ఉన్నాయి. ఇక అజయ్ దేవగన్ చేస్తోన్న 'టోటల్ ధమాల్' చిత్రం భారీ స్థాయిలోనే నిర్మిస్తున్నారు. ఇంద్ర కుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో భారీ సంఖ్యలో తారాగణం నటిస్తోంది. అందులో అజయ్ దేవగన్, అనిల్ కపూర్, మాధురి దీక్షిత్, ఇషా గుప్తా, నిహారికా రైజాద్, రితేష్ దేశ్‌ముఖ్, అర్శద్ వర్షి, జవేద్ జఫ్రే తదితరులు నటిస్తున్నారు. ఈ చిత్రం ఫిబ్రవరి 22న రానుంది.


ది యాక్సిడెంటల్ ప్రైమ్‌మినిస్టర్

అర్జున్ కపూర్, పరిణీతి చోప్రా హీరో హీరోయిన్లుగా నటిస్తోన్న 'సందీప్ ఔర్ పింకీ పరార్' చిత్రంలో మార్చి ఒకటో తేదీన ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇదొక రొమాంటిక్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతోంది. ఇందులో అర్జున్ కపూర్ పోలీస్ ఆఫీసర్‌గా చేస్తున్నాడు. ఇదే నెలలో 'డీడీ ప్యార్ డీ' కూడా విడుదల కాబోతుంది. అజయ్ దేవగన్ నటిస్తోన్నారు. నీ ప్రేమని నాకివ్వు అనే అర్థం వచ్చేలా ఈ టైటిల్‌ను పెట్టారు. రొమాంటిక్ కామెడీగా రూపొందుతోంది. రకుల్ ప్రీత్‌సింగ్ ఇందులో కథానాయిక.


గల్లీ బాయ్

బయోపిక్‌లో నటించడంలో ఎక్కువ ఆసక్తి చూపించే నటుడు అక్షయ్ కుమార్. ఈ ఏడాది కూడా ఆయనో హిస్టారికల్ ఘటనపై రూపొందుతోన్న సినిమాలో నటిస్తున్నాడు. ఆ చిత్రమే 'కేశరి'. ఈ సినిమా 21 మార్చిలో రాబోతుంది. ఇందులో పరిణీతి చోప్రా కథానాయిక. అనురాగ్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు. 1987ఆర్మీలో పనిచేసే సిక్కులు 22 మంది పదివేల ఆఫ్ఘనిస్తాన్ వారితో పోరాటం చేశారు. ఈ నేపథ్యంలో ఈ సినిమా రానుంది.

1983లో భారత దేశానికి మొదటి సారిగా క్రికెట్‌లో వరల్డ్ కప్ లభించింది. ఈ నేపథ్యంపై కూడా ఓ సినిమా రూపొందుతోంది. దాన్ని'1983 వరల్డ్ కప్' అనే టైటిల్‌తో రూపొందిస్తున్నారు. రణవీర్ సింగ్ ఆనాటి క్రికెట్ టీమ్‌కు సారథ్యం వహించిన కపిల్‌దేవ్‌గా నటిస్తున్నాడు. ఈ సినిమాను మే ఐదో తేదీన ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేలా షెడ్యూల్ ఖరారు చేశారు. అర్జున్ కపూర్ నటిస్తోన్న మరో సినిమా 'ఇండియాస్ మోస్ట్ వాంటెడ్'. మేలో ఈ సినిమా విడుదల చేయబోతున్నారు. గత ఏడాది మేలోనే ప్రారంభమైపోయింది.


ఈ ఏడాది రానున్న సల్మాన్ చిత్రం 'భరత్'. ఇందులో కత్రినా కైఫ్ కథానాయిక. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరగుతోంది. ప్రస్తుతం గోవాలో చిత్రీకరణ జరుగుతోంది. ఈ సినిమా షూటింగ్ మధ్యలో విలువ విద్యను ప్రాక్టీసు చేస్తున్నట్టు ఓ వీడియో కూడా ఆదివారం బయటకొచ్చింది. అలీ అబ్బాస్ జాఫర్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ చిత్రంలో టబు, దిశా పటాని, సునీల్ గ్రోవర్ వంటి వారు నటిస్తున్నారు. భారత దేశానికి , పాకిస్తాన్‌కి సంబంధించి ఓ నేపథ్యాన్ని ఈ సినిమా కథగా ఉంటుందని సమాచారం. ఈ చిత్రం రంజాన్‌కు రానుంది. తర్వాత గుడ్ న్యూస్, హౌస్‌ఫుల్ 4 చిత్రాలు కూడా విడుదల తేదీలను ప్రకటించాయి. ఈ ఏడాది చివరిలో రానున్న భారీ చిత్రాల్లో 'హౌస్‌ఫుల్ 4' ఉంటుంది. ఈ చిత్రంలో భారీ తారాగణం నటిస్తోంది. అక్షయ్ కుమార్, కృతి సనన్, రితేశ్ దేశ్‌ముఖ్, కృతి కర్బంద, బాబీ డియోల్, పూజా హెగ్డే, రానా దగ్గుబాటి వంటి తారలంగా భారీ సంఖ్యలో నటిస్తున్నారు. ఈ సినిమాపై భారీ అంచనాలే ఉన్నాయి.



సూపర్ 30

మరో చిత్రం సల్మాన్ ఖాన్‌ది. అదే 'దబాంగ్3' దబాంగ్ ప్రాంచైజీల్లో భాగంగా ఈ సినిమాను రూపొందిస్తున్నారు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనుల్లో ఉంది. ప్రభుదేవా దర్శకత్వం వహించనున్నారు. సల్మాన్ ఖాన్, సోనాక్షి సిన్హా హీరో హీరోయిన్లుగా నటించనున్నారు.

'జీరో' వందకోట్ల మార్కు దాటేనా?



షారుఖ్ ఖాన్ తాజాగా చేసిన చిత్రం 'జీరో'. మరుగుజ్జు వ్యక్తిలా ఇందులో నటించాడు. అనుష్క శర్మ, కత్రినా కైఫ్ హీరోయిన్లుగా చేశారు. పక్షవాతంతో బాధపడుతున్న సైంటిస్టుగా అనుష్క, సెలబ్రిటీగా కత్రినా చేసింది. డిసెంబర్ 21న విడుదలైంది. భారీ అంచనా మధ్య థియేటర్లకు తీసుకొచ్చారు. ఈ సినిమా అనుకున్నంతగా బాక్సాఫీస్ వద్ద కాసులు కురిపించలేకపోతుంది. ఆనంద్ ఎల్ రాయ్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం వంద కోట్ల మార్కును దాటడానికి తంటాలు పడుతుంది. సినిమా విడుదలై రెండు వారాలైనా ఆ మార్కును చేరుకోలేకపోతుంది. బాలీవుడ్ హంగామా ప్రకారం ఈ చిత్రం ఇప్పటి వరకూ 88 కోట్లు కలెక్ట్ చేసింది. అదీ మొదటి వారమే రూ.82 కోట్లు దాటింది. కానీ రెండో వారం మాత్రం కేవలం ఆరు కోట్లే రావడం విశేషం. కానీ రణవీర్ సింగ్ చేసిన 'సింబా' కాసులు కురిపిస్తోంది. మూడు రోజుల్లో వందకోట్లను దాటేసింది. ఇది తెలుగు 'టెంపర్' రీమేక్ చిత్రం. ఈ చిత్రం విడుదల కాకముందు 'జీరో'కి అంతా ఇంతో ప్రేక్షకులు వచ్చే వారు. ఇప్పుడు ఆ సంఖ్య మరీ తగ్గిపోయింది.

మూడున్నరేళ్లు ఇబ్బందులు పడ్డా


రణవీర్ సింగ్

బాలీవుడ్‌లో సక్సెస్‌ఫుల్ హీరోగా రాణిస్తున్న వారిలో రణవీర్ సింగ్ ఒకరు. ట్రెండ్‌కు తగ్గట్టు ఫాలో అవడంలో అతనికి మించిన వారు లేరు. తాజా దీపికా పదుకొనేను వివాహం చేసుకున్న తర్వాత సినిమాలు చేయడం మరింత పెంచాడు. స్టార్ కావడానికి ముందు ఈయన కూడా ఇబ్బందులు పడ్డాడట. ఆ విషయాన్ని రణవీర్ తాజాగా వెల్లడించాడు. ఆయన చిత్రం 'సింబా' విడుదలైన సందర్భంగా మాట్లాడారు. "నేను ఎదుర్కొన్న పరిస్థితులే నన్ను ఇలా తయారు చేశాయి. నాకు నేనుగా ఇలా ఉండాలి. అలా ఉండాలని అని అనుకోలేదు. సుమారుగా మూడున్నరేళ్ల పాటు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొన్నా. ఈ రోజు నాకు అవకాశాలు వస్తున్నాయి. నాకు ఛాన్స్‌లు ఇస్తున్నవారిని నేను ఎప్పుడూ గౌరవిస్తా. నేను ఎప్పుడూ ఆ విషయాన్ని మరిచిపోను. మిడిల్ పాత్‌ను అడాప్ట్ చేసుకోవడానికి ప్రయత్నిస్తా. విజయాలు వస్తే సంబరిపడిపోను. వైఫల్యాలు వస్తే నిరాశ పడను. విజయం వస్తే ఆనందిస్తా. అలా చేయాల్సిందే. సినిమా అనేది అనేకమంది కష్టం. అది వైఫల్యం చెందిందంటే ఒక్కరి వల్ల కాదు. అదొక ఉమ్మడి వైఫల్యం" అని చెప్పారు.

రణవీర్ సింగ్ తన తోటి నటి అలియా భట్‌ను తెగ పొగిడేస్తున్నాడు. వీరిద్దరూ కలసి ప్రస్తుతం 'గల్లీ బాయ్' చిత్రంలో నటిస్తున్నారు. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో రణవీర్ మాట్లాడుతూ "ఈ సినిమాకు పనిచేయకముందు అలియాతో కలసి కొన్ని ప్రకటనలు చేశాను. చాలా ఫన్‌గా అనిపించింది. ఆమె చాలా ఎనర్జిటిక్‌గా ఉంటుంది. కానీ 'గల్లీబాయ్' కోసం మేమిద్దరం కలిసి పని చేసినప్పుడు ఆమెలో అద్భుతమైన నటనా శక్తి ఉందని అర్థమైంది. విపరీతమైన ప్రతిభ, నటన, పూర్తి స్థాయి భావోద్వేగం, చాలా తెలివైంది కూడా. నటనలోనూ, తెలివితేటల్లోనూ ఆమె చాలా ఉన్నతంగా ఉంది" అని చెప్పారు రణవీర్.

చందనసీమలో ముగిసిన ఐటీ దాడులు


యశ్, రాజ్‌కుమార్, సుదీప్

సక్రమంగా పన్ను చెల్లించలేదని ఆదాయ పన్ను శాఖ అధికారులు చందన చిత్రసీమపై దాడులు నిర్వహించారు. శనివారం తెల్లవారుజాము వరకూ ఈ దాడులు కొనసాగాయి. మొత్తంగా చూస్తే 180 మంది అధికారులు పాల్గొన్నారు. ఈ దాడులన్నీ సినిమా నిర్మాణ సంస్థలు, నిర్మాతలు, సినిమా ఫైనాన్షియర్లు, నటులను ప్రధానం టార్గెట్ చేసినట్టు తెలుస్తోంది. ఈ దాడుల్లో మొత్తం రూ. 11 కోట్లు ఆస్తులను, 2.85 కోట్ల డబ్బును సీజ్ చేశారు. 25. 3కిలో బంగారాన్ని ఆదాయపన్ను శాఖ స్వాధీనం చేసుకుంది. మొత్త 25 చోట్ల దాడుల చేశారు. 'కేజీఎఫ్' హీరో యశ్, పునీత్ రాజ్‌కుమార్, అతని సోదరులు శివరాజ్‌కుమార్, సుదీప్, నిర్మాత రాక్‌లైన్ వెంకటేశ్, విజయ్ కిరిగందర్ ఇళ్లపై దాడులు చేశారు. దాడుల్లో ముంబయి, ఢిల్లీల నుంచి వచ్చిన అధికారులతో స్థానిక సిబ్బంది పాల్గొన్నారు. తమ నివాసాలపై, చెన్నై, బెంగళూరుల్లోని ఫార్మ్ హౌస్‌లపై గతంలోనూ ఓమారు ఆదాయ పన్ను శాఖ అధికారులు దాడులు చేశారని తనను కలుసుకున్న విలేకరులకు శివరాజ్ కుమార్ గుర్తు చేశారు. తాను ఒక్కో చిత్రానికి తీసుకునే పారితోషికం, తన ప్రొడక్షన్ హౌస్, వ్యవసాయ ఆదాయం, బ్యాంకు లావాదేవీలు, ఆభరణాల కొనుగోలు, ఇతర పెట్టుబడుల గురించి 33 గంటల పాటు అధికారులు విచారించినట్లు చెప్పారు. వారికి వివరణ ఇచ్చేందుకు ఎటువంటి ఇబ్బందీ పడలేదని స్పష్టం చేశారు. దాడులు జరిగిన సమయంలో కొంత బాధగా ఉంటుంది.. బాధ్యతాయుత పౌరునిగా వారికి అన్ని విధాలుగా సహకరించానని చెప్పారు. తన నివాసం పెద్దది కావడంతో ఎక్కువ సమయం గాలింపు చేపట్టారని పేర్కొన్నారు. గత ఎన్నికల్లో జనతాదళ్ తరపున నా భార్య గీత పోటీ చేసిన నేపథ్యంలో ఆమెతోనే ఎక్కువ సమయం అధికారులు మాట్లాడారని వివరించారు. సుదీప్ నివాసంలో అధికారులు 35 గంటల పాటు సోదాలు నిర్వహించారు. మరోమారు తమ ముందు విచారణకు హాజరు కావాలని వారు నోటీసులు ఇచ్చారని సుదీప్ వెల్లడించారు. యశ్, ఆయన భార్య రాధికా పండిట్‌లకు వచ్చిన బహుమతుల గురించి అధికారులు ఆరా తీశారు. నిర్మాతలు రాక్‌లైన్ వెంకటేశ్, విజయ్ కిరంగదూరు, జయణ్ణ నివాసాల్లో శనివారం ఉదయం 9 గంటల వరకు సోదాలు నిర్వహించారు. గత 50 గంటలుగా నిలిపి వేసిన మొబైల్ ఫోన్లను తిరిగి ఆన్ చేసుకునేందుకు రాక్‌లైన్ వెంకటేశ్ కుటుంబ సభ్యులకు అధికారులు అనుమతించారు. వారి నుంచి పలు దస్త్రాలను స్వాధీపరచుకున్నారు. తాము పిలిచిన సమయంలో విచారణకు హాజరు కావాలని అధికారులు తాఖీదులు జారీ చేశారు.నిర్మాత రాక్‌లైన్ వెంకటేశ్ నివాసంలో శనివారం మధ్యాహ్నం తరువాత మళ్లీ అధికారులు సోదాలు నిర్వహించారు.

హాలీవుడ్‌లో మీటూ మార్పు తెచ్చింది


మార్గో రోబీ

'మీటూ' ఉద్యమంతో హాలీవుడ్ చిత్రసీమలో మార్పు వచ్చిందని పేర్కొంది నటి మార్గో రోబీ. ఇందులో తన చిత్రమే సాక్ష్యమని చెప్పింది. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడింది. "ఇప్పుడు నేను దర్శకత్వం వహించిన చిత్రానికి ప్రమోషన్ చేస్తున్నాను. ఇటీవల ఈ సినిమా చిత్రీకరణ పూర్తి చేసుకుంది. ఈ చిత్రానికి ముఖ్యమైన 24 క్రాఫ్ట్‌లోనూ మహిళలే పని చేశారు. మహిళల ఆధ్వర్యంలోనే ఈ సినిమా తెరకెక్కడం చాలా సంతోషంగా ఉంది. ఇది కాకుండా మరో సినిమా కేవలం మహిళతోనే పనిచేసేలా ప్లాన్ చేస్తున్నా. అదీ కూడా భారీ బడ్జెట్‌లో ఆ సినిమా ఉండబోతుంది. ఇటీవల కొన్ని సంఘటనలను గమనించాక నాకు అనిపించింది ఏమిటంటే...మీటూ ఉద్యమం ఓ పెనుఉప్పెనలా నడిచింది. ఇది హాలీవుడ్ చిత్రసీమలో సానుకూల మార్పును తీసుకొచ్చింది. మహిళలకు సమాన అవకాశాలూ వస్తున్నాయి..పని ప్రదేశాల్లో వేధింపులు కూడా తగ్గాయి" అని చెప్పింది.

అందరూ ఆనందించేలా ఉంటాయి – అలియా భట్

తన చిత్రాలు అన్ని తరగతుల ప్రేక్షకులు ఆనందించేలా ఉంటాయని బాలీవుడ్ నటి అలియా భట్ చెప్పింది. గత ఏడాది ఈమె 'రాజీ'లో అద్భుతమైన నటనను ప్రదర్శించింది. ఆమె రణవీర్‌తో నటిస్తున్న 'గల్లీ బాయ్' విడుదల కానుంది. దీంతో రణబీర్ హీరోగా చేస్తున్న 'బ్రహ్మాస్త్ర'లోనూ నటిస్తుంది. ఇది కూడా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. ఈ నటి ఇటీవల నిక్‌లోడీయెన్ కిడ్స్ ఛాయిస్ అవార్డులో భాగంగా ఫేవరెట్ మూవీ యాక్టర్ అవార్డు సొంతం చేసుకుంది. ఈ సందర్భంగా మాట్లాడుతూ "నేను చిన్న పిల్లల సినిమాలను ప్రేమిస్తా. అటువంటి సినిమా చేసే అవకాశం వస్తే తప్పకుండా చేస్తా. నన్ను పిల్లలు కనెక్ట్ అవుతారని అనుకుంటూ ఉంటా. అయితే పిల్లల సినిమాలు కాకుండా వేరే ప్రాజెక్టులు ఇప్పుడు చేస్తున్నా. అన్ని గ్రూపులు వారు నా చిత్రాలను ఆనందిస్తారని అనుకుంటున్నా" అని చెప్పింది అలియా.

పిల్లలు 'బ్రహ్మాస్త్ర'ను పిల్లలు ఎలా ఇష్టపడతారన్న ప్రశ్నకు ఆమె బదులిస్తూ... ' ఈ సినిమా అన్ని వయసుల వారూ చూడదగిన చిత్రం. చిన్నారులకైతే మరింత ఆసక్తిగా ఉంటుంది. ఈ సినిమా ఫలితంపై చాలా ఆతృతగా ఎదురు చూస్తున్నా. ఈ సినిమా కోసం మేమంతా చాలా కష్టపడ్డాం"అని తెలిపింది.



అలియా భట్



ఇప్పుడు సొంతిల్లు కల నెరవేర్చుకునే విషయంలో చాలామంది బ్యాంకు ఆశ్రయిస్తున్నారు. ఇందులో ధనికవర్గాలు మొదలుకుని, మధ్యతరగతి ప్రజలూ బ్యాంకుల ద్వారా గృహరుణాలు పొందడానికి అనేక అవకాశాలు తలుపు తడుతున్నాయి. అయితే, రుణం తీసుకునేముందు మన సామర్థ్యాన్నిబట్టి ఎంత రుణం రావొచ్చు? బ్యాంకులు, రుణ సంస్థలు మనల్ని ఎలా అంచనా వేస్తాయి? మన బ్యాంకుకు అర్జీగా పెట్టే దరఖాస్తులను ఎలా పరిశీలిస్తాయి ? ఇలా అనేక విషయాలపై అవగాహన ఉంటేనే.. 'గృహరుణ' గ్రహీతలు కాగలం. లేదంటే.. బ్యాంకులు రుణాలు ఇవ్వడానికి నిరాకరించే ప్రమాదం ఉంది. అలాంటి ప్రమాదానికి ముఖ్యమైన కారణాల్లో 'సిబిల్ స్కోర్' స్థితి కూడా ఒకటి. అందుకే, గృహరుణాలపై ఆసక్తి ఉన్నవారు కచ్చితంగా సిబిల్‌స్కోర్ పట్ల అవగాహన ఉండాలి. అందుకు కావాల్సిన ముందస్తు వ్యూహరచన చేయాలి. ఎలాంటి ఇబ్బందీ లేకుండా గృహరుణాలు పొందేందుకు అనుసరించాల్సిన అంశాలపై ఈ వారం 'రూపాయి'లో చర్చిద్దాం!!

సొంత ఇంటి కల నెరవేరును ఇలా!

వ్యక్తిగత రుణం, బైకు, కారు, టీవి, ఏసి, ఎడ్యుకేషనల్ లోన్ వంటి రుణాలకు మాత్రమే క్రెడిట్ స్కోర్ ప్రామాణికం, కానీ ఇంటి రుణాలకు సిబిల్‌స్కోర్‌తో పెద్దగా పట్టింపు ఉండదనుకుంటారు చాలామంది. కానీ, ఆర్థికసంస్థల నుంచి ఎలాంటి రుణం కావాలన్నా.. వ్యక్తిగత సిబిల్ స్కోర్ స్థితిపైనే రుణం ఇవ్వడం, ఇవ్వకపోవడం అనేది ఆధారపడి ఉంటుందనేది చాలామందికి తెలియదు. ఇందులో గృహరుణాలూ ఏమాత్రం మినహాయింపు కాదు. రుణం తీసుకునే ఇంటికి సంబంధించిన పత్రాలను.. బ్యాంకులు గ్యారంటీగా తనఖా రూపంలో పెట్టుకుంటారు కనుక.. రుణం ఇవ్వడానికి ఎలాంటి అభ్యంతరాలూ ఉండవనే తర్కం కూడా ఖాతాదారుల్లో ఉంటుంది. కానీ అది అవాస్తవం. రుణం చిన్నదైనా.. పెద్దదైనా.. రూపం ఏదైనా క్రెడిట్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఇచ్చే క్రెడిట్ స్కోర్‌పైనే ఆధారపడి ఉంటుంది.




ముందస్తు వ్యూహం

ఇల్లు అలకగానే పండగ కాదు.. అనేది లోకోక్తి. నిజమే.. ఇంటి రుణాల విషయంలోనూ దీన్ని అన్వయించుకోవచ్చు. ఎందుకంటే.. సొంతిల్లు అనేది ప్రతి ఒక్కరి కల. అయితే ఆ కల కలగానే మిగిలిపోకుండా ఉండాలంటే.. అందుకు ముందుగానే ఆయుధ సామగ్రిని సేకరించాలి. బలోపేతం కావాలి. అంటే, తీసుకునే రుణం చెల్లింపు సామర్థ్యం నుంచి ఆర్థికసంస్థలతో సానుకూలమైన లావాదేవీల నిర్వహణ అలాగే ఇంటి స్థలం, పత్రాలు, న్యాయపరమైన అంశాలు అన్నీ సజావుగా ఉండేలా జాగ్రత్తపడాలి. అలాంటి ముఖ్యమైన విషయాలేంటో తెలుసుకుందాం!

సరైన పత్రాలు

రుణాన్ని ఇచ్చేముందు సంస్థలు ముందుగా పరిశీలించేది మనం కొనాలనుకుంటున్న ఇంటికి సంబంధించిన పత్రాల్ని. ఎంపిక చేసుకున్న ఇల్లు అన్ని అనుమతులకూ లోబడి నిర్మించారా? లేదా? అనే దానితోపాటు, ఇతర అంశాలనూ పరిశీలిస్తాయి. ఇవన్నీ సరిచూసుకున్నాక, బ్యాంకులకు ఎలాంటి అభ్యంతరం లేకపోతే.. అప్పుడు ఆదాయానికి సంబంధించిన ఆధారాలను పరిశీలిస్తారు. దీనికోసం కనీసం 6 నెలల వేతనం వివరాలు, గత మూడేళ్ల ఆదాయపు పన్ను రిటర్నులు అవసరం అవుతాయి. ఇతర పత్రాలు అంటే పుట్టిన తేదీ ధ్రువీకరణ, ప్రస్తుత చిరునామా, శాశ్వత చిరునామా, పాన్ కార్డు, బ్యాంకు ఖాతా వివరాల్లాంటివీ అవసరం. రుణం తీసుకోబోయే ఈ పత్రాలకు సంబంధించి పట్టికలాంటిది తయారుచేసుకొని అందులో ఒక్కోదాన్నీ సరిచూసుకోవాలి. అన్ని పత్రాలనూ ముందే సిద్ధం చేసుకోవడం వల్ల చివరి నిమిషంలో హడావుడి తప్పుతుంది.



గత రుణాల చరిత్ర.. కీలకమే

ఈ రోజుల్లో వాహన, వ్యక్తిగత రుణాల్లాంటివి తీసుకోవడం సర్వసాధారణం. గృహరుణం తీసుకునేప్పుడు అలాంటివి ఏమైనా ఉంటే బ్యాంకుకు తెలియజేయాలి. అలాంటి రుణాలకు నెలకు ఎంత మొత్తం నెలసరి వాయిదాలు చెల్లిస్తున్నారో అనే సంగతి గృహరుణ దరఖాస్తు పత్రంలో ముందుగానే పేర్కొంటే మంచిది. ప్రాథమికంగా మనం ఇచ్చే సమాచారాన్నిబట్టే సదరు వ్యక్తికి ఎంత వరకు రుణం ఇవ్వొచ్చు అనే విషయంలో బ్యాంకులు ఒక అంచనాకు వస్తాయి.

ఆదాయం-అప్పులు

కొత్తగా రుణం రావాలంటే.. మంచి క్రెడిట్ స్కోరు, రుణ చరిత్ర, ఆదాయం అన్నీ సరిగ్గా ఉండాలి. అంతమాత్రాన రుణం కచ్చితంగా వస్తుందనీ చెప్పలేం. ఆదాయంతో పోలిస్తే.. అప్పులు తక్కువగా ఉండాలి. అప్పుడే అనుకున్న రుణం దొరకుతుంది. రుణాలు, క్రెడిట్ కార్డులు ఇచ్చేటప్పుడు బ్యాంకులు రుణ చరిత్ర, క్రెడిట్ స్కోరును క్షుణ్ణంగా గమనిస్తాయి. ఆ విషయాలనే పరిగణనలోకి తీసుకుంటాయి. రుణ చెల్లింపులో క్రమశిక్షణ ఉన్న ఖాతాదారులకు ఎలాంటి అభ్యంతరాలూ పెట్టకుండా బ్యాంకులు సులభంగా అప్పులు ఇస్తుంటాయి. ఎంత ఎక్కువ స్కోరు ఉంటే.. రుణం వచ్చే అవకాశాలు అంత బాగుంటాయి. ఇక్కడ గుర్తుంచు కోవాల్సిన మరో అంశం ఏమిటంటే.. అప్పు ఇవ్వాలా వద్దా అనేది పూర్తిగా బ్యాంకు విచక్షణ మీద ఆధారపడి ఉంటుంది. కేవలం సిబిల్ స్కోరు ఒక్కటే ఆధారంగా చేసుకొని, బ్యాంకు అప్పు ఇవ్వాలా వద్దా అనేది నిర్ణయించదు..




మెరుగైన సిబిల్‌స్కోర్ కోసం

రుణం తీసుకోవాలనుకున్నప్పుడు.. సిబిల్ స్కోరు, రుణ చరిత్ర మెరుగ్గా ఉండేలా చూసుకోవాల్సిన అవసరం ఉంది. ఇప్పటికే తీసుకున్న రుణాలకు సంబంధించిన ఈఎంఐలను (నెలసరి రుణ చెల్లింపులు), క్రెడిట్ కార్డు బిల్లులను సకాలంలో చెల్లించడం ఎప్పుడూ మర్చిపోకూడదు. బిల్లులు సరిగ్గా చెల్లించకపోతే.. క్రెడిట్ స్కోరు తగ్గిపోతుంది. ఇది చివరకు అవసరం అయినప్పుడు రుణం రాకుండా చేస్తుంది. గృహరుణం తీసుకోవాలనే ఆలోచన వచ్చిన తర్వాత, సొంతంగా సిబిల్ ట్రాన్స్ యూనియన్ స్కోరు, రుణ చరిత్రను సొంతంగా తెప్పించుకోవడం మంచిది. దీనివల్ల రుణ చరిత్ర నివేదికలో ఏమైనా తప్పులు దొర్లితే వాటిని సరిచేసుకునేందుకు వీలవుతుంది.

\- వి. చైతన్య

మెరుగైన స్కోర్‌కు మార్గాలు

క్రెడిట్ కార్డ్స్ వల్ల లాభం, నష్టాలను పక్కనపెడితే.. క్రెడిట్ కార్డ్స్ నిర్వహణా సిబిల్ స్కోర్ మెరుగ్గా ఉండేందుకు దోహదపడతాయి. అయితే కార్డులను సరైన రీతిలో వినియోగిస్తూ ఎప్పటికప్పుడు చెల్లింపులు, వాయిదాలు సజావుగా సాగితేనే ఆయా కార్డుల వల్ల మేలు జరుగుతుంది. క్రెడిట్ కార్డ్ బిల్లులు, చెల్లింపుల పట్ల తగిన జాగ్రత్తలు తీసుకుంటే మెరుగైన క్రెడిట్‌స్కోర్ రాబట్టవచ్చు.



గోల్డ్, సిల్వర్, టైటానియం, ప్లాటినం.. ప్రధానంగా వివిధ బ్యాంకులు అందించే క్రెడిట్‌కార్డు రకాలు. వీటిలో ఏది ఎంచుకోవాలన్నది.. మన చెల్లింపు సామర్థ్యం, అవసరాలు, ఖర్చుచేసే పద్ధతిని బట్టే ఆధారపడి ఉంటుంది. బిల్లు చెల్లించడానికి 45-55 రోజుల వరకూ సమయం ఉంటుంది. అంటే ఈ వ్యవధిలోపు బిల్లు మొత్తం చెల్లిస్తే ఎలాంటి వడ్డీ విధించరు. మొత్తం బిల్లు కాకుండా, కనీస మొత్తం చెల్లిస్తే.. మిగిలిన బాకీపై నెలకు 2.9 శాతం నుంచి 3.5 శాతం వరకు వడ్డీ విధిస్తారు.

కార్డు బిల్లుల చెల్లింపునకు ఎలక్ట్రానిక్ క్లియర్ సిస్టమ్ (ఈసీఎస్) ను వాడుకోవచ్చు. దీనివల్ల గడువు తేదీ రాగానే క్రెడిట్‌కార్డు సంస్థలు మీ బ్యాంకు ఖాతాలోంచి సొమ్మును తీసుకుంటాయి. ఫలితంగా చెల్లింపుల్లో ఆలస్యం వంటి సమస్యలు ఉత్పన్నం కావు. క్రెడిట్‌కార్డు ఉపయోగించి ఏటీఎంల నుంచి నగదు తీసుకోవచ్చు. మరే మార్గం లేనప్పుడు మాత్రమే ఈ సౌకర్యాన్ని వినియోగించుకోండి. కార్డుతో తీసుకునే నగదుపై ఏడాదికి 36 నుంచి 49 శాతం వడ్డీ కట్టాల్సి వస్తుంది. బకాయి పడితే రెండేళ్లలోనే బాకీ రెట్టింపు అవుతుందని గుర్తుంచుకోండి. మీరు వేర్వేరు బ్యాంకులకు చెందిన రెండు కార్డులు వాడుతున్నారా? అయితే.. ఒక కార్డుపై కట్టాల్సిన బాకీని, తక్కువ వడ్డీరేటు ఉండే మరో కార్డుకు బదిలీ చేసుకోండి. రెండోకార్డుపై వడ్డీ లేని నిర్ణీత కాల వ్యవధిని వినియోగించుకోండి. బ్యాంకులు క్రెడిట్‌కార్డుల చెల్లింపుల్లోనూ ఈఎంఐ విధానాన్ని అందిస్తున్నాయి. కనీస మొత్తం చెల్లించడంకన్నా ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవడం మంచిది.





చిన్నారి

పొడుపు కథ

బక్క బాబుకి
బారెడు చొక్కా
విప్పేవారే కాని
వేసేవారు లేరు



జవాబు : శ్లేట

జోక్:

రాము : చాక్లెట్ లు పంచుతున్నావు ఈరోజు నీ పుట్టినరోజా?

సోము : కాదు, మా అమ్మ ఐదు సంవత్సరాలుగా చూస్తున్న సీరియల్ ఈ రోజుతో అయిపోయింది. ఇక నేను కార్టూన్ ఛానల్ చూడొచ్చు ..

నీడ కనిపెట్టండి!



పిల్లలూ! ఈ చిత్రంలోని మేకపిల్ల ..
సరైన నీడ ఏదో కనిపెట్టండి!

సెల్ ఫోన్



సెల్ ఫోన్ వచ్చింది
మనిషిని బానిస చేసింది
చెవిలో గోల చేస్తుంది
చేతిలో సదా ఉంటుంది
హలో హలో అంటుంది
చెప్పినవన్నీ వింటుంది
అడిగినవన్నీ చూపిస్తుంది
నరకం వైపు నడిస్తుంది
కాలం వృధా చేయిస్తుంది
కాని వాటిని నేర్పిస్తుంది
చెవి పోటును తెస్తుంది
కంటికి కీడు కల్గిస్తుంది
ప్రాణ హాని కల్పిస్తుంది
బాలల భవితను హరిస్తుంది
నిద్ర భంగం అవుతుంది
ఆరోగ్యం పాడవుతుంది
తగు మాత్రమే ముద్దు
అది అందరి హద్దు



సి. అనిత
4వ,తరగతి
ప్రాథమిక పాఠశాల
మెయిన్,
హెచ్.మురవణి,
కర్నూలు జిల్లా


నేను గీసిన బొమ్మ



ఎం. దివ్య,
8వ తరగతి,
జెడ్.పి.హై స్కూల్,
కాణిపాకం,
చిత్తూరు జిల్లా.



రంగులు వేయండి!



పిల్లలూ!
పక్కనున్న చిత్రంలో మీకు
ఎంతో ఇష్టమైన బొమ్మ
ఉంది కదా?
దానికి చక్కని రంగులు
వేయండి!

పిల్లల్లారా.. రారండి!!

కథలు, కవితలు, మీరు గీసిన బొమ్మలు, చూసిన ప్రదేశాలు, కనిపెట్టిన సైన్సు సంగతుల గురించి రాసి మీపేరు, ఫొటోతో పంపవల్సిన మా చిరునామా :

చిన్నారి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇ మెయిల్ - Chinnaarips@gmail.com

అదిరే ఆరంభం



- ఆసియా కప్‌లో భారత్ రికార్డు గెలుపు
- తొలి మ్యాచ్‌లో థాయిలాండ్‌పై 4-1తో ఘనవిజయం

అబుదాబి: ఆసియా ఫుట్‌బాల్ (ఎఎఫ్‌సీ) కప్‌లో భారత్ తన పోరాటాన్ని ఘనం ఆరంభించింది. ఈ టోర్నిలో భారత్ తన తొలి మ్యాచ్‌లో థాయ్‌లాండ్‌ను 4-1తో చిత్తు చిత్తు చేసింది. ఈ విజయంలో భారత కెప్టెన్ సునీల్ చెత్రీ రెండు గోల్స్‌తో కీలక పాత్ర పోషించాడు. ఆదివారం గ్రూప్ ఏ మ్యాచ్‌లో భాగంగా భారత్-థాయ్‌లాండ్ మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్‌లో తొలి గోల్ చేసి భారత్ ఆధిక్యంలో దూసుకెళ్లింది. 27వ నిమిషంలో పెనాల్టీ కార్నర్‌ను భారత కెప్టెన్ సునీల్ ఛెత్రీ గోల్‌గా మలిచాడు. అయితే తరువాత 33వ నిమిషంలో థాయిలాండ్ గోల్ చేసి స్కోరును సమం చేసింది. ఈ తరువాత ఇరు జట్లు హోరాహోరీ తలపడ్డంతో మ్యాచ్ తొలి అర్ధ భాగం ముగిసే సరికి 1-1 గోల్స్‌తో స్కోరు సమంగా నిలిచింది. అయితే రెండో అర్ధభాగంలో భారత్ ఆటగాళ్లు విజృంభించారు. ఏకంగా మూడు గోల్స్ సాధించారు. 47వ నిమిషంలో కెప్టెన్ ఛెత్రీ మరో గోల్ సాధించాగ, 68వ నిమిషంలో థప, 80వ నిమిషంలో జెజె గోల్స్ చేశారు. భారత్ జోరును థాయిలాండ్ అడ్డుకోలేక పోయింది. దీంతో ఏక పక్షంగా ఈ మ్యాచ్‌ను భారత్ ముగించింది. ఆసియా కప్ చరిత్రలో భారత్‌కు ఇది భారీ గెలుపు. 1964లో హాంకాంగ్‌పై 3-1తో గెలుపు తరువాత ఈ కప్‌లో భారత్ భారీ తేడా తో గెలవడం ఇదే మొదటిసారి. ఈ విజయంతో భారత్ మూడు పాయింట్లతో గ్రూప్-లో అగ్రస్థానంలో నిలిచింది. ఈ నెల 10న యూఏఈతో భారత్ తలపడుతుంది. కాగా, థాయిలాండ్‌తో భారత్ ఇప్పటివరకూ 25 సార్లు తలపడగా.. భారత్‌కు ఇది 6 విజయం కావడం విశేషం. థాయ్‌లాండ్ 12సార్లు గెలుపొందగా, మిగిలిన 7 మ్యాచ్‌లు డ్రాగా ముగిసాయి. గత రికార్డును పట్టించుకోకుండా థాయ్‌లాండ్‌పై భారత్ ఘన విజయం సాధించడంపై ప్రశంసలు కురిస్తున్నాయి.

ఆస్ట్రేలియాకు షాక్

ఆసియా ఫుట్‌బాల్ కప్‌లో ఢిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియాకు షాక్ తగిలింది. ఆదివారం గ్రూప్-బిలో జరిగిన మ్యాచ్‌లో ఆస్ట్రేలియాపై జోర్డాన్ 1-0తో సంచలన విజయం సాధించింది. దీంతో ఈ టోర్నిలో నిలవాలంటే ఆస్ట్రేలియా పాలస్తీనా మ్యాచ్‌లో తప్పనిసరిగా విజయం సాధించింది. కాగా, ఆదివారం గ్రూప్-లో జరిగిన మరో మ్యాచ్‌లో బహ్రెయిన్ జట్టును 1-1తో ఆతిథ్య యుఏఈ జట్టు నిలువరించింది.

మెస్సీని దాటిన ఛెత్రీ

ఆదివారం థాయ్‌లాండ్ మ్యాచ్‌లో భారత కెప్టెన్ సునీల్ ఛెత్రీ రెండు గోల్స్ చేయడంతో అతని అంతర్జాతీయ గోల్స్ సంఖ్య 67కు చేరుకుంది. దీంతో అత్యధిక గోల్స్ చేసిన ప్రస్తుతం ఫుట్‌బాల్ ఆడుతున్న ఆటగాళ్ల జాబితాలో రెండో స్థానానికి ఛెత్రీ చేరుకున్నాడు. 34 ఏళ్ల ఛెత్రీ 105 మ్యాచ్‌ల్లో ఈ ఘనత సాధించాడు. ఇప్పటి వరకూ ఈ జాబితాలో అర్జెంటీనా ఆటగాడు లియోనెల్ మెస్సీ (65 గోల్స్)తో కలిసి ఛెత్రీ ఉండేవాడు. ఈ జాబితాలో పోర్చుగల్ సంచలనం క్రిస్టియానో రోనాల్డో (85 గోల్స్) అగ్రస్థానంలో ఉన్నాడు.

నేటి నుంచి జాతీయ బ్యాడ్మింటస్ పోటీలు

ప్రజాశక్తి - నెల్లూరు
నెల్లూరు నగరంలో 64వ జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ క్రీడా పోటీలు సోమవారం నుంచి జరగనున్నాయి. ఈనెల 11వ తేదీ వరకు ఈ పోటీలు జరుగుతాయి. దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి, ఏడు కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన క్రీడాకారులు హాజరవుతారు. సుమారు 15 వందల మంది క్రీడాకారులు, 150 మంది కోచ్ మేనేజర్లు, క్వాలిఫైడ్ న్యాయ నిర్ణేతలుగా పాల్గొంటారు. అండర్ 14, 17, 19 విభాగాలకు వేర్వేరుగా పోటీలు జరుగుతాయి. విఆర్ కళాశాలలో బాలుర కు, ఎసి సుబ్బారెడ్డి స్టేడియంలో బాలికలకు ఈ పోటీలు నిర్వహిస్తారు. వారికి వసతి, తాగునీరు, మరుగు దొడ్ల సౌకర్యం కల్పించారు. ఈ సందర్భం గా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు ఒక ప్రకటన విడుదల చేశారు.

ఎపి జట్టుకు మంత్రి సోమిరెడ్డి అభినందన

జాతీయ స్థాయి పోటీలు ప్రారంభం కానున్న దృష్ట్యా ఆంధ్ర జట్టును మంత్రి సోమిరెడ్డి అభినందించారు. తన నివాసానికి ఆ జట్టును పిలిపించుకుని గతేడాదిలా మళ్లీ ఈ ఏడాది ఈ జట్టు గెలవాలని ఆకాంక్షించారు.

సఫారీలదే టెస్టు సిరీస్

కేప్‌టౌన్: పాకిస్తాన్‌తో జరిగిన రెండో టెస్టులోనూ దక్షిణాఫ్రికా క్రికెట్ జట్టు ఘన విజయం సాధించింది. రెండో టెస్టులో పాకిస్తాన్ విధించిన 41 పరుగుల లక్ష్యాన్ని దక్షిణాఫ్రికా కేవలం ఒక్క వికెట్ మాత్రమే కోల్పోయి చేధించింది. 9 వికెట్ల తేడాతో విజయాన్ని అందుకుంది. దీంతో మూడు మ్యాచ్‌ల ఈ సిరీస్‌ను మరొక టెస్టు మిగిలి ఉండగానే దక్షిణాఫ్రికా 2-1తో దక్కించుకుంది. ఈ సిరీస్‌లో మూడో టెస్టు ఈ నెల 11న ప్రారంభం కానుంది.



ఫాలో ఆన్‌లో ఆసీస్

నాలుగో రోజున కేవలం 25.2 ఓవర్ల ఆట
తొలి ఇన్నింగ్స్‌లో 300కే ఆలౌట్

సిడ్నీ: ఆస్ట్రేలియా గడ్డపై చారిత్రక విజయానికి భారత క్రికెట్ జట్టు ఒక్క అడుగు దూరంలో ఉంది. ఇక్కడ జరుగుతున్న నాలుగో టెస్టులో ఆసీస్‌ను ఫాలోఆన్‌లోకి దింపిన భారత్ ఆ దేశంలో తొలిసారి టెస్టు సిరీస్‌ను గెలుచుకోవడం దిశగా ఉరకలు వేస్తోంది. ఇప్పటికే ఈ సిరీస్‌లో 2-1తో ఆధిక్యంలో ఉన్న కోహ్లిసేన ఈ చివరి టెస్టు కనీసం డ్రాగా ముగిసినా సిరీస్‌ను సొంతం చేసుకుంటుంది. దీంతో గతంలో దిగ్గజ భారత క్రికెటర్లకు అందని ఆసీస్ గడ్డపై టెస్ట్ సిరీస్ విజయాన్ని సాధించిన భారత క్రికెట్ జట్టుగా రికార్డు నెలకొల్పనుంది. కేవలం కొన్ని గంటల వ్యవధిలోనే ఈ కల సాకారం కానుంది.

నాలుగో టెస్టులో ఆస్ట్రేలియా తన తొలి ఇన్నింగ్స్‌లో భారత బౌలర్ల దాటికి విలవిలాడింది. 6 వికెట్ల నష్టానికి 236 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో ఆదివారం ఆటను ప్రారంభించిన ఆస్ట్రేలియా 300 పరుగులకే ఆలౌట్ అయింది. ఆదివారం ఆట వర్షం కారణంగా మూడు గంటల ఆలస్యంగా మొదలైంది. అయినా భారత బౌలర్లు సత్తా చాటారు.

వర్షం కారణంగా మ్యాచ్ మూడు గంటల ఆలస్యంగా ప్రారంభమైనప్పటికీ టీమిండియా బౌలర్లు మాత్రం పట్టుదల వదల్లేదు. మ్యాచ్ ప్రారంభమైన ఆరు ఓవర్లలో మూడు వికెట్లు పడగొట్టి ఆస్ట్రేలియా టెయిలెండర్లపై ఒత్తిడి పెంచారు. 85వ ఓవర్లో షమీ వేసిన బంతికి పాట్ కమిన్స్(25) బౌల్డ్ అయ్యాడు. తర్వాత హాండ్స్‌కాంబ్ (37)ను బుమ్రా బౌల్డ్ చేసి పెవిలియన్‌కు పంపాడు. ఆ తర్వాతి ఓవర్లోనే ఆసీస్ తొమ్మిదో వికెట్ కోల్పోయింది. 91వ ఓవర్లో కుల్‌దీప్ వేసిన బంతికి లైయన్ డకౌట్‌గా వెనుదిరిగాడు. అప్పటికి పైన్ సేన 258 పరుగులు చేసింది.

చివర్లో పోరాటం

తొమ్మిది వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడిన ఆసీస్‌కు టెయిలెండర్లు ఊతమిచ్చారు. వికెట్ కోల్పోకుండా నిలకడగా ఆడారు. 10 ఓవర్లలో వికెట్ కోల్పోకుండా 42 పరుగులు జోడించారు. క్రీజులోకి వచ్చిన తర్వాత రెండు సార్లు టీమిండియా బౌలర్ల చేతిలో తప్పించుకున్న హేజిల్‌వుడ్ ఈసారి కుల్‌దీప్ బుట్టలో పడ్డాడు. 105వ ఓవర్లో చైనామన్ వేసిన బంతిని అంచనా వేయలేకపోయిన హేజిల్‌వుడ్ (21).. ఎల్బీగా వెనుదిరిగాడు. దీంతో ఆసీస్ 300 పరుగులకే ఆలౌట్ అయింది. దీంతో నాలుగో రోజున తొలి ఇన్నింగ్స్‌లో 21.2 ఓవర్లు ఆడి 64 పరుగులు మాత్రమే జోడించి ఆసీస్ తొలి ఇన్నింగ్స్ ను ముగించింది. కుల్‌దీప్ యాదవ్ ఐదు వికెట్లు తీయగా, షమీ, జడేజా చెరో రెండు వికెట్లు తీశారు. బుమ్రా ఖాతాలో ఒక వికెట్ పడింది. ఆసీస్ 300కు ఆలౌట్ కావడంతో భారత్ 322 పరుగుల ఆధిక్యంలో ఉంది. దీంతో ఆసీస్‌ను భారత్ ఫాలో ఆన్‌కు ఆహ్వానించింది.

ఫాలో ఆన్‌లో ఆటకు అంతరాయం కలిగింది. రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆస్ట్రేలియా 4 ఓవర్లు ముగిసే సరికి వికెట్ నష్టపోకుండా 6 పరుగులు చేసింది. క్రీజులో ఉస్మాన్ ఖవాజా(4), హారిస్(2) ఉన్నారు. ఈ దశలో వెలుతురు లేమి కారణంగా మ్యాచ్‌ను నిలిపి వేస్తున్నట్లు అంపైర్లు ప్రకటించారు. ఆట ముగిసే సరికి భారత కంటే ఆసీస్ ఇంకా 316 పరుగులు వెనకబడి ఉంది. కాగా, ఇలా సొంతగడ్డపై ఆస్ట్రేలియా క్రికెట్ జట్టు ఫాలోఆన్ ఆడటం 31 ఏళ్ల తర్వాత ఇదే తొలిసారి. 1988లో సొంత గడ్డపై చివరిసారి ఇదే సిడ్నీ మైదానంలో ఇంగ్లండ్‌తో ఫాలో ఆన్ ఆడిన ఆసీస్ ఆ మ్యాచ్‌ను డ్రా చేసుకుంది. ఇక విదేశాల్లో 2005లో చివరగా ట్రెంట్ బ్రిడ్జ్ వేదికగా ఇంగ్లండ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఫాలో ఆన్ ఆడిన ఆసీస్ ఆ టెస్టులో పరాజయం పాలైంది.

కుల్‌దీప్‌పై కోచ్ ప్రశంసలు

టీమిండియా బౌలర్ కుల్‌దీప్ యాదవ్‌పై జట్టు బౌలింగ్ కోచ్ భరత్ అరుణ్ ప్రశంసల జల్లు కురిపించారు. 'తాను నైపుణ్యమున్న బౌలరని కుల్‌దీప్ నిరూపించుకున్నాడు. కుల్‌దీప్ ఎంతో ప్రత్యేకం. అతడు గూగ్లీలు అద్భుతంగా విసురుతాడు. కుల్‌దీప్ క్రీజును ఉపయోగించుకొనే విధానం వినూత్నంగా ఉంటుంది. ఓవర్ ది వికెట్, రౌండ్ ది వికెట్ వేయగలడు. వికెట్లకు దూరంగా విసరగలడు. దగ్గరగా విసరగలడు' అని అన్నారు.

గ్రామాల్లోనూ జీప్లస్ త్రీ ఇళ్లు

- జన్మభూమిలో ఆదివారం పాల్గొన్న ఉద్యోగులకు మరో రోజు సెలవు
- మోడీది నిరంకుశపాలన: చంద్రబాబు

ప్రజాశక్తి - పెనమలూరు (విజయవాడ)
గ్రామీణ ప్రాంతాల్లోనూ స్థల కొరత ఉండడం వల్లే జీ ప్లస్ త్రీ ఇళ్లను నిర్మించనున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చెప్పారు. కృష్ణాజిల్లా కంకిపాడు మండలం పునాదిపాడులో ఆదివారం ఏర్పాటు చేసిన 'జన్మభూమి - మా ఊరు' సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సభలో చంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో 30 లక్షల ఇళ్ల నిర్మాణానికి నాంది పలికామని సిఎం చెప్పారు. ప్రజల అంగీకారంతో జి ప్లస్ త్రీ ఇళ్ల నిర్మాణానికి ప్రయత్నిస్తున్నామని చెప్పారు. పేదలకు నచ్చేలా సింగిల్ బెడ్‌రూమ్, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు నిర్మిస్తామన్నారు. ప్రతి ఒక్కరూ పనిచేసే ఆలోచనా విధానంతో ముందుకు వెళ్లాలన్నారు. జన్మభూమి సందర్భంగా ఆదివారం పనిచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంక్రాంతి సందర్భంగా మరో రోజు సెలవు ఇస్తున్నట్లు ప్రకటించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశంలో నిరంకుశ పరిపాలన కొనసాగిస్తూ దేశాన్ని విచ్ఛిన్నం చేయటానికి ప్రయత్నిస్తోందని విమర్శించారు. త్రిపుల్ తలాక్ బిల్లు తేవటం ద్వారా ముస్లిములను అణగ తొక్కటానికి విశ్వ ప్రయత్నం చేస్తోందన్నారు. దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీర్పును గౌరవించకుండా దేశంలో అభివద్ధి పథంలో ముందుకుపోతున్న సుందరమైన రాష్ట్రం కేరళను శబరిమల పేరుతో మతోన్మాద శక్తులు అతలాకుతలం చేస్తున్నాయన్నారు. బాంబులతో దాడులు జరిపి విధ్వంసం సష్టిస్తున్నాయని విమర్శించారు. ఉత్తరప్రదేశ్‌లో అఖిలేష్, మాయావతి సీట్ల ఒప్పందానికి వస్తే అది గిట్టక వారిపై సిబిఐని ఉసిగొల్పారన్నారు. ప్రజాస్వామ్యంలో రాష్ట్రాలు, కేంద్రం మధ్య అధికారాల గురించి రాజ్యాంగంలో అంబేద్కర్ స్పష్టంగా పేర్కొన్నారని, దానిని కాలరాచి రాష్ట్రాలపై పెత్తనం చెలాయించే ప్రమాదకరమైన అప్రజాస్వామిక విధానాన్ని కేంద్రం ముందుకు తెచ్చిందన్నారు. తెలుగు వారిగా ఆత్మగౌరవంతో కేంద్రం పెత్తనంపై పోరాడాలన్నారు. రాఫెల్ కుంభకోణంలో బిజెపి పూర్తిగా కూరుకుపోయిందన్నారు. అవినీతి, నిరంకుశ విధానాలను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాల న్నారు.

భవిష్యత్ విద్యుత్ వాహనాలదే : సిఎం

తొలుత వివిధ శాఖలు ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్‌ను ఆయన పరిశీలించారు. అవెరా కంపెనీ ఎలక్ట్రిక్ స్కూటర్లను పరిశీలించారు. ఆసక్తితో దానిని కొద్దిసేపు నడిపారు. వివిధ శాఖలు ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను సిఎం తిలకించారు. గర్భిణులకు పసుపు, కుంకుమ, గాజులు అందించి సీమంతం నిర్వహించారు. పౌష్టికాహారాన్ని అందించి చిన్నారులను దీవించారు. అలాగే ఎస్‌సి కార్పొరేషన్ ఆధ్వర్యాన లబ్ధిదారులకు ఉపకరణాలు పంపిణీ చేశారు. సంక్రాంతి వేడుకల్లో భాగంగా బోగి మంటలను వెలిగించి సంప్రదాయబద్ధంగా కట్టెల పొయ్యిపై సిఎం బొబ్బిళ్లతో పొంగలి చేశారు. అనంతరం సాంప్రదాయ క్రీడలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు, కొల్లు రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.



ఎలక్ట్రిక్ బైక్‌ను నడుపుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

గుంటూరు టిడిపిలో అసమ్మతి సెగలు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి
గుంటూరు జిల్లా టిడిపిలో అసమ్మతి సెగలు రాజుకున్నాయి. తాడికొండ, గుంటూరు పశ్చిమ, మంగళగిరి, మాచర్ల, బాపట్ల నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జుల స్థానంలో కొత్తవారికి అవకాశం ఇవ్వాలంటూ కొన్ని సామాజిక తరగతుల నాయకులు పట్టుపడుతున్నారు. తాజాగా ఆదివారం తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్‌కు వ్యతిరేకంగా ద్వితీయ శ్రేణి నాయకులు గుంటూరులో భేటి అయ్యారు. దీనికి జిల్లా పరిషత్ వైస్‌చైర్మన్ వడ్లమూడి పూర్ణచంద్రరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పూర్ణచంద్రరావు, శ్రావణ్‌కుమార్‌కు చాలా కాలంగా విభేదాలు కొనసాగుతున్నాయి. గతంలో జిల్లా పంచాయతీ అధికారిగా పనిచేస్తూ టిడిపిలో చేరిన శ్రావణ్‌కుమార్ 2009లో తాడికొండ నుంచి అసెంబ్లీ స్థానానికి పోటీ చేసి ఓడిపోయినా 2014లో గెలిచారు. అయితే ఆయన ఎమ్మెల్యే అయినా కార్యకర్తలు, నాయకులతో జిల్లాస్థాయి అధికారిగానే వ్యవహరిస్తున్నారని ఒక గ్రూపు నాయకులు ఆరోపిస్తున్నారు. శ్రావణ్‌కుమార్ తీరుపై టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు గల్లా అరుణకుమారి సమక్షంలో గతంలోనే పలుమార్లు అసమ్మతి సమావేశాలు నిర్వహించారు. ఆదివారం నిర్వహించిన సమావేశంలో మాజీ సర్పంచ్‌లు, పలువురు ఎంపిటిసిలు హాజరయ్యారు. శ్రావణ్‌కుమార్ అయితే తాడికొండలో టిడిపి గెలవదని, అందువల్ల అందరికీ ఆమోదయోగ్యమైన అభ్యర్థిని ఎంపిక చేయాలని తీర్మానించారు. ఈ మేరకు త్వరలో జిల్లా నాయకుల ద్వారా సిఎం చంద్రబాబును కలవాలని నిర్ణయించారు. మాజీ మంత్రి ప్రత్తిపాడు ఎమ్మెల్యే రావెల కిషోర్‌బాబు నవంబరు 30న టిడిపికి రాజీనామా చేసి జనసేనలో చేరారు. ఈ నియోజకవర్గంలో ఇప్పటి వరకూ దళిత నాయకుడ్ని ఇన్‌ఛార్జిగా ఎంపిక చేయలేకపోయారు. జిల్లాలో దళితులకు రిజర్వు చేసిన నియోజకవర్గాల్లో పరోక్షంగా పెత్తందారీ సామాజిక తరగతుల ఆధిపత్యం కొనసాగుతోంది. జన్మభూమి నిర్వహణ నేపథ్యంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ దాసరి రాజా మాస్టారుకు ఇన్‌ఛార్జిగా ప్రొటోకాల్ పాటించేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నియోజకవర్గంలో మొత్తంగా పార్టీ వ్యవహారాలను గల్లా అరుణకుమారి పర్యవేక్షిస్తున్నారు. గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే మోదుగుల వేణుగోపాలరెడ్డి స్థానంలో మిర్చి యార్డు మాజీ చైర్మన్ మన్నవ సుబ్బారావుకు అవకాశం ఇవ్వాలని ఇటీవల మంత్రుల సమక్షంలోనే కొంతమంది సమావేశంలో ప్రస్తావించారు. మంగళగిరిలో ఇన్‌ఛార్జి గంజి చిరంజీవి స్థానంలో మరో అభ్యర్థిని ఎంపిక చేయాలని అధిష్టానానికి జిల్లా నాయకులు ఇప్పటికే నివేదికలు పంపారు. మాజీ మంత్రి మురుగుడు హనుమంతరావుకు ఇక్కడ అవకాశం ఇస్తారని ప్రచారమవుతోంది. మాచర్ల, బాపట్ల నియోజకవర్గాల్లోనూ ఇన్‌ఛార్జులు కొమ్మారెడ్డి చలమారెడ్డి, అన్నం సతీష్ ప్రభాకర్ (ఎమ్మెల్సీ) స్థానంలో కొత్తవారిని ఎంపిక చేసేందుకు పార్టీ అధిష్టానం ఇప్పటికే పలు సర్వేలు నిర్వహించింది. వీరితో పాటు జిల్లాలో సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో అంతర్గతంగా ఉన్న అసంతృప్తిపైనా పార్టీ అధిష్టానం వివిధ రూపాల్లో సర్వే చేయిస్తోంది.

చిన్నారుల్లో పోషకాహార లోపం

- దక్షిణాదిలో రాష్ట్రానిది రెండో స్థానం
- గత రెండేళ్లుగా పిల్లల ఎదుగుదలలో కానరాని పురోగతి
- అత్యధికంగా శ్రీకాకుళంలో ఎదుగుదల లోపమున్న చిన్నారులు
- బరువు తక్కువున్న చిన్నారులు కర్నూలులో అధికం



2017లో నీతి ఆయోగ్ గణాంకాలు

పోషకాహార సమస్య	ఏపి	తెలంగాణ	కేరళ	కర్ణాటక	తమిళనాడు
వయసుకు తగ్గ ఎత్తు లేని చిన్నారుల శాతం	31.4	28.1	19.7	36.2	27.1
వయసుకు తగ్గ బరువు లేని చిన్నారుల శాతం	31.9	28.5	16.0	35.2	23.8

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
పోషణ్ అభియాన్, ఐసిడిఎస్ వంటి పలు పథకాల్ని ప్రభుత్వం అమలు చేస్తున్నా చిన్నారుల్లో పౌష్టికాహారలోపాన్ని నియంత్రించలేకపోతోంది. 2018-19 బడ్జెట్ నుంచి ప్రత్యేక పోషకాహార కార్యక్రమాన్ని ప్రారంభించినా అనుకున్న లక్ష్యాలను చేరుకోలేకపోతోంది. పోషకాహారలోపం కారణంగా పిల్లల్లో ఎదుగుదల లోపం (స్టంటెడ్ గ్రోత్), తక్కువ బరువు (అండర్ వెయిట్) సమస్యల్లో దక్షిణాదిలో ఏపి రెండోస్థానంలో ఉంది. రాష్ట్రంలో ఎదుగుదల లోపం ఉన్న చిన్నారుల శాతం 2015-16లో 31.4 ఉంటే, 2018 డిసెంబర్ నాటికి కూడా ఆ సంఖ్యలో మార్పు లేదు. తాజాగా వైద్యఆరోగ్య శాఖ వెల్లడించిన గణాంకాల ప్రకారం రాష్ట్రంలో సరాసరి ఎదుగుదలలో లోపం వున్న చిన్నారుల శాతం 31గా ఉంది. అంటే గత రెండేళ్లుగా ఇందులో పెద్దగా మార్పు కనిపించడంలేదని స్పష్టమవుతోంది. పోషకాహారలోపం సమస్య ప్రభుత్వానికి చిన్నదిగానే అనిపించినా, అనేక రోగాలకు అదే కారణమని పలువురు వైద్యులు విశ్లేషిస్తున్నారు. ఇక మన రాష్ట్రంలో అత్యధికంగా మరణాలకు కారణమయ్యే వివిధ అంశాలలో అన్నింటికంటే ఎక్కువగా పోషకాహారలోపమే కారణమని, 11.7 శాతం మంది చిన్నారులు ఈ సమస్య వల్లే మరణిస్తున్నారని ఐసిఎమ్‌ఆర్ - పబ్లిక్ హెల్త్ ఆఫ్ ఇండియా ఆయా రాష్ట్రాల ఆరోగ్య పరిస్థితులపై ఇచ్చిన నివేదికలో వెల్లడించింది. పోషకాహార లోపం కారణంగా ఐదేళ్లలోపు చిన్నారులు వయసుకు తగినట్లుగా ఎత్తు లేకపోవడం, బరువు తక్కువగా ఉండటం వంటి సమస్యలకు కారణమవుతోంది. ప్రస్తుతం రాష్ట్రంలో ఎదుగుదల లోపమున్న చిన్నారులు 31 శాతం ఉంటే, బరువు తక్కువ చిన్నారులు 6.10 శాతం ఉన్నట్లుగా రాష్ట్ర ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. కానీ ఇదే అంశం పై గతేడాది నీతిఆయోగ్ ఇచ్చిన గణాంకాలు పరిశీలిస్తే మన రాష్ట్రంలో బరువు తక్కువ వున్న చిన్నారుల శాతం 31.9గా ఉంది. ఇక జిల్లాలవారీగా చూస్తే ఎదుగుదల లోపం ఉన్నవారు అత్యధికంగా శ్రీకాకుళంలో 37.5 శాతం ఉంటే, బరువుతక్కువ గల చిన్నారులు ఎక్కువగా కర్నూలులో 10.3 శాతం ఉన్నట్లు స్పష్టమవుతోంది.

ఐసిడిఎస్ ద్వారా అందించే ప్రత్యేక పోషకాహార కార్యక్రమం కేవలం వారికి అదనపు పోషణే తప్ప పూర్తిస్థాయిలో సరిపడా పోషకాహారాన్ని అందించే పరిస్థితిలేదని పలువురు విశ్లేషిస్తున్నారు. పేదరికం కారణంగానే వారికి సరైన పోషణ అందడంలేదని అంటున్నారు. ఇందుకు సరఫరా చేస్తున్న సరుకుల్లోనూ నాణ్యత లేవనే విమర్శలున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసే సరుకుల్లో నాణ్యత లేకపోవడం వల్ల అక్కడ అందించే ఫీడింగ్ పట్ల కూడా పలువురు లబ్ధిదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు ఆర్టీజీ అధికారుల సర్వేలో తేలింది. అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన పథకం కోసం నాణ్యమైన సరుకులు సరఫరా చేయాలని అభిప్రాయపడుతున్నారు.

చంద్రబాబు, పవన్‌లను కలిసిన ఆలీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
నటుడు ఆలీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను ఆదివారం విడివిడిగా కలిశారు. ఉదయం పవన్ కళ్యాణ్‌ను ముందుగా విజయవాడలోని ఆయన నివాసంలో కలిశారు. తరువాత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును ఉండవల్లిలోని సిఎం గ్రీవెన్స్‌హాల్‌లో కలిశారు. ఇటీవల కాలంలో ఆలీ వైసిపిలో చేరబోతున్నట్లు ప్రచారం జరిగిన నేపథ్యంలో చంద్రబాబును, పవన్‌ను కలవడం చర్చనీయాంశంగా మారింది.

స్థానిక సంస్థలు బలోపేతం కావాలి

పవన్‌ను కలిసిన లోకల్ గవర్నమెంట్ ఛాంబర్ ప్రతినిధులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
స్థానిక సంస్థల భలోపేతానికి చొరవ తీసుకోవాలని లోకల్ గవర్నమెంట్ ఛాంబర్ సభ్యులు జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్‌ను కోరారు. విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం పవన్‌ను కలిసిన వీరు హైకోర్టు ఆదేశాల మేరకు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని, లేని పక్షంలో ప్రత్యేకాధికారుల పాలన రద్దు చేసి, ఎన్నికల నిర్వహిం చే వరకూ సర్పంచ్‌లను, పాలకవర్గాన్ని ఆపద్ధర్మంగా కొనసాగించాని సూచించారు. 73వ రాజ్యంగ సవరణని అమలు పరిచే అంశాన్ని అన్ని పార్టీలు మేనిఫెస్టోలో చేర్చాలన్న డిమాండ్‌తో త్వరలో నిర్వహించనున్న సదస్సుకి పవన్‌ను ఆహ్వానించారు. పవన్‌ను కలిసిన వారిలో లోకల్ గవర్నమెంట్ ఛాంబర్ అధ్యక్షులు మామిడి అప్పలనాయుడు, సభ్యులు పి.కె రంగారావు, జి.వీరభద్రాచారి, అమరసర్వ దేవుళ్ళ, విజయకుమార్, పి.లక్ష్మయ్య, సూర్యచంద్రరావు, గంటా కృష్ణ, దాసరి సత్యనారాయణ మూర్తిలు ఉన్నారు.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68